


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయండి 04

బిహార్‌లో చొరబడ్డ ఉగ్రవాదులు 05

సంపుటి 08, సంచిక: 268 | శుక్రవారం | 29-08-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# ఉత్తర తెలంగాణలో జలవిలయం

## ఉమ్మడి మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో కుంభవృష్టి



- ఎటుచూసినా నీరు.. ప్రజల కళ్లలో కన్నీరు
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు, మత్తడిదూకుతున్న చెరువులు
- కాలనీలు, లోతట్టు ప్రాంతాలలో జలతాండవం
- కొట్టుకుపోయిన రోడ్లు, రైలుమార్గం, నేలకొరిగిన కరెంటు స్తంభాలు

**వెయ్యిమందిని రక్షించిన సహాయక బృందాలు**

- ఆహారం, తాగునీటికోసం జనాల ఎదురుచూపులు

కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్, మెదక్ జిల్లాల్లో

### అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు

రెడ్ అలెర్ట్ జారీ

రాష్ట్రంలో వర్షాలు దంచికొడుతున్నాయి. కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో కుండపోతగా కురిసిన వర్షాలతో జన జీవనం స్తంభించిపోయింది. వాగులు వంకలు పొంగిపొర్లుతునాయి. మరోసారి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. గురువారం కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్, మెదక్, జిల్లాల్లో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని తరువాయి 2లో

జిల్లాల నుంచి ప్రజాపక్షం ప్రతినిధులు

భారీ వర్షాలు రాష్ట్రంలోని పలు జిల్లాలను ముంచెత్తాయి. ముఖ్యంగా గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలతో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాలు చిగురుటాకులా వణికిపోయాయి. రికార్డు స్థాయి వర్షాలతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఆకాశానికి చిల్లులు పడ్డాయా అన్నట్లుగా కురిసిన వానలతో వాగులు, వంకలు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. పోటెత్తిన వరద ప్రవాహానికి, పలుచోట్ల చెరువులు, రోడ్లు తెగిపోయాయి. రహదారులు తెగిపోయి రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలను వరద చుట్టుముట్టడంతో ఇళ్లు జలమయ్యాయి. ఉమ్మడి కరీంనగర్, మెదక్ జిల్లాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏరియల్ సర్వే నిర్వహించారు. రాష్ట్రంలోని ఆయా తరువాయి 2లో





### కాళేశ్వరం లోపాలపై నిపుణులతో చర్చిస్తాం

- గోదావరి జిల్లాలకు ప్రాణవాయువు ఎల్లంపల్లి
- శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును పరిశీలించిన సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్/పెద్దపల్లి

లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై నిపుణులతో చర్చిస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఏరియల్ మార్గం ద్వారా పెద్దపల్లి జిల్లా లోని గోలి వాడ పంప్ హౌస్ వద్ద ఉన్న హెలిపాడ్ వద్దకు హెలికాప్టర్ ద్వారా చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పుష్ప గుచ్చం అందజేసి స్వాగతం పలికారు.అనంతరం అంతర్గాం లోని శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్ ప్రాజెక్టు ను సిఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర భారీ నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి తరువాయి 2లో

75 ఏళ్ళకు రిటైర్మెంట్

### అనలేదు

మాటమార్చిన మోహన్ భాగవత్



**న్యూఢిల్లీ:** నాయకులు 75 వయసు నిండగానే పదవీ విరమణ చేయాలని తానెప్పుడూ చెప్పలేదని ఆర్‌ఎస్‌ఎస్ ప్రధానాధిపతి మోహన్ భాగవత్ అన్నారు. ఏ నాయకుడినీ ఉద్దేశించి 75 ఏళ్ళకు పదవీ విరమణ చేయాలని తాను చెప్పలేదన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ పూర్వ నాయకుడు మోరో పంత్ పింగ్లే హాస్యోక్తిగా చెప్పిన ఆ మాటలు కేవలం తాను గుర్తుచేసుకున్నానన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, మోహన్ భాగవత్ ఇద్దరూ వచ్చేనెలకు 75 ఏళ్ళు నిండుతున్న సందర్భంలో మోహన్ భగవత్ పైవిధంగా ఉద్ఘాటించారు. తానుగానీ, మరెవ్వరైనాగానీ 75 ఏళ్ళు వయసు నిండగానే పదవి నుండి వైదొలగాల్సిందేనని తానెప్పుడూ చెప్పలేదని అన్నారు. నాయకుల పదవీ విరమణ వయసుపై ఇటీవల ఆయన వ్యాఖ్యలపై వందతులు వ్యాపించాయి. ఆ వదంతులన్నిటికీ ఫుల్‌స్టాప్ పెట్టేందుకు మోహన్ భగవత్ గురువారం తరువాయి 2లో

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సమస్యలపై

### లక్షల మందితో తెలంగాణను దిగ్బంధిస్తాం



- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రకటన
- సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభ నిర్ణయాలు, తీర్మానాలు, భవిష్యత్ కార్యాచరణ వెల్లడి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధ్యమైనన్ని ఎక్కువ స్థానాల్లో పోటీచేస్తామని వ్యాఖ్య
- కలిసొచ్చిన చోట కాంగ్రెస్, సిపిఐ(ఎం)లతో పొత్తు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ సమగ్ర, సమ్మిళితాభివృద్ధితో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో త్వరలోనే లక్షల మందితో తెలంగాణను దిగ్బంధనం చేయనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రకటించారు. హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో సిపిఐజాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహా, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాలనర్సింహాతో కలిసి గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. ఈ నెల 20 నుంచి 22 వరకు మూడు రోజుల పాటు మేడ్చల్ జిల్లా గాజుల రామరంలో జరిగిన సిపిఐ రాష్ట్ర 4వ మహాసభ తరువాయి 12లో

**మట్టి మనుషుల సాయుధ పోరాట స్ఫూర్తిని భావి తరాలకు అందించాలి**

చాడ వెంకటరెడ్డి

మట్టి మనుషులను సాయుధులను చేసి సమరం నడిపిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తిని భావి తరాలకు అందించేందుకు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో 'స్మృతి వనం' ఏర్పాటు చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. సాయుధ పోరాటం లేకుండా తెలంగాణ లేదని, ప్రపంచ చరిత్రలో లిఖించబడిన అలాంటి మహత్తర పోరాటానికి హైదరాబాద్‌లో స్థానం కల్పించకపోవడం ప్రభుత్వాలకే తలవంపు అన్నారు. ప్రభుత్వం తక్షణమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుల పేరుతో నగరంలో స్మృతి వనం నిర్మించాలని చాడ వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు.



### ఉపరాష్ట్రపతి ప్రతిపక్షాల అభ్యర్థికి సిపిఐ సంపూర్ణ మద్దతు

- ఢిల్లీలోని అజయ్‌భవన్‌కు వెళ్లిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి
- స్వాగతం పలికిన సిపిఐ ప్రధాన కార్యదర్శి రాజా తదితరులు

**న్యూఢిల్లీ:** ఉపరాష్ట్రపతి పదవికి పోటీ చేస్తున్న ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి గురువారం న్యూఢిల్లీలోని భారత కమ్యూనిస్టుపార్టీ కార్యాలయం (సిపిఐ) అజయ్ భవన్‌కు వెళ్ళారు. పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజాతో పాటు సిపిఐ జాతీయ కార్యదర్శివర్గసభ్యుడు కె.నారాయణ, పల్లబ్‌సేన్‌గుప్తా, రామకృష్ణపాండా, డా.గిరిష్ ఆయనకు స్వాగతం పలికారు. ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌కర్ ఆకస్మిక రాజీనామా, రాజ్యాంగంపట్ల గణతంత్ర వ్యవస్థలో అత్యున్నతమైన ఈ పదవి కున్న ప్రతిష్ఠపట్ల అధికార బిజెపికి ఉన్న అగౌరవాన్ని, అమర్యాదనూ బహిర్గతం చేసింది. ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై బిజెపి చేస్తున్న నిరంకుశ దాడికి వ్యతిరేకంగా జరుగుతున్న కీలక సైద్ధాంతిక పోరాటంలో ప్రతిపక్ష ఉమ్మడి అభ్యర్థి తరువాయి 12లో



25 వేల విగ్రహాలు

### 30 వేల మంది పోలీసులు

- నిమజ్జనానికి భారీ పోలీసు బందోబస్తు
- కమిషనర్ సివి ఆనంద్

ప్రజాపక్షం/హైదరాబాద్

గణేష్ నిమజ్జనాకి 30 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్ వెల్లడించారు. పోలీసు అధికారులతో కలిసి ఆయన గురువారం ఖైరతాబాద్ వినాయకుడికి పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా సివి ఆనంద్ మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్ కమిషనర్ గా గణేష్ విగ్రహం ప్రతిష్ఠించిన రెండవ రోజునే ఖైరతాబాద్ గణేష్‌ను తరువాయి 12లో

**బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమానికి పాతికేళ్లు...**




విద్యుత్ అమరులకు వామపక్షాలు, కాంగ్రెస్ నేతల ఘననివాళి




### చికితకు ఘన స్వాగతం

ప్రజాపక్షం/హైదరాబాద్

కెనడాలోని విన్నిపెగ్‌లో జరిగిన ప్రపంచ ఆర్చరీ యూత్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం కైవసం చేసుకున్న చికిత తానిపర్తికి శంషాబాద్ విమానాశ్రయంలో గురువారం ఘన స్వాగతం లభించింది. శంషాబాద్ విమానాశ్రయంలో క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్ అథారిటి ఛైర్మన్ శివసేనారెడ్డి, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, విజయరమణారావుతో పాటు క్రీడాభిమానులు ఆమెకు ఘన స్వాగతం పలికి ప్రభుత్వం తరపున అభినందనలు తెలిపారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన చికిత తానిపర్తి ప్రపంచ ఆర్చరీ యూత్ ఛాంపియన్‌షిప్‌లో అండర్21 మహిళల విభాగంలో స్వర్ణ పతకం సాధించిన విషయం తెలిసిందే.





# ప్రపంచం
WORLD NEWS

## అమెరికా స్కూల్లో కాల్పులు : ఇద్దరు మృతి

### పోప్ లీ సంతాపం

**మిన్నెపొలిస్:** అమెరికాలోని మిన్నెపొలిస్‌లో ఉన్న ఒక స్కూలులో కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు పిల్లలు మరణించారు. మరో 17 మంది గాయపడ్డారు. ఈ కాల్పులకు పాల్పడిన వ్యక్తి కూడా తనను తాను కాల్చుకుని మరణించాడు. క్యాథలిక్ వ్యతిరేకత, వారిపట్ల ద్వేషంతో ఈ దాడులు జరిగినట్లు ఎఫ్‌బిఐ అధికారులు పేర్కొన్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నారు. దీనిని దేశీయ ఉగ్రవాదంగా ఎఫ్‌బిఐ డైరెక్టర్ పటేల్ పేర్కొన్నారు. మరణించిన ఇద్దరు పిల్లలూ పదేళ్ళలోపు వయసువారే. దుండగుణ్ణి రాబిన్ వెస్ట్‌మేన్‌గా ఎఫ్‌బిఐ గుర్తించింది. 23 ఏళ్ళ యువకుడు ఈ చర్యకు పాల్పడేందుకు తక్షణ కారణం కోసం దర్యాప్తు చేస్తున్నారు. మరణించిన స్కూలు పిల్లలకు పోప్ లీ–14 సంతాపం వ్యక్తం చేశారు. అమాయకులైన పిల్లలపై ఉద్దేశపూర్వకంగా చేసిన పాశవిక హింసాకాండగా ఆయన పేర్కొన్నారు.

## ఉక్రేన్‌లో ఏడు జిల్లాలపై రష్యా దాడి : 17 మంది మృతి

### దెబ్బతిన్న 100 భవంతులు, షాపింగ్ మాల్స్

**కీవ్ :** ఉక్రేన్ రాజధాని కీవ్‌పై రష్యా 598 డ్రోన్లు, మరో 31 క్షిపణులతో దాడులు చేసింది. సెంట్రల్ కీవ్ ప్రాంతంలో రష్యా చేసిన ఈ అరుదైన దాడుల్లో 17 మంది మరణించారు. మరో 48 మంది గాయపడ్డారు. బ్రిటన్, యూరోపియన్ యూనియన్ దౌత్యకార్యాలయాల భవంతులు కూడా ఈ దాడుల్లో తీవ్రంగా దెబ్బతిన్నా యి. మరణించిన వారిలో రెండేళ్ళ వయసుగల పిల్లలు ఇద్దరు, 14,17 ఏళ్ళు వయసుగల టీనేజర్లు ఉన్నారు. మృతులసంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉక్రేన్‌లోని ఏడు జిల్లాల్లో 20 ప్రాంతాలపై దాడులు జరిగాయి.



దాదాపు 100కు పైగా భవంతులు ధ్వంసమయ్యాయి. వీటిల్లో సెంట్రల్ కీవ్‌లోని షాపింగ్ మాల్స్ ఉన్నాయి. వేలాది భవంతులు, ఇళ్ళ కిటికీలు తీవ్రంగా దెబ్బతిన్నాయని కీవ్ పాలనాధికారి తైమూర్ త్రైచెంకో చెప్పారు.అదేవిధంగా 2022 ఫిబ్రవరి నుండి జరుగుతున్న ఈ యుద్ధంలో మొదటిసారి మానవ రహిత బోట్ల సహాయంతో ఒక ఉక్రేన్ నౌకను ధ్వంసం చేసి నీట ముంచినట్లు రష్యా అన్‌మేన్డ్ ఎయిర్ క్రాఫ్ట్ టెక్నాలజీ నిపుణుడు డేనిష్ ఫెడిటినోవ్ టాస్ వార్తాసంస్థకు గురువారం చెప్పారు. రాత్రికిరాత్రే ఉక్రేన్ చేసిన దాడుల్లో 102 డ్రోన్లను కూల్చివేసినట్లు కూడా రష్యా రక్షణశాఖ ప్రకటించింది. వీటిలోల్ల ఎక్కువగా వాయు వ్య రష్యాలోనే కూల్చేశామని తెలిపింది. ఇటీవలి కాలంలో ఉక్రేన్ డ్రోన్లు, క్షిపణులు రష్యా చమురు కేంద్రాలపై దాడులు చేస్తున్నాయని, వాటినే లక్ష్యంగా చేసుకుని ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నాయని తెలిపింది. ఉక్రేన్‌వ్యాపంగా అనేక ప్రాంతాలలో వివిధ రకాల క్షిపణులు ప్రయోగించి రష్యా విధ్వంసం సృష్టించిందని కీవ్ ఉన్నతాధికారులు మరోవైపు ప్రకటన చేశారు. డెకోయ్ డ్రోన్స్‌ను, క్రూయిజ్ క్షిపణులు, బాలిస్టిక్ క్షిపణులను రష్యా ప్రయోగించిందని తెలిపారు. ''సంప్రదింపులకోసం శాంతిచర్చల బల్ల దగ్గరకు రాకుండా రష్యా క్షిపణి దాడులనే ఎంచుకుంది'' అని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ పెట్టారు.

ప్రపంచంలోని ప్రతి దేశం నుండీ ఈ ఘటనపై ప్రతిస్పందనను తమ దేశం కోరుకుంటున్నదని ఆయన పేర్కొన్నారు. ప్రతిదేశం శాంతి చర్చలకు పిలుపు ఇవ్వాలని కోరారు. శాంతికోసం తరచు పిలుపు ఇచ్చిన దేశాలు ఇప్పుడు మౌనం పాటిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశా రు.


**రష్యా దౌత్యవేత్తకు బ్రిటన్, ఇయు నిరసన**

ఉక్రేన్‌పై రష్యా దాడులపట్ల బ్రిటన్, యూరోపియన్ యూనియన్ తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. లండన్‌లో ఉన్న రష్యా దౌత్యవేత్తను బ్రిటన్ విదేశీమంత్రిత్వశాఖ కార్యాలయానికి పిలిపించి నిరసన తెలిపింది. బ్రిటన్ విదేశాంగమంత్రి డేవిడ్ లమ్మీ ఈ విషయం ధృవీకరించారు. కీవ్‌పై జరిగిన దాడిని బ్రిటన్ ప్రధానమంత్రి స్టార్‌మర్ ఖండించారు. యూరోపియన్ యూనియన్ కూడా రష్యాకు నిరసన తెలియజేసింది.

## చైనా 80వ విజయోత్సవ వేడుక

### 3వ తేదీన పుతిన్, కిమ్ సహా 26 దేశాల నాయకులు రాక










**బీజింగ్:** చైనా పీపుల్స్ వార్ 80వ విజయోత్సవ వేడుకల నిర్వహణకు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేశారు. ట్రంప్ 'మాగా' నినాదం, టారిఫ్‌ల యుద్ధం నేపథ్యంలో ఉత్తరకొరియా, రష్యాదేశాధినేతలుసహా 26దేశాల నాయకులు, కమ్యూనిస్టుపార్టీల నాయకులు ఈ వేడుకల కు హాజరు కానున్నారు. ప్రపంచంలో రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మాత్రమేకాకుండా, అంతర్జాతీయస్థాయిలో చైనా అతిపెద్ద దౌత్యశక్తిగా ఉందని తన శక్తిసామర్థ్యాలను చాటిచెప్పేందుకు సెప్టెంబరు 3వ తేదీ వేడుక ప్రధాన వేదిక కానున్నది. ఈ వేడుకల ఏర్పాట్లపై మూడు నిమిషాల వీడియోను చైనా విదేశాంగమంత్రిత్వశాఖ గురువారం విడుదల చేసింది.

జపాన్ దురాక్రమణ, ఫాసిజంపై చైనా పోరాటం ఈ ప్రాంతంలో వలస, అర్ధవలస దేశాలకు చైనా పీపుల్స్‌వార్ గొప్పస్ఫూర్తిని ఇచ్చిందని ఈ సందర్భంగా చైనా విదేశాంగశాఖ సహాయమంత్రి హాంగ్ లీ గురువారం మీడియాకు చెప్పారు. అంతర్జాతీయ ఏకస్వామ్య పెత్తనా న్ని కాలగర్భంలో కలిపేందుకు ఆత్మవిశ్వాసాన్ని అందించిందని, ఇప్పుడు గ్లోబల్ సౌత్ (అభివృద్ధి చెందుతున్న దేశాలు) పెరుగుదల ప్రాథమికంగా ప్రపంచ ముఖచిత్రాన్ని పునర్నిర్మిస్తోందన్నారు. ప్రపంచ జిడిపిలో గ్లోబల్ సౌత్ దేశాల వాటా గడచిన 40 ఏళ్ళలో 24 శాతం నుండి 40 శాతానికి పెరిగిందని ఆయన చెప్పారు. గత 20 ఏళ్ళల్లో ప్రపంచ ఆర్థికవృద్ధికి 80 శాతం మేరకు దోహదం చేశాయని, ఈనాడు బ్రిక్స్, ఎపెక్, జి–20 శిఖరాగ్ర సదస్సులు నిర్వహిస్తూ గ్లోబల్ సౌత్ బలమైన వాణి వినిపిస్తూ తమదైన ముద్ర వేస్తున్నాయని హాంగ్ లీ గుర్తుచేశారు. జపాన్ దురాక్రమణ వ్యతిరేక, ఫాసిస్టు వ్యతిరేక యుద్ధ విజయోత్సవంలో పుతిన్ పాల్గొడం ఈ యుద్ధ ఫలితాలను రక్షించుకోవడానికి చైనా–రష్యాలకు ఉన్న చిత్తశుద్ధికి తార్కాణం కాగలదని అన్నారు. రెండు దేశాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో కొత్త శకానికి నాంది కాగలదన్నారు. జపాన్ దురాక్రమణ, ఫాసిస్టు యుద్ధానికి వ్యతిరేకం గా చైనా ప్రజలు ఐక్యంగా పోరాడి సాధించిన విజయానికి చిహ్నంగా ఈ 80వ వార్షిక వేడుకలు జరగనున్నాయి. ఆ రోజున వేలాదిమంది సుశిక్షితులైన చైనా సైనికులు ప్రతిష్ఠాత్మకమైన పరేడ్‌లో పాల్గొంటున్నారు. చైనా తన యుద్ధశక్తిసామర్థ్యాలు, పటిమను ఈ వేడుకల ద్వారా ప్రపంచానికి చాటి చెప్పనున్నది.

రష్యా అధ్యక్షుడు పుతిన్, కొరయా వర్కర్స్‌పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రజాస్వామ్య ప్రజాగణతంత్ర కొరియా (ఉత్తర కొరియా) ప్రభుత్వ వ్యవహారాల అధ్యక్షుడు, కిమ్ జోంగ్ ఉన్, క్యూబా కమ్యూనిస్టుపార్టీ సెంట్రల్ కమిటీ మొదటి కార్యదర్శి, క్యూబా అధ్యక్షుడు మిన్ డియాజ్ కానెల్, మయన్మార్ తాత్కాలిక అధ్యక్షుడు మిన్ ఆంగ్ హ్లైంగ్, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్, కాంబోడియా రాజు నోరోడమ్ సిహమోనీ, లుయాంగ్ కువాం గ్, లావో పీపుల్స్ రివల్యూషనరీపార్టీ సెంట్రల్ కమిటీ ప్రధాన కార్యదర్శి, లావో దేశాధ్యక్షుడు థోంగ్లౌన్ సిసౌలిత్, ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో, మలేసియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం, మంగోలియా అధ్యక్షుడు ఉఖ్నా ఖురెల్సుఖ్, పాకిస్థాన్ ప్రధానమంత్రి షాబాజ్ షరీఫ్, నేపాల్ ప్రధానమంత్రి కె.పి.శర్మ ఓలి, మాల్దీవుల అధ్యక్షుడు మొహ్మద్ మొయిజ్జు, కజఖ్ అధ్యక్షుడు కాసిమ్ జోమార్ట్ టోకయేవ్, ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షావ్కత్ మిర్జియోయెవ్, తజికిస్థాన్ అధ్యక్షుడె ఎమోమోలీ రహ్మోన్ సహా ఆర్మేనియా, కాంగో, జింబా బ్వే, సెర్బియా, స్లోవేకియా తదితర దేశాల నాయకులు, ఆయా దేశాల కమ్యూనిస్టుపార్టీల అగ్రనేతలు ఈ విజయోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఆహ్వానం మేరకు వీరంతా తరలివస్తున్నారు.

**31,1 తేదీల్లో ఎస్‌సిఓ సదస్సు**

షాంఘై సహకార సదస్సు (ఎస్‌సిఓ) ఉత్తర చైనా తియాన్‌జిన్ పట్టణంలో ఈనెల 31, సెప్టెంబరు 1వ తేదీలలో నిర్వహిస్తారు. ఈ 25 వ సదస్సులో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ చురుకైన పాత్ర నిర్వహించనున్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా 20 కిపైగా దేశాల అధినేతలు, మరో పది అంతర్జాతీయ సంస్థల అధిపతులు ఈ సదస్సులో పాల్గొంటారు. ఎస్‌సిఓ ఆవిర్భవించాక ఇంత భారీస్థాయిలో, ఘనంగా సదస్సు నిర్వహించాలని నిర్ణయించడం ఇదే ప్రథమం. దీని కొనసాగింపుగా సెప్టెంబరు మూడో తేదీన చైనా విక్టరీ వేడుకలు జరుగుతాయి.

ఎస్‌సిఓ సదస్సులో జిన్‌పింగ్ కీలక ఉపన్యాసం చేస్తారు. రాబోయే పది సంవత్సరాలకుగాను అత్యున్నత స్థాయీ నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఎస్‌సిఓ అభివృద్ధి ప్రణాళికను ఆవిష్కరించనున్నారు. పొరుగుదేశాలతో దౌత్యకార్యకలాపాలను సానుకూలమార్గంలో అభివృద్ధి చేసుకునేందుకు చైనా చేపట్టిన కార్యకలాపాలలో ఈ ఎస్‌సిఓ సమావేశానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. రెండవ ప్రపంచయుద్ధంలో ఫాసిజంపై విజయం, ఐక్యరాజ్యసమితి 80వ వార్షికోత్సవ వేడుకల నేపథ్యంలో ఎస్‌సిఓ దేశాల భద్రత, ప్రజలమధ్య పరస్పర సాంస్కృతిక సహకారం, ఆర్థికవృద్ధికి సంబంధించిన అనేక తీర్మానాలు, పత్రాలు సదస్సులో చర్చకు రానున్నాయి.

## రిటైర్మెంట్ అనలేదు (మొదటి పేజీ తరువాయి)

తాజా ప్రకటన చేశారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతవార్షికోత్సవాల సందర్భంగా న్యూఢిల్లీలో పాత్రికేయులు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ, ''జీవితంలో మేం ఏ క్షణంలోనైనా పదవీ విరమణ చేసేందుకు సిద్ధంగా ఉన్నాం, సంఘ్ మమ్మల్ని ఎంతకాలం పనిచేయమంటే అంతకాలం పనిచేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నాం'' అన్నారు. 75 ఏళ్ళకు నాయకులు పదవీ విరమణ చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ మరణించిన నాయకుడు మోరోపంత్ పింగ్లేకు 75 ఏళ్ళు నిండిన సందర్భంగా శాలువా కప్పి సన్మానించారని, అప్పుడు ఆయన చతురోక్తిగా మాట్లాడుతూ, ఈ శాలువా కప్పారంటే తనను మాట్లాడకుండా ఓ మూల కూర్చోమని అర్థమని అన్నారని ఆ విషయమే తాను నాగపూర్‌లో ఇటీవల జరిగిన సమావేశంలో గుర్తుచేశాను తప్ప ఎవరినీ ఉద్దేశించి అనలేదన్నారు.

## ఉత్తర తెలంగాణలో జలవిలయం (మొదటి పేజీ తరువాయి)

ప్రాంతాల్లో వరదల్లో చిక్కుకున్న సుమారు 1510 మందిని రక్షించినట్లుగా డిజిపి డాక్టర్ జితేందర్ తెలిపారు. భారీ వర్షాల వల్ల దక్షిణ మధ్య రైల్వే శాఖ పలు రైళ్లను రద్దు చేసింది. మరికొన్ని రైళ్లను మళ్లించింది. భారీ వర్షాల కారణంగా పట్టాలపైకి పైనుంచి వరదలు వస్తున్న కారణంగా ఈ నిర్ణయం తీసుకుంది.

**ఆదిలాబాద్‌లో ఏకధాటిగా 5 గంటలు :** భారీ వర్షాలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను వణికించాయి. బుధవారం సాయంత్రం నుంచి దాదాపు 5 గంటలకు పైగా ఏకదాటిగా వర్షం కురిసింది. ఆదిలాబాద్ పట్టణంలోని రవీంద్రనగర్, శాంతినగర్ కాలువలలో భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. వర్ష బీభత్సానికి భీంపూర్ మండలం అంధకారంలో చిక్కుకుంది. పలు ప్రాంతాల్లో చెట్లు విరిగి పడడంతో విద్యుత్ తీగలు తెగిపడి 26 పంచాయతీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. లక్ష్మణచాంద మండలం మునిపల్లి చెందిన ముగ్గురు పశువుల కాపరులు గోదావరి ఉద్ధృతిలో చిక్కుకున్నారు. నది ఆవలకు పశువులను మేతకు తీసుకెళ్లిన కాపరులు నీటిమట్టం పెరగడంతో చిక్కుకుపోయారు. జిల్లా ఎస్‌పి, కలెక్టర్ స్పందించి రెస్క్యూ బృందాలను బరిలోకి దింపారు. ఇద్దరిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చి, మరొకరి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

**నిర్మల్ కకావికలం :** కుండపోత వానలకు నిర్మల్ జిల్లా కకావికలమైంది. వరద కాలువలు భయంకరంగా ప్రవహిస్తున్నాయి. భారీ వర్షానికి పట్టణంలోని నటరాజ్ నగర్, ప్రియదర్శిని నగర్, సాగర్ కాలనీ, దివ్యనగర్, ఇంద్రానగర్, లోతట్టు ప్రాంతాల జలమయం అయ్యాయి. రహదారులు చెరువులను తలపించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పట్టణంలోని ఓ కాలనీలో వరద నీటిలో చిక్కుకున్న ఓ కుటుంబాన్ని స్థానికులు రక్షించారు. ఎగువ నుంచి వస్తున్న వరదనీటితో కడెం నారాయణరెడ్డి, స్వర్ణ ప్రాజెక్టులు నిండుకుండల్లా మారాయి. అధికారులు కడెం జలాశయం 4 గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. గురువారం జిల్లా మొత్తంలో 2527.4 మి,మీటర్ల వర్షం కురువగా,సగటు 133.మి. మీ. వర్షపాతం నమోదైంది. నిర్మల్ పట్టణ పరిధిలో 332.8 మి.మి, నిర్మల్ మండలంలో 332.4 మి.మీ, లక్ష్మణచాంద 218.6, సోన్ 208.4, సర్సాపూర్ జి 202.6, సారంగాపూర్ 187.2, కుంటాల 165.4, దిలావర్పూర్ 1644, లోకేశ్వరం 125.2, దస్తూరాబాద్ 115.4,ఖానాపూర్ 80.8, మామడ 78.4, కడెం 74.4,పెంబి 51.4,బైంసా 44.6,ముధోల్ 39.2,తానూర్ 38.2,బాసర 38, కుబీర్ 10 మి,మీటర్లు కురిసింది.

**నిజామాబాద్, కామారెడ్డిలో జనజీవనం అస్తవ్యస్తం :** నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో దంచికొట్టిన వానలతో జనజీవనం అస్తవ్యస్తమైంది. బుధవారం ఒక్కరోజే కామారెడ్డి జిల్లాలోని రాజంపేటలో 44 సెంటి మీటర్ల వర్షం కురవగా గురువారం ఉదయం నాలుగు గంటల వ్యవధిలోనే రామారెడ్డి ప్రాంతంలో 17 సెంటి మీటర్ల వర్షం కురిసింది. రెండు రోజులుగా కుండపోతగా కురిస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. దోంగ్లి మండలంలోని సిర్పూర్, పెద్దటాక్లీ గ్రామాల్లోని ప్రజలు ఇళ్లు ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. పొరుగు గ్రామాల్లోని తమ బంధువుల ఇళ్లలో తలదాచుకుంటున్నారు. పల్వంచ మండలం బండారమేశ్వర్ పల్లి చుక్కాపూర్ మధ్యలో ఉన్న రోడ్డు వరద తీవ్రతకు కొట్టుకుపోయింది. బీబీపేట నుంచి కామారెడ్డికి వచ్చే దారిలో వరద ఉధృతికి బ్రిడ్జి కుంగిపోవటంతో రాకపోకలు నిలిచిపోయాయి. సిరికొండ మండలం కొండూరు శివారులో హైలెవెల్ వంతెన వద్ద రోడ్డు కొట్టుకుపోయింది. కప్పల వాగుకు భారీ వరద రావడంతో ఐదేళ్ల క్రితం నిర్మించిన వంతెన కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. వరద ఉధృతికి కొండూరు, గడ్కోల్ గ్రామాలు జలమయమయ్యాయి. నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా 1,81,312 క్యూసెక్కుల వరదనీరు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరుతుందని నిజాం సాగర్ ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుందని ప్రాజెక్టు అధికారులు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ మేరకు వరద గేట్ల ద్వారా 2,20,256 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టు 27 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు వెల్లడించారు. అలీసాగర్ రిజర్వాయర్ ఎగువ ప్రాంతమైన నిజాంసాగర్‌లోకి అధికంగా వరదనీరు వచ్చి చేరడంతో ఆ నీటిని అలీసాగర్ జలాశయంలోకి వదులుతున్నారు. అలీసాగర్ రిజర్వాయర్‌లోకి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో అలీసాగర్ జలాశయం నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకుంది. దీంతో జలాశయంలోకి నీటి ఇన్‌ఫ్లో పెరగడంతో అధికారులు అప్రమత్తమై ఉదయం అలీసాగర్ జలాశయం రెండు గేట్లను ఎత్తివేయగా ఇన్‌ఫ్లో మరింత పెరగడంతో మూడో గేటును సైతం ఎత్తారు. అటు శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు వరద క్రమంగా నీటి మట్టం పెరుగుతోంది. ప్రాజెక్టులోకి ప్రస్తుతం 50,000 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా ప్రాజెక్ట్ ఔట్ ఫ్లో 1,30,392 క్యూసెక్కులుగా ఉంది. 25 ప్రధాన గేట్ల ద్వారా 1,00,000 క్యూసెక్కుల వరద నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ఇందిరమ్మ వరద కాలువ ద్వార 20,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 3,500 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4,500 క్యూసెక్కులు సరస్వతి కాలువ ద్వారా 800 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువ ద్వారా 200 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు.



**కరీంనగర్‌లో....** జిల్లా కేంద్రంలో గురువారం ఉదయం 6 గంటలకు ప్రారంభమైన వర్షం మధ్యాహ్నం 12 గంటల వరకు కురిసింది. ఇదే పరిస్థితి దాదాపు జిల్లాలోని అన్ని మండలాల్లో కొనసాగింది. శంకరపట్నం మండలంలో 84.6 మి.మీ వర్షాపాతం నమోదు కాగా అర్కాండ్ల వాగు పొంగి పోర్లుతుంది. దీంతో శంకరపట్నం మండలంలోని గ్రామాలకు వీణవంక మండలంలోని గ్రామాలకు మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రోడ్లపైకి వస్తున్న నీటి ప్రవాహం కారణంగా పలు ప్రాంతాల్లో రోడ్డు మూసి వేసి ప్రజలెవరు రాకుండా పోలీసులు హెచ్చరికలు చేశారు. మండలంలోని మొలంగూర్ గ్రామంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి జంపాల చిట్టిబాబు అనే వ్యక్తి ఇల్లు కూలిపోయింది. గన్నేరువరం మండలంలో 63.3 మి.మీల వర్షాపాతం నమోదైంది. గుండ్లపల్లి దేవుని చెరువు మత్తడి ప్రవాహంతో నీరు రోడ్డుపైకి చేరడంతో గుండ్ల పల్లి నుండి మండల కేంద్రానికి, అలాగే పారువెల్ల చెరువు ప్రవాహం నీరు పారువెల్ల నుండి మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. గన్నేరువరం పెద్ద చెరువు పూర్తి స్థాయిలో నిండి మత్తడి దూకుతుంది. దీంతో కరీంనగర్ నుంచి గన్నేరువరానికి రాకపోకలు నిలిచిపోయాయి.

**ఎల్ ఎండికి భారీగా ఇన్‌ఫ్లో... :** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎల్ఎండి జలాశయంలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువన కురిస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అప్పర్ మానేరు, మధ్య మానేరుల నుండి దిగువకు వదదులుతున్న నీరు లోయర్ మానేరుకి వచ్చి చేరుతుంది. బోయినపల్లి మండలంలోని మధ్యమనేరు గేట్లు ఓపెన్ చేసి లోయర్ మనేరు లోకి నీటిని విడుదల చేశారు. ఎల్ఎండిలోకి 55వేల 829 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. ఎల్ ఎండిలోకి పై నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో కారణంగా డ్యాం నీటి మట్టం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల మధ్య సమయంలో గేట్లు ఓపెన్ చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. దిగువ ప్రాంతాల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. సిరిసిల్ల జిల్లా నర్మాల వద్ద ఉన్న ఎగువ మానేరు ప్రాజెక్టు అవతలి వైపు పశువులను మేపేందుకు వెళ్లిన రైతులు జంగం స్వామి, పిట్ల స్వామి, పిట్ల మహేష్, పిట్ల నర్సింలు, ధ్యాన బోయిన స్వామి, మరో ఇద్దరు బిసే ప్రదీప్, బిసే ఛాయా అక్కడే చిక్కుకుపోగా, కలెక్టర్, ఎస్‌పి సహాయక చర్యలను ముమ్మరం చేశారు. చిక్కుకున్న వారికి డ్రోన్ల ద్వారా ఆహారం దుప్పట్లు అందించారు. ఆర్మీ హెలికాప్టర్ల ద్వారా ప్రాజెక్ట్ వద్ద చిక్కుకుపోయిన వారిని హకీంపేటలోనీ సైనిక హెలికాప్టర్లు చేరుకొని క్షేమంగా గమ్యం చేర్చారు.

**జల దిగ్బంధంలో మెదక్ :** మెతుకుసీమ (మెదక్ జిల్లా) జల దిగ్బంధంలో చిక్కుకుంది. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో ఉన్న వాగులు పొంగిపొర్లుతున్నాయి. వరదల కారణంగా గ్రామాలకు వెళ్లే రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలు బంద్ అయ్యాయి. అనేక గ్రామాలు, తండాలు జలదిగ్బంధంలో చిక్కి ప్రజలు అవస్థలు పడ్డారు. వరుణుడి ప్రతాపానికి మెదక్ పట్టణంలో ఉన్న పుష్పలవాగు ఉగ్ర రూపం దాల్చడంతో వరద ప్రవాహానికి పక్కనే ఉన్న సబ్ స్టేషన్ పూర్తిగా నీట మునిగిపోయింది. దీంతో పలు కాలనీలకు విద్యుత్ సరఫరా లేక అంధకారం నెలకొంది. మెదక్ జిల్లాలోని హావేలీ ఘన్ పూర్, రామయంపేట్, పాపన్నపేట్, కొల్చారం, చేగుంట, రెగోడ్, అల్లాదుర్గం, వెల్దుర్తి మండలాల్లో అత్యంత భారీ వర్షాలు కురిశాయి. మెదక్ జిల్లాలో అత్యధికంగా సర్దనలో 30.2 సెం.మీ కురిసింది. జిల్లాలో 20 సెం.మీ వర్షపాతం నమోదైంది. భారీ వర్షాల నేపథ్యంలో మెదక్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. హావేలీ ఘనపూర్ పరిధిలో నక్కవాగు పొంగడంతో కారు వరద ప్రవాహంలో కొట్టుకుపోయింది. బాధితులను ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డిఆర్‌ఎఫ్,పోలీసులు రక్షించారు. జిల్లా సరిహద్దులో ఉన్న ధూప్ సింగ్ తాండా జల దిగ్బంధంలో చిక్కింది. ఇళ్లలోకి నీళ్లు రావడంతో గిరిజనులు ప్రాణ భయంతో స్లాబ్‌ల పైకి ఎక్కారు. రాజ్ పేట్ తండాలోని వాగులో 10 మంది స్థానికులు చిక్కుకున్నారు. లెఫ్ట్‌నెంట్ కల్నల్ నిఖిల్ ఆధ్వర్యంలో 30 మంది ఆర్మీ బృందం జవానులు రాజ్ పేట్ కు చేరుకొని సహాయ చర్యలు చేపట్టి వారిని కాపాడారు. అదే గ్రామానికి చెందిన మరో ఇద్దరు యాదగౌడ్, సత్యనారాయణ గల్లంతయ్యారు. ఇందులో సత్యనారాయణ మృతదేహం లభ్యమైనట్లు గ్రామస్థులు తెలిపారు. మరో వ్యక్తి యాదగౌడ్ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు. పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయం ఆవరణలో ఉన్న వనదుర్గా ప్రాజెక్ట్ 70 వేల క్యూసెక్కులతో పొంగిపొర్లుతుంది. దీనితో మంజీరా ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయం చుట్టూ మంజీరా ప్రవహిస్తుంది. సింగూర్ నుండి 40 వేల క్యూసెక్కులు నీటిని వదిలారు. వాటికి వర్షపు నీరు తోడు కావడంతో 70 వేల క్యూసెక్కులు నీరు వన దుర్గ ప్రాజెక్టు నుండి పొంగిపొర్లుతుంది. సిద్దిపేట జిల్లాలోని అక్బర్‌పేటభూంపల్లి మండల పరిధిలోని పోతారెడ్డిపేట చెరువు వరద చిన్న నిజంపేట వైపు ఉధృతంగా ప్రవహించటంతో పొలాలకు వెళ్లిన ముగ్గురు రైతులు నీటి ప్రవాహానికి భయపడి 24 గంటల పాట వాగు గడ్డపై తలదాచుకున్నారు. విషయాన్ని తెలుసుకున్న పోలీసు, రెవెన్యూ అధికారులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాధితులకు తాగునీరు, భోజనం డ్రోన్ ద్వారా పంపించారు. రైతులు రాత్రంత భయంతో బిక్కుబిక్కు అంటూ కాలం వెళ్లదీశారు. గురువారం ఉదయం ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం బోట్‌ల ద్వారా వారిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని భారత్‌నగర్. శ్రీనగర్ కాలనీ, శ్రీనివాసనగర్ హ, శివాజీ నగర్, హరిప్రియనగర్, అంబేద్కర్‌నగర్, హైద్రాబాద్ రోడ్డు బావీస్‌ఖానా పూల్ బ్రిడ్జి ప్రాంతం పూర్తిగా జలమయమైంది.

**భూపాలపల్లిలో ఓపెన్ కాస్ట్ గనుల్లోకి నీరు :** ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా బుధవారం అర్ధ రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఒక మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. హనుమకొండ, వరంగల్, కాజీపేట ట్రై సిటీలో కురిసిన వర్షంతో రోడ్లపైకి నీరు చేరగా, లోతట్టు ప్రాంతాల్లో నీటిమయం అయ్యాయి. దీంతో అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు ఆయా ప్రాంతాలను సందర్శించారు. గ్రేటర్ వరంగల్ నగరంలో 3.5 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా బురదమయమైన లోతట్టు ప్రాంతాలలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరంలోని 23 కాలనీలలో వరద నీరు ప్రభావం ఏర్పడింది. హనుమకొండ ములుగు మధ్యలో కటాక్షపూర్ చెరువు మత్తడి పొంగుతున్నది. దీంతో గంటన్నర పాటు వాహనాలు నిలిచి పోయాయి. ములుగు జిల్లా లో భారీ వర్షం నమోదయ్యింది. జిల్లాలోని జంపన్నవాగు వర్షాలకు ఉప్పొంగి ప్రవహిస్తున్నది. గోవిందరావు పేటలో 20 సెంటీ మీటర్లు, తాడ్వాయిలో 16, వెంకటాపూర్‌లో 13, వాజేడులో 12 సెంటీ మీటర్‌ల వర్షం పడింది. భూపాలపల్లి జిల్లాలో ఎగువ నుంచి వరద నీరు వస్తుందటంతో మోరంచ వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. వర్షం కారణంగా ఓపెన్ కాస్ట్ గనుల్లోకి నీరు చేరడంతో భూపాలపల్లిలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. అలాగే కాళేశ్వరం వద్ద గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తున్న ది.

**ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం :** ఖమ్మంజిల్లా చింతకాని మండలం రామకృష్ణాపురం వద్ద వాగు ఉధృతికి రోడ్డు పైకి నీరు చేరడంతో బోనకల్, ఖమ్మం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. సత్తుపల్లిలో పలు కాలనీల్లో వరద పోటెత్తింది. సత్తుపల్లిలోని ఎన్‌టిఆర్ నగర్ తదితర ప్రాంతాలకు వరద నీరు చేరడంతో రాకపోకలు స్తంభించాయి. దమ్మపేట మండలంలో నెమలిపేటలో ఇండ్లు నీట మునిగాయి. వరద ఉధృతికి విష సర్పాలు రావడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. బోనకల్ మండలంలో రాళ్లవాగు ఉప్పొంగి రాయన్నపేట, కలకోట గ్రామాల మధ్య ప్రజా రవాణా నిలిచిపోయింది. కొణిజర్ల మండలం అంజనాపురం వద్ద వాగు ఉప్పొంగడంతో పల్లిపాడు, ఏన్కూరు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వైరా నదికి ఎగువ భాగంలో కురిసిన వర్షాలతో వరద పోటెత్తడంతో వైరా నది ఉధృతంగా ప్రవహిస్తుంది. లక్ష్మీపురం వద్ద వంతెనపై నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిపివేశారు. మధిర సమీపంలో వైరా నది ఉధృతిని అధికారులు పర్యవేక్షిస్తున్నారు. మున్నేరుకు క్రమేపి వరద ప్రవాహం పెరుగుతుంది. పెనుబల్లి మండలం లంకాసాగర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అధికార యంత్రాంగం ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

**భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి :** భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం క్రమేపి మరోసారి పెరుగుతోంది. గురువారం రాత్రి 8 గం.లకు స్నానఘట్టాల వద్ద 38.06 అడుగుల వరద నీరు చేరుకుంది. ఇంద్రావతి, ప్రాణహిత నదులు పొంగి నదిలో కలుస్తున్నాయి. చర్ల మండల పరిధిలోని తాలుపేరు ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తుడటంతో గోదావరికి మరింత వరద తాకిడి పెరిగింది.

## అత్యంత భారీ వర్షాలు (మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఈ నాలుగు జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేశామన్నారు. జగిత్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్, రాజన్న సిరిసిల్ల, ఆదిలాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మంచిర్యాల, నిర్మల్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్క భారీ వర్షాలు కురుస్తాయన్నారు. అక్కడక్కడా ఉరుములు, మెరుపులు, గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలుల విచే అవకాశం ఉందన్నారు. శుక్రవారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు. దీనికి తోడు ఉరుములు, మెరుపులు, గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలుల విస్తాయని చెప్పారు.

## నిపుణులతో చర్చిస్తాం (మొదటి పేజీ తరువాయి)

ఉత్తం కుమార్ రెడ్డి, టి పి సి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష,రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ లతో కలిసి పరిశీలించారు. ప్రాజెక్టుకు వస్తున్న వరద, ప్రస్తుతం ఉన్న నీటి నిలువ, దిగువకు వదులుతున్న వరద మొదలగు వివరాలను ముఖ్యమంత్రి తెలుసుకున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్వహణ పకడ్బందిగా ఉండాలని, వరద ముగిసే సమయానికి ప్రాజెక్టు నీటి నిల్వ పూర్తి స్థాయిలో ఉండేలా చర్యలు చేపట్టాలని సీఎం సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. వరద పెరిగే నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశాలు జారీ చేశారుగోదావరి నీటిని తెలంగాణ రాష్ట్ర ప్రజలు సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా జంక్షన్ లాగా ఎల్లంపల్లి ప్రాజెక్టును ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిందని సీఎం తెలిపారు. నిపుణులు, ఇంజనీర్ల సూచనలు, సలహాలు తీసుకొని కాళేశ్వరం ప్రాజెక్టు లోని మేడిగడ్డ , అన్నారం, సుందిల్ల ప్రాజెక్టు పునరుద్దరణ, మరమ్మత్తు అవకాశాలు పరిశీలించి చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బేగంపేట విమానాశ్రయం నుంచి బయలుదేరిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏరియల్ సర్వే ద్వారా పెద్దపల్లి, కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. వాతావరణం అనుకూలించకపోవడంతో కామారెడ్డిలో హెలికాప్టర్ ల్యాండ్ కాలేకపోయింది. దీంతో మెదక్ చేరుకుని వరదల పరిస్థితిపై సమీక్షించారు. అంతకుముందు రాష్ట్రంలో పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, వరదలు, ఉత్పన్నమైన పరిస్థితులు, సహాయక చర్యలపై ముఖ్యమంత్రి జూబ్లీహిల్స్ నివాసంలో సమీక్ష నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ధనసరి అనసూయ సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు ఉన్నతాధికారులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. వర్షాలు, వరద ప్రభావిత జిల్లాల్లోని అధికారులను అప్రమత్తం చేయటంతో పాటు తక్షణం చేపట్టాల్సిన సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. స్థానికంగా ప్రజలను అప్రమత్తం చేయడమే కాకుండా సహాయక చర్యలను ముమ్మరం చేయాలని చెప్పారు.



# జనరల్

STATE & REGIONAL NEWS

## వర్షాలపై వదంతులు నమ్మొద్దు : తెలంగాణ పోలీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారీ వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రంలోని పలు జిల్లాలు అతలాకుతలం అయ్యాయి. ముఖ్యంగా కామారెడ్డి, మెదక్, నిజామాబాద్, నిర్మల్, సిద్ధిపేట, ఖమ్మం జిల్లాల్లో వాగులు, నదులు పొంగి పొరలగా.. పలుచోట్ల చెరువులు కట్టలు తెగి ఊళ్లన్నీ జలమయం అయ్యాయి. అయితే వరదల్లో చిక్కుకున్న వారిని ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు రెస్క్యూ ఆపరేషన్లు చేసి రక్షించాయి. అయితే వరదలపై పలువురు సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. పాత వీడియోలు షేర్ చేస్తూ ప్రజల్ని భయాందోళనకు గురి చేస్తున్నారని.. దయచేసి అలాంటి తప్పుడు వార్తలు ప్రచారం చేస్తూ, గందరగోళం సృష్టించవద్దని తెలంగాణ పోలీసులు రిక్వెస్ట్ చేస్తున్నారు. అధికారిక ఖాతాల్లో లేదా ప్రభుత్వ యంత్రాంగం ద్వారా నిర్ధారించుకున్న తర్వాతే సమాచారాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయమని కోరారు. వరదలకు సంబంధించిన పాత వీడియోలు వైరల్ అయ్యే అవకాశం ఉంటుందని, అలాంటి వాటిని నమ్మి భయపడవద్దని ప్రజలకు సూచించారు.

# కేంద్రం విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకం

### విద్యుత్ అమర వీరుల స్ఫూర్తితో మరో పోరాటం : వామపక్ష నేతలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సంస్కరణలను విద్యుత్ ఉద్యమ అమరవీరుల స్ఫూర్తితో తిప్పి కొట్టేందుకు సమాయత్తం కావాలని వామపక్ష పార్టీల నేతలు పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో ఇప్పటికి ఏ ప్రభుత్వం కూడ విద్యుత్ ఛార్జీలను పెంచడం కాని, ప్రైవేటీకరణకు గాని సాహసం చేయ కపోవడమంటే నాటి విద్యుత్ అమరుల త్యాగ ఫలితమేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒక్కటిగా ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీ ర్యం చేస్తూ, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్ట యత్నాలను ప్రతిఘటించాలని కోరారు. 2000, ఆగస్టు 28న విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా వామపక్షాలు చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమంపై నాటి టిడిపి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతూ పోలీసులు జరిపిన కాల్పుల్లో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిల 25వ వర్ధంతి సందర్భంగా వామపక్ష, కమ్యూనిస్టు పార్టీల నేతలు గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో ఉన్న షహీద్‌చౌక్ వద్ద పుష్ప గుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వామపక్ష నేతలు అమరవీరులకు జోహార్‌అర్పిస్తూ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

### విద్యుత్‌రంగ సంస్కరణలను ప్రతిఘటిద్దాం : పశ్యపద్మ

నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న విద్యుత్ సంస్కరణలను వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు మరో పోరాడానికి సంసిద్ధం కావాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ కోరారు. అదానీ లాంటి కార్పొరేట్ శక్తులకు దేశంలో ఎక్కడైనా విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పిస్తు కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలు రాష్ట్రంలో అమలైతే విద్యుత్ ఛార్జీల భారం అమాంతం పెరుగనుందని హెచ్చరించారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ సంస్కరణలను ప్రతిఘంటించేందుకు ప్రజా ఉద్యమాలను సమాయత్తం కావాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలను తీసుకువచ్చి ప్రజలపై భారాలు మోపితే కాంగ్రెస్‌తో సహా 9 వామపక్ష పార్టీలు చేపట్టిన ప్రజా ఉద్యమం దేశవ్యాప్తంగా ప్రభావితం చూపిందని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ గుర్తు చేశారు. ఆదే స్ఫూర్తితో కేంద్రం తీసుకువచ్చిన విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా పోరాటానికి ప్రజలను సిద్ధం చేయాలన్నారు. సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.గోవర్ధన్ మాట్లాడుతూ నాటి ఉద్యమం ఫలితంగానే ప్రభుత్వాలు విద్యుత్ చార్జీలను పెంచలేదన్నారు. అమెరికా విధానాలకు మోకరిల్లిన ప్రధాని మోదీ టారిఫ్‌లకు వ్యతిరేకంగా మాట్లాడడం లేదన్నారు. ఎంసిపిఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ విద్యుత్ ఉద్యమం ప్రజా ఉద్యమాలకు ఓ దిక్సూచి అని అన్నారు. ఎస్‌యూసిఐ(సి) రాష్ట్ర కార్యదర్శి సిహెచ్. మురహరి మాట్లాడుతూ విద్యుత్ ఉద్యమం వల్ల కరెంటు చార్జీలను పెంచాలంటేనే ప్రభుత్వాలు భయపడే పరిస్థితి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నరసింహా, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎస్.ఛాయాదేవి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, విజయలక్ష్మి పండిత్, సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య, టి.జ్యోతి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, టి.సాగర్, ఎండీ అబ్బాస్, మల్లు లక్ష్మి, పాలడుగు భాస్కర్, బి రవి కుమార్, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు ఎస్‌ఎల్ పద్మ, ప్రదీప్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకురాలు జాన్సీ, అరుణ, ఎం శ్రీనివాస్, ఎంసిపిఐ(యూ) నాయకులు ఉపేందర్‌రెడ్డి, వనం సుధాకర్, ఎస్‌యూసిఐ(సి) నాయకులు తేజ తదితరులు పాల్గన్నారు.



# క్రీడా ప్రపంచానికి హైదరాబాద్ వేదిక కావాలి

### తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డ్ సమావేశంలో సిఎం ఎ.రేవంత్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** క్రీడా ప్రపంచానికి హైదరాబాద్ వేదికగా మారాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు మొదటి సమావేశం హైదరాబాద్‌లో గురువారం జరిగింది. ఖేలో ఇండియా, కామన్ వెల్త్, ఒలింపిక్స్ ఇలా ఏ పోటీలు నిర్వహించినా వాటిలో తెలంగాణకు అవకాశం కల్పించాలని తెలంగాణ స్పోర్ట్స్ హబ్ తీర్మానం చేసింది. రాష్ట్రంలో స్టేడియాల నిర్వహణ, వసతులు మెరుగుపర్చడం, కోచ్‌లు, ట్రైనర్‌లకు శిక్షణ, క్రీడా పాలసీలో వివిధ అంశాలపై ప్రణాళిక రూపకల్పన, అమలుకు సబ్ కమిటీల ఏర్పాటుకు బోర్డు తీర్మానాలు చేసింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడా విధానం, క్రీడల ప్రోత్సాహం విషయంలో ప్రతి ఒక్కరూ హైదరాబాద్ గురించి మాట్లాడుకోవాలనేదే తన లక్ష్యమన్నారు. తెలంగాణకు ఐటి సంస్కృతి ఉందని... రాష్ట్రంలోని ప్రతి కుటుంబం తమ పిల్లలు ఐటీ రంగంలో ఉండాలని కోరుకుంటున్నారని... అలానే క్రీడా సంస్కృతి రావాలని తాను అభిలషిస్తున్నట్లు సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. క్రీడా రంగం ప్రోత్సాహానికిగానూ గతంతో పోల్చితే 16 రెట్లు బడ్జెట్ పెంచామని సిఎం వివరించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. ఇండియా క్రికెట్ టీమ్ మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ మాట్లాడుతూ తొలుత క్రీడా సంస్కృతిని పెంపొందించాలని... ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో పాల్గొనేలా చూస్తే ఫలితాలు వాటంతటవే వస్తాయని అభిప్రాయపడ్డారు. హర్యానాలో కుస్తీతో ప్రతి క్రీడకు పల్లెల్లో చోటు ఉందని ఆయన గుర్తు చేశారు. ప్రముఖ షూటర్ అభినవ్ బింద్రా మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు, వ్యాయామ సంచాలకుడు ఉండేలా చూడాలన్నారు. ధాని ఫౌండేషన్ వీతా ధానీ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు...బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి క్రీడా పోటీలు దశలవారీగా ఉండాలని.. అప్పుడు మెరుగైన క్రీడాకారుల ఎంపిక సాధ్యమవుతుందన్నారు. క్రీడా నిర్వాహకులు బియ్యాల పాపారావు మాట్లాడుతూ ఐఐటీ ప్రొఫెసర్లు మాదిరి స్పోర్ట్స్ యూనివర్సిటీలో కోచ్‌లు ఉండాలన్నారు. ఫుట్‌బాల్ టీమ్ మాజీ కెప్టెన్ బైచుంగ్ భూటియా మాట్లాడుతూ గ్రామ స్థాయిలో స్టేడియాలు, క్రీడా సామగ్రి అందుబాటులో ఉండే క్రీడాకారులు వెలుగులోకి వస్తారని తెలిపారు. సమావేశంలో క్రీడా మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, ఎండి తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల నేపథ్యంలో ఆర్‌అండ్‌బి అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి**

**తెగిన రోడ్లు, కల్వర్టుల వద్ద వర్షాలు, వరదలు తగ్గుముఖం పట్టగానే తాత్కాలిక మరమ్మతులు పడతాం**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రోడ్లు, భవనాల శాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి గురువారం ఆర్ అండ్ బి అధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో క్షేత్ర స్థాయి పరిస్థితులను ఆర్ అండ్ బి శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి, సిరిసిల్ల, నిర్మల్ జిల్లాల్లో పరిస్థితులపై సమీక్షించిన మంత్రి, కాజ్ వేలు, కల్వర్టులు, బ్రిడ్జిలు, కోతకు గురైన రోడ్ల వివరాలు అధికారులను అడిగితెలుసుకున్నారు. కామారెడ్డి, నిర్మల్ వద్ద వరద ప్రవాహానికి ఎన్‌హెచ్ 44పై రాకపోకలకు ఏర్పడిన అంతరాయం, ట్రాఫిక్ క్లియరెన్స్‌పై మంత్రి ఆరా తీసి నేషనల్, స్టేట్ హైవేల స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు ఈ సీజన్‌లో అధిక వర్షాల వల్ల పాడైన రోడ్లు, కల్వర్టులు, ముఖ్యంగా ఇంకా రెడ్ అలెర్ట్ ఉన్న జిల్లాల రోడ్ల వివరాలు అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రోడ్లు తెగిన చోట, కల్వర్టులు పొంగిపొర్లుతున్న చోట, వాగులు ఉధృతంగా ప్రవహించే మైనర్ బ్రిడ్జిల వద్ద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజారవాణాకు ఇబ్బంది లేకుండా చూడాలని, తెగిన రోడ్లు, కల్వర్టుల వద్ద వర్షాలు తగ్గుముఖం పట్టగానే తాత్కాలిక మరమ్మతులు చేపడతామన్నారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపు చేయాలని అధికారులకు సూచించారు. ప్రాణ నష్టం జరగకుండా పోలీస్, ఎలక్ట్రిసిటీ, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వచ్చిన వరద ప్రవాహాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు ఆర్ అండ్ బి పరిధిలోని 37 డివిజన్లలో 794 చోట్ల సమస్యాత్మక రోడ్లు గుర్తించామని,అందులో 1039 కి.మీ రోడ్డు దెబ్బతిందని, 31 చోట్ల రోడ్డు తెగిపోతే వెంటనే 10 చోట్ల తాత్కాలిక పునరుద్ధరణ చేశామని ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ (ఆర్ అండ్ బి) మంత్రికి వివరించారు. మొత్తంగా 206 చోట్ల సిడి వర్క్స్ దెబ్బతిన్నాయని, రోడ్లు, కాజ్ వే, మైనర్ బ్రిడ్జిలు, కల్వర్టులు తాత్కాలికంగా, శాశ్వతంగా పునరుద్ధరించాలని ప్రాథమికంగా గుర్తించినట్లు పేర్కొన్నారు. తాత్కాలిక పునరుద్ధరణకు రూ.53.76 కోట్ల వరకు ఖర్చు అవుతుందని, శాశ్వత పునరుద్ధరణ కోసం రూ.1157.46 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఆర్ అండ్ బి అధికారులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన చర్యలు, క్షేత్ర స్థాయిలో చూపిన పని తీరును అభినందించిన మంత్రి, అలసత్వం వహించకుండా అదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు.

# వరద నష్టాన్ని అంచనా వేసి నివేదిక సమర్పించాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రాథమిక నివేదికను వెంటనే సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సంబంధిత శాఖల కార్యదర్శులను ఆదేశించారు. ఈనివేదికతో పాటు జరిగిన నష్టాలకు సంబంధించిన ఫోటోలు,వీడియో క్లిప్పింగులు, పత్రికలలో ప్రచురితమైన క్లిప్పింగులను కూడా జత పర్చాలని సూచించారు. రాష్ట్రంలో గత కొద్దీ రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల జరిగిన నష్టాలపై వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో గురువారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ ప్రధానంగా నిర్మల్, కామారెడ్డి, మెదక్, సిరిసిల్ల జిల్లాలు అధిక నష్టం జరిగిందని, అలాగే ఇతర జిల్లాల్లో కూడా జరిగిన గణనీయమైన నష్టంపైన ప్రాథమిక నివేదికను వెంటనే సమర్పించాలని తెలిపారు. వివిధ శాఖల కార్యదర్శులు, సంబంధిత జిల్లా కలెక్టర్లు నష్టాలపై పంపిన ప్రాథమిక నివేదికలను సంకలనం చేయాలని విపత్తుల నిర్వహణ శాఖకు సూచించారు. దురదృష్టవశాత్తు మరణించిన వారి కుటుంబాలకు నిబంధనలను అనుసరించి ఎక్స్‌గ్రేషియాను అందచేయాలని ఆదేశించారు.



# భారీ వరద ప్రవాహాన్ని తట్టుకున్న 103 ఏళ్ల పోచారం ప్రాజెక్టు

### సురక్షితంగా నిలబడడం గర్వించదగ్గ అంశం : మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో అప్పటీ నిజాం ప్రభుత్వం 103 ఏళ్ల క్రితం నిర్మించిన తొలి సాగు నీటిప్రాజెక్ట్ అయిన పోచారం ప్రాజెక్టు భారీ వరద ప్రవాహాన్ని సునాయసంగా తట్టుకుని సురక్షితంగా నిలబడం నిజంగా గర్వించదగ్గ అంశంమే గాకుండా భావోద్వేగ సమయమని నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఈ విషయాన్ని తెలంగాణ ప్రజలతో పంచుకోవడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. 103 సంవత్సరాల పురాతన పోచారం ప్రాజెక్ట్ (గరిష్ట వరద) 70 వేల క్యూసెక్కులే కాగా, 1,82,000 క్యూసెక్కుల భారీ వరద ప్రవాహాన్ని తట్టుకుందని, బుధవారం నాటి ఉద్రిక్తత క్షణాల తర్వాత, ప్రాజెక్ట్ సురక్షితంగా నిలబడం తనకు నీటి పారుదల శాఖ సహచరులకు గొప్ప ఉపశమనం కలిగించిందని మంత్రి పేర్కొన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా, ప్రస్తుతం కామారెడ్డి జిల్లాగా ఉన్న మంచిప్ప చెరువుపై నాగిరెడ్డిపేట మండలం పోచారం గ్రామంలో 1917లో పోచారం ప్రాజెక్టుకు నిజాం శంకుస్థాపన చేయగ, కామారెడ్డి జిల్లాలోని నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాలు, మెదక్ జిల్లాలోని మెదక్ మండలాల నీటి అవసరాలను తీర్చేందుకు రూ.27.11 లక్షల వ్యయంతో 2.423 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు నిర్మాణం 1922లో పూర్తైందని తెలిపారు. గత 103 ఏళ్లుగా నిజామాబాద్, మెదక్ జిల్లాల ప్రజల సాగు, తాగునీటి అవసరాలను ఈ పోచారం తీరుస్తోందని, మంత్రి వెల్లడించారు. నిజాం ప్రభుత్వం సున్నపురాయితో నిర్మించిన ఈ ప్రాజెక్టు పొడవు 1.7 కిలోమీటర్లు కాగా, మంచిప్ప వాగుపై 21 అడుగుల ఎత్తైన కట్ట, దాని చుట్టూ 58 కిలోమీటర్ల పొడవైన కాలువలు తవ్వారన్నారు. ఈ ప్రాజెక్టుకు 73 డిస్ట్రిబ్యూటరీలు ఉండగా, రైతులు 10,500 ఎకరాలు సాగు చేసుకుంటున్నారు, గతంలో 2.423 టిఎంసిల సామర్థ్యంతో ప్రాజెక్టును నిర్మించగా, పూడిక కారణంగా ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 1.82 టీఎంసీలకు పడిపోయిందన్నారు. ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీలను , 1నుంచి 48 డిస్ట్రిబ్యూటరీలతో కూడిన ఎ జోన్‌గా 49 నుంచి 73లడిస్ట్రిబ్యూటరీలతో కూడిన బీ జోన్లుగా విభజించారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం మరింత అప్రమత్తం

### బిఆర్ఎస్ నాయకులు శవాలపైన చిల్లర ఏరుకునే వ్యవహారం చేమొద్దు

### మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి






**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారీ వర్షాలతో స్తంభించిన జాతీయ రహదారితో పాటు పంచాయితీరాజ్, 'రహదారులు,భవనాల' శాఖ రోడ్లను క్లియర్ చేశామని, దెబ్బతిన్న రోడ్లను యుద్ధ ప్రాతిపదికన తాత్కాలికంగా పునరుద్ధరిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ, గృహనిర్మణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. వరదల్లో చిక్కుకున్నవారికి డ్రోన్ల ద్వారా ఆహారాన్ని అందిస్తున్నామని, సిరిసిల్ల జిల్లాలోని నర్మల గ్రామం వద్ద మానేరు వాగు వరదల్లో చిక్కుకున్న ఐదుగురిని హెలికాప్టర్ ద్వారా రక్షించామన్నారు. శవాలపైన చిల్లర ఏరుకునే వ్యవహారం చేయవద్దని ఆయన బిఆర్ఎస్‌కు సూచించారు. విపత్తుల నిర్వహణా శాఖ అధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మెదక్ కామారెడ్డి, సిరిసిల్ల నిర్మల్ జిల్లా కలెక్టర్లతో గురువారం టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి రాష్ట్రంలో ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే, మరోవైపు ప్రతిపక్ష బిఆర్ఎస్ తమ రాజకీయ లబ్ధి కోసం మాట్లాడడం సరికాదని, వారి పాలనలో వరదలొస్తే నాడు ఏం చేశారో, ప్రస్తుతం ఏం జరుగుతుందో కళ్లకు కొట్టొచ్చినట్లు కనిపిస్తోందన్నారు. రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు, వరద పరిస్థితులు, సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని, కొద్ది సమయంలోనే ముఖ్యంగా మెదక్, కామారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాల్లో కనీవినీ ఎరుగని రీతిలో వర్షపాతం నమోదైందని, అయినప్పటికీ ప్రాణ, ఆస్తినష్టం వీలైనంత మేరకు తగ్గించేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు వారం రోజుల క్రితమే కోటి రూపాయిల చొప్పున నిధులు విడుదల చేశామని, ప్రస్తుతం అతి భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న జిల్లాలకు అదనంగా ఎన్ని నిధులైనా మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. పలు మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలకు రహదారి సౌకర్యాలు దెబ్బతిన్నాయ ని, వీటిని వెంటనే పునరుద్దరించాలని ఆదేశించామని, జిల్లాల్లో రెవెన్యూ. పోలీసు యంత్రాంగం చిత్తశుద్ధితో 24 గంటలు పని చేస్తుందన్నారు. వర్షాలు వరదలపై ఆయా జిల్లాల యంత్రాంగంతో నిరంతరం మానిటరింగ్ చేసుకోవాలని సూచించా రు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత నష్టాన్ని అంచనా వేయాలని సూచించారు. వర్షాలతో చనిపోయిన వారి కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని భరోస నిచ్చారు. రాష్ట్రంలో వర్ష బీభ త్సం దృష్ట్యా ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందా లు పని చేస్తున్నాయని, బాధితులను ఆదుకునేందుకు అవసరాన్ని బట్టి హెలిక్యాప్టర్లను సిద్ధం చేశామని వివరించారు. కూలి పోయిన ఇండ్లు, నష్టపోయిన రైతులను ఆదుకుంటామని మంత్రి ప్రకటించారు. ఒక్క మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కేవ లం ఒక గంట వ్యవధిలో 700 మిల్లీమీటర్ల వర్షం కారణంగా నీటి వనరులు పూర్తిగా నిండిపోయాయని, ఉధృతంగా నీరు బయటకు వెళ్లడంతో గట్లు దెబ్బతిని తీవ్ర నష్టాం జరిగిందన్నారు. మెదక్, కా మారెడ్డి జిల్లాల్లోని తండాలు మరీ ఎక్కువగా వర్ష బీభత్సానికి గురయ్యాయని, ఈ తండాలకు తాగునీరు, విద్యుత్ సౌకర్యాలను వీలైనంత త్వరగా కల్పించాలని అధికారులను ఆదేశించారు. వర్షాల తర్వాత వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున ఆ దిశగా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి ఆరోగ్యశాఖకు సూచించారు.

# క్రీడలతో పని ఒత్తిడి నుంచి ఉపశమనం

### ఉద్యోగులకు నిరంతరం క్రీడా పోటీలు : మంత్రి వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పసి పిల్లలనుండి పండు ముదుసలి వరకు అన్ని వర్గాల వారు క్రీడా మైదానాల వైపు ఆకర్షితులయ్యే విధంగా తెలంగాణ ప్రభుత్వం క్రీడా శాఖ కృషి చేస్తుందని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. జాతీయ క్రీడ దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం ఎల్‌బి ఇండోర్ స్టేడియంలోఉద్యోగుల ఆటల పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై స్పోర్ట్స్ అథారిటి చైర్మన్ శివసేనారెడ్డితో కలిసి ఆయన పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన క్రీడా విధానంలో ఎటువంటి వివక్షత లేకుండా అన్ని వయసుల వారు వర్గాల వారు క్రీడల్లో పాల్గొనే విధంగా కార్యాచరణ రూపొందించామని తెలిపారు. అనునిత్యం పని ఒత్తిడితో ఉండే ఉద్యోగులకు ఉపశమనానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని, ఉద్యోగులు ఆరోగ్యకరంగా ఉంటే ప్రభుత్వ పథకాలు పటిష్టంగా అమలవుతాయి అని ఆయన అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో క్రీడా ప్రోత్సాహక ప్రభుత్వం అన్ని వర్గాలకు క్రీడల్ని అందుబాటులోకి తేవాలని కృషి చేస్తుందని తెలిపారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో గత సంవత్సరం జాతీయ క్రీడా దినోత్సవం లో భాగంగా క్రీడా పోటీలు నిర్వహించామని అదే మాదిరిగా ఈ సంవత్సరం కూడా పోటీలు నిర్వహించడమే కాకుండా ప్రతి సంవత్సరం కూడా ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల జెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్ ప్రధాన కార్యదర్శి ఏలూరు శ్రీనివాసరావు, టిజిఒ కార్యదర్శి సత్యనారాయణ సచివాలయం ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి కార్యదర్శి ప్రేమ్ దేవేందర్, భాగ్యనగర్ టిఎన్‌జిఒ అధ్యక్షులు సత్యనారాయణ, హైదరాబాద్ అధ్యక్షుడు కృష్ణ యాదవ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దాస్య నాయక్ కార్యదర్శి ఖాదీర్ హుస్సేన్ వివిధ శాఖల ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు కోచెస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: సర్కిల్-2, ఉప్పల్**

NIT No. 16/EEC-2/UPL/GHMC/59/2025-26 (టెండర్ ప్రకటన) తేది: 28.08.2025

**పని పేరు:** 1 పని కొరకు జిహెచ్ఎంసి, ఉప్పల్ సర్కిల్-2, ఉప్పల్ వార్డు నెం.10లో భరత్‌నగర్, గాంధీ విగ్రహం వద్ద మెట్లు, రెయిలింగ్ మరియు ఇతర పనులను అందించడం, **అంచనా విలువ / ఇసివి:** రూ.6.00 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 02.09.2025న మ.02.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ వి.హరిలాల్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప్పల్ డివిజన్ నెం.2, జిహెచ్ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.Tender.telangana.gov.inలో చూడవచ్చు.

**సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-2, ఉప్పల్, జిహెచ్ఎంసి.**

DIPR R.O. No. : 7223-PP/CL/ADVT/1/2025-26, Date: 28-08-2025



**ధర్మపురి మున్సిపాలిటీ**

టెండర్ నోటీసు నం. E1/04/DMP/Mptly/2025-26, (టెండర్ & కొటేషన్ నోటీసు) తేదీ: 28.08.2025

స్వచ్ఛ ఆటోలు & ట్రాక్టర్ ట్రైలర్ బాడీ మరమ్మతులు మరియు అవసరమైన చోట కొత్త షీట్‌తో తయారీ, వర్టికల్స్, ఇన్‌లెట్ మరియు అవుట్‌లెట్, స్కార్, స్లాబ్, ప్లాస్టరింగ్ మొదలైన వాటి కోసం ఉన్న 40KL ELSR మరమ్మతులు, లేబర్ ఛార్జీలు మరియు ఇతర యాదృచ్ఛిక మరియు ఆపరేషనల్ ఛార్జీలు మొదలైన వాటి కోసం కొటేషన్లను ఆహ్వానించడమైనది. వీటిని ధర్మపురి మున్సిపాలిటీలోని కమలాపూర్ రోడ్డులోని ఇందిరమ్మ కాలనీలో ఇన్‌చార్జ్ ఇంజనీర్ నిర్దేశించిన విధంగా పూర్తి చేయాలి.

| | |
|---|---|
| ఆన్‌లైన్‌లో టెండర్ చేయాల్సిన పనుల సంఖ్య | : 2 సంఖ్యలు |
| మొత్తం అంచనా వ్యయం | : రూ.13.00 లక్షలు |
| బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ | : 29.08.2025 @ 4:00 PM |
| టెండర్లు స్వీకరించడానికి చివరి తేదీ & సమయం | : 04.09.2025 @ 4:00 PM |
| టెండర్లు తెరిచిన తేదీ | : 04.09.2025 సా.4:15 గం.ల తర్వాత |

మరిన్ని వివరాలకు సంప్రదించండి: 8897359695, http://tender.telangana.gov.in

సం/- మున్సిపల్ కమిషనర్ ధర్మపురి మున్సిపాలిటీ

DIPR R.O. No. : 7233-PP/CL/ADVT/1/2025-26, Date: 28-08-2025


# పర్యాటక–అతిథ్య రంగంలో కొత్త ధోరణులపై దృష్టి

### మంత్రి జూపల్లి కృష్ణారావు

### అంతర్జాతీయ విద్యార్థులు, పర్యాటకుల్ని ఆకర్షించే చర్యలు చేపట్టాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్:**పర్యాటక–అతిథ్య రంగంలో కొత్త ధోరణులపై దృష్టి పెట్టాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నిథమ్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్)లో జాతీయ క్రీడా వారోత్సవాలను గురువారం మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఆగస్టు 28 నుండి 31 వరకు జరిగే ఈ వారోత్సవాల్లో ఆరోగ్యం, శ్రేయస్సు, సంస్థాభివృద్ధి అంశాలపై వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొని సమూహ యోగాసనాలు, ధ్యానం చేశారు. ఈ శిబిరాన్ని నిథమ్ యోగా శిక్షకురాలు స్మృతి పాండే నిర్వహించారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు ... నిథమ్ విద్యార్థులు, అధ్యాపకులతో ఇష్టాగోష్టి నిర్వహించారు. నిథమ్‌ను అగ్రగామి సంస్థగా నిలిపేందుకు విద్యార్థులు, అధ్యాపకులు కృషి చేయాలన్నారు. అంతర్జాతీయ విద్యార్థులు, పర్యాటకులను ఆకర్షించేలా నిథమ్‌ను తీర్చిదిద్దాలని చెప్పారు. కొత్త విద్యా కార్యక్రమాలు, స్వల్పకాలిక, నైపుణ్యాభివృద్ధి కోర్సులను ప్రవేశపెట్టాలని, విద్యా–శిక్షణా పరిధిని విస్తరించాలని, ఉద్యోగ, పారిశ్రామికావకాశాలను విస్తరించాలని దిశానిర్దేశం చేశారు. క్యాంపస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వాతావరణాన్ని మరింత మెరుగుపరచాలని సూచించారు. ప్రభుత్వం తరపున నిథమ్‌కు సంపూర్ణ సహకారం అందిస్తామని, పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సిఎస్‌తో చర్చించి నిథమ్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు సమగ్ర కార్యచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని డైరెక్టర్‌కు సూచించారు. నిథమ్‌ను జాతీయ స్థాయి ప్రీమియర్ ట్రైనింగ్, రీసెర్చ్, కన్సల్టెన్సీ సంస్థగా తీర్చిదిద్దడంలో డైరెక్టర్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు చేస్తున్న కృషిని మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ... తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత పర్యాటక, ఆతిథ్య రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, ప్రముఖ పర్యాటక కేంద్రాలలో మౌలిక సదుపాయాలను కల్పించాలని నిర్ణయించిందన్నారు. అలాగే, రాష్ట్రంలోని చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యం కలిగిన పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేసి, వాటికి ప్రపంచ స్థాయిలో బ్రాండింగ్, ప్రచారం కల్పించేందుకు కృషి చేస్తుందని పేర్కొన్నారు. పర్యాటక కేంద్రాలకు కనెక్టివిటీ పెంచి, పర్యాటక వసతి, సౌకర్యాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పర్యాటక, ఆతిథ్య రంగంలో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయని, ప్రైవేట్ సంస్థలు పెట్టుబడులు పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిథమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకటరమణ, శ్రీకారా హాస్పిటల్స్ సీనియర్ డాక్టరు. పి.ఎల్.ఎన్. పటేల్, తదితరులు పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## పేలుళ్లకు ఎవరు అనుమతిస్తారో చెప్పండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కొండలు, రాళ్లను తొలగింపునకు పేలుళ్లు నిర్వహించాలంటే అనుమతి ఇచ్చే అధికారి ఎవరో తెలియజేయాలని రాష్ట్రానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. హైదరాబాద్ సిటీ పోలీసు చట్టం కింద కమిషనర్ అనుమతులు మంజూరు చేస్తున్నప్పటికీ దీనిపై స్పష్టత లేదంది. అధికారి ఎవరో తెలిస్తే ప్రతివాదిగా చేసి తగిన ఆదేశాలిస్తామని ప్రకటించింది. హైదరాబాద్ జూబ్లీహిల్స్ న్యాయవిహార్ వెనుక రాత్రిళ్లు పేలుళ్లు జరపడంపై హైకోర్టు న్యాయమూర్తి రాసిన లేఖను పిల్‌గా పరిగణించిన హైకోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్ గురువారం విచారించింది. పేలుడు నిర్వహించడానికి ప్రత్యేక అధికారి ఉన్నారని, కలెక్టర్‌కు కూడా అధికారం ఉందని ప్రభుత్వం చెప్పింది. జూబ్లీహిల్స్‌లో రాత్రి 10 నుంచి తెల్లవారు జామున 4 గంటల వరకు మార్చి 31వరకు పేలుళ్లు నిర్వహించడానికి అనుమతి మంజూరైందని తెలిపింది. ప్రభుత్వ వివరణ నిమిత్తం విచారణను సెప్టెంబరు 16కు వాయిదా పడింది.

## వైద్యులు, మందులు అందుబాటులో పెట్టండి : మంత్రి దామోదర రాజనర్సింహ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజారోగ్యానికి ఇబ్బందులు తలెత్తకుండా,నిరంతరం జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అదేశించారు. డాక్టర్లు, నర్సింగ్ స్టాఫ్ , ఫార్మాసిస్ట్‌లు, అసుపత్రి సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రభావిత జిల్లాల వైద్యశాఖ అధికారులతో మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో టెలిఫోన్‌లో గురువారం సమీక్ష నిర్వహించారు. భారీ వర్షాలు కురుస్తున్న మెదక్ ,కామారెడ్డి , సంగారెడ్డి , సిరిసిల్లా, సిద్దిపేటతో పాటు ఇతర జిల్లాలలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అదికారులను అదేశించారు.లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అంబులెన్స్‌లను అందు బాటులో ఉంచాలన్నారు. స్నేక్ బైట్ లు, సీజనల్ వ్యాధులు విస్తరించకుండా అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలనిఅదేశించారు. వచ్చే రెండు,మూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.



## 'కాళేశ్వరం'పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు అవకాశం ఇవ్వాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** శాసనసభా సమావేశాల్లో 'కాళేశ్వరం ప్రాజెక్టు'కు సంబంధించిన అన్ని వాస్తవాలను, గణాంకాలను ఆధారాలతో సహా విశ్లేషణాత్మకంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడానికి తమకు అవకాశం ఇవ్వాలని బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు స్పీకర్‌ను కోరారు. హైదరాబాద్‌లోని బిఆర్‌ఎస్‌ఎల్‌పి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంఎల్‌ఎలు కె.పి.వివేకానంద గౌడ్, ముఠా గోపాల్, సుధీర్ రెడ్డితో కలిసి మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించిన పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌కు అనుమతి ఇవ్వాలని విషయమై తాము స్పీకర్ అపాయింట్‌మెంట్ కోరగా, ఆయన స్పందించలేదని,కనీసం అసెంబ్లీ కార్యదర్శి కూడా తమ వినతిపత్రాన్ని స్వీకరించలేదని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రధాన ప్రతిపక్షానికి కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వాల్సిన గురుతర బాధ్యత స్పీకర్‌పైనే ఉన్నదన్నారు. శాసనసభలో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా, రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలపై విఘాతం కలిగించే అంశాలపై వాస్తవాలను ప్రజల ముందు ఉంచాల్సిన బాధ్యత తమపైన ఉన్నదన్నారు. తెలంగాణ రాష్ట్రానికి జీవనాడి అయిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై ప్రజలకు పూర్తి వివరాలు తెలియజేయాల్సిన అవసరం ఉన్నదని వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు.



## 'స్థానిక సంస్థల ఓటర్ల జాబితా సవరణ'ను వాయిదా వేయండి: బిఆర్‌ఎస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు, వరదలతో నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను తక్షణమే వాయిదా వేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను బిఆర్‌ఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు బిఆర్‌ఎస్ ప్రతినిధుల బృందం రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు గురువారం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా బిఆర్‌ఎస్ ఎంఎల్‌సిలు ఎల్. రమణ, డాక్టర్ శ్రావణ్ దాసోజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు తమ ప్రాణాలను, ఆస్తులను, పశువులను, పంటలను కాపాడుకునే ప్రయత్నంలో నిమగ్నమై ఉన్నారని, వారెవ్వరూ కూడా ఓటర్ జాబితాలో తమ వివరాలను తెలుసుకునే అవకాశం లేదన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను చేపట్టడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందని వారు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ యంత్రాంగం మొత్తం సహాయక చర్యల్లో నిమగ్నమైందని, వారికి ఎన్నికల విధులు అప్పగించడం సరికాదని సూచించారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం సర్టిఫికెట్లు ఆపడం సమంజసం కాదు
### మానవ హక్కుల సంఘం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదని విద్యార్థులకు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లు, టిసిలు ఆపడం సమంజసం కాదని తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (టిజిహెచ్‌ఆర్‌సి) ఛైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ పేర్కొన్నారు. విద్యార్థులకు వెంటనే సర్టిఫికెట్లు అందించాలని నల్గొండ జిల్లాలోని వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ మెడికల్ కళాశాల యాజమాన్యాన్ని హెచ్‌ఆర్‌సి ఆదేశించింది. ఈ విద్యాసంస్థలోని తొమ్మిది మంది బి.ఫార్మసీ విద్యార్థులు దాఖలు చేసిన ఫిర్యాదుపై హెచ్‌ఆర్‌సి విచారణ చేపట్టింది. విద్యార్థులు సమర్పించిన ఫిర్యాదులో, కళాశాల యాజమాన్యం, ప్రభుత్వం నుండి ఫీజు రీయింబర్స్‌మెంట్ రావలసి ఉందనే కారణంతో వారి ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్లు అక్రమంగా నిలిపివేస్తున్నారని ఆరోపించారు. స్టడీ సర్టిఫికెట్లను నిలిపివేయడం విద్యార్థుల రాజ్యాంగ, మానవ హక్కులను ఉల్లంఘించేదని పేర్కొంటూ, మానవ హక్కుల రక్షణ చట్టం, 1993 లోని సెక్షన్ 18(c) కింద ఉన్న అధికారాలను వినియోగించి, సంబంధిత కళాశాల ఛైర్మన్, ప్రిన్సిపాల్ తక్షణమే విద్యార్థుల ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్లు తిరిగి ఇవ్వడమే కాక, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు జారీ చేయాలని కమిషన్ సిఫార్సు చేసింది. అలాగే, కళాశాల ఛైర్మన్, ప్రిన్సిపాల్‌లను వ్యక్తిగతంగా అక్టోబర్ 2న కమిషన్ ముందు హాజరుకావాలని ఆదేశిస్తూ, ఈ ఉత్తర్వుల ప్రతిని నల్గొండ జిల్లా కలెక్టర్‌తో పాటు తెలంగాణ ఉన్నత విద్యా మండలికి తక్షణ చర్య కోసం పంపించింది.

# సామ్రాజ్యవాద ట్రంప్‌కు తలొగ్గద్దు

### అభివృద్ధి చెందే దేశాలతో బంధం పెంచుకుందాం
### ట్రంప్ టారిఫ్‌ల అమలుకు సిపిఐ ఖండన

**న్యూఢిల్లీ:** యాభైశాతం అదనపు టారిఫ్,పెనాల్టీలు భారత్‌పై అమలు చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీరును సిపిఐ తీవ్రంగా ఖండించింది. బలప్రయోగంతో మెడలు వంచేందుకు అమెరికా అనుసరిస్తున్న మాయోపాయాలకు లొంగిపోవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని పార్టీ కోరింది. భారతజాతి సార్వభౌమాధికార హక్కును దిగజార్చకుండా సమున్నతంగా కాపాడాలని కేంద్ర ప్రభుత్వానికి పిలుపు ఇచ్చింది. పార్టీ జాతీయ కార్యదర్శివర్గం గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. రష్యా నుండి ముడి చమురు దిగుమతి చేసుకుంటున్నందుకుగాను ట్రంప్ విధించిన 25 శాతం పెనాల్టీ వాణిజ్య సుంకాలు ఆగస్టు 27వ తేదీ నుండీ అమలులోకి వచ్చాయి. అమెరికా అనుసరించిన ఈ చర్య భారత సార్వభౌమాధికార హక్కును సంపూర్ణంగా ఉల్లంఘించినట్లేనని, ప్రపంచ దేశాలతో తన ప్రయోజనాలకు, తన ఇష్టాలకు అనుగుణంగా వాణిజ్యం చేసుకునే హక్కు భారత్‌కు లేకుండా చేయడమేనని విమర్శించింది. ఒక స్వతంత్ర విదేశాంగ విధానం అనుసరించడం ద్వారా జాతి ప్రయోజనాలు సంరక్షించుకోగలుగుతామని పార్టీ పునరుద్ఘాటించింది. సామ్రాజ్యవాద దేశం విధించే కఠిన షరతులకు తలొగ్గదని, అభివృద్ధి చెందుతున్న దేశాలతో సంబంధాలను పటిష్టం చేసుకోవాలని, ఈ విధమైన చర్యల ద్వారా రాజకీయ, ఆర్థిక ఒత్తిళ్ళు దేశ కార్మికవర్గ ప్రజలపై పడి భారంగా మారే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వానికి సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం హితవు చెప్పింది. భారత పరిశ్రమలను సంరక్షించుకునేందుకు, దేశ కార్మికుల ప్రయోజనాలు కాపాడేందుకు, ఇంధన భద్రతకు భరోసా ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం దేశ గౌరవ మర్యాదలు, మన విదేశాంగ విధాన స్వతంత్రత విషయంలో రాజీపడకుండా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని కోరింది. భారతదేశ వాణిజ్య సంబంధాలలో కఠిన షరతులు విధించి లొంగదీసుకునే అమెరికా ప్రయత్నం అత్యంత ప్రమాదకరమైన సంప్రదాయాలకు దారితీస్తుందని, దీనివల్ల బహుళధ్రువ ప్రపంచ సూత్రాన్ని తుంగలోతొక్కి, స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాలు చేసుకునే ప్రపంచదేశాల హక్కులను అణగదొక్కే సంప్రదాయానికి శ్రీకారం చుడుతోందని హెచ్చరించింది.

భారత్–పాకిస్థాన్ దేశాలమధ్య యుద్ధాన్ని తానే అడ్డుకున్నానంటూ డోనాల్డ్ ట్రంప్ తాజాగా బుధవారం మరోసారి చేసిన వివాదాస్పద ప్రకటనను తుడిచేసి దాన్నుండి స్వచ్ఛంగా బయటపడేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటన చేయాలని కూడా సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం కోరింది. ట్రంప్ చేస్తున్న ఈ విధమైన ప్రకటనలవల్ల భారత దేశ విదేశాంగ విధాన నిర్వహణ,ప్రవర్తనపై అనేక తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతాయని, ఈ వ్యాఖ్యలను అడ్డుకోవాలని కోరింది. ట్రంప్ చేస్తున్న ఈ ప్రకటనకు నిజంగా ఏవైనా ఆధారాలు ఉన్నాయా? అనే విషయంపై కేంద ప్రభుత్వం ఒక స్పష్టత ఇవ్వాలని, భారతదేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి ఎన్నటికీ అమెరికా ముందు మోకరిల్లి రాజీపడబోదని భరోసా ఇవ్వాలని డిమాండ్ చేసింది.

**సుంకాల ప్రభావం పడకుండా ఎగుమతిదారులకు మద్దతు చర్యలు**

అమెరికా విధించిన 50 శాతం అదనపు సుంకాల ప్రభావం భారత ఎగుమతి దారులపై పడకుండా మద్దతు చర్యలు తీసుకునే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. దీనిని అమలు చేసేందుకు మార్గాలు ఆలోచిస్తోంది. ఎగవేతదారులుగా గుర్తించకుండా రుణాల చెల్లింపులను తాత్కాలికంగా వాయిదా వేయడం, వారు శక్తి పుంజుకునేందుకు అవకాశం ఇవ్వడం వంటి చర్యలపై కేంద్రం ఆలోచిస్తోందని అధికారులు గురువారం చెప్పారు. ఎగుమతిదారులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించి సానుకూలదృక్పథంతో వారితో కలిసి ప్రభుత్వం పనిచేయడంపై ఆలోచన చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. కొత్తగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల అమలు ద్వారా ఎగుమతులను మళ్లించడం, దేశీయ మార్కెట్‌ను పెంచేందుకు వారికి అవకాశాలు ఇవ్వడం ద్వారా దేశీయ పరిశ్రమకు అమెరికా టారిఫ్‌ల భారం నుండి తాత్కాలికంగా సమస్యలు లేకుండా చూడాలని కేంద్రం ఆలోచిస్తోంది.

# ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే స్పందించాలి

### భారీ వర్షాలు వరదల సహాయక చర్యల్లో పాలన యంత్రాంగం తీరు అభినందనీయం
### యుద్ధ ప్రాతిపదికన నష్టపరిహారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
### సిఎస్ రామకృష్ణారావును చరవాణి ద్వారా ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/మెదక్ :** జిల్లాలో భారీ వర్షాలు వరదల కారణంగా ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా తక్షణమే స్పందించాలని జిల్లా పాలనా యంత్రాంగం సహాయక చర్యలు ముమ్మరం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెదక్ జిల్లా ఎస్పీ కార్యాలయానికి ప్రత్యేక చాపర్ ద్వారా చేరుకున్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్,ఎస్పీ శ్రీనివాసరావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఘనస్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో భారీ వర్షాలు, వరదల కారణంగా ప్రజలకు అందుతున్న సహాయ సహకారాలపై రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి,మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావ్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ప్రత్యేక అధికారి హరీష్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నగేష్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఆకస్మికంగా సంభవించేవే ప్రకృతి విపత్తులు అని అటువంటి విపత్తుల సంభవించినప్పుడు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి ఎటువంటి ఆస్తి నష్టం పంట నష్టం ప్రాణ నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. యుద్ధ ప్రాతిపదికన పంట నష్టం ఆస్తి నష్టం ప్రాణనష్టాన్ని అంచనాలకు అనుగుణంగా నష్టపరిహారానికి ప్రతిపాదన సిద్ధం చేయాలని చీఫ్ సెక్రటరీనిని ఆదేశించారు. జిల్లాల యూరియా కొరత విషయంలో బఫర్ స్టాక్ డిస్ప్లే చేస్తూ ఉన్నామని రైతులు రాబోవు పంటలకు కూడా ఇప్పటి నుండే యూరియా కొనుగోలు చేయడం వల్ల కొరత ఏర్పడుతుందని నానో యూరియా పై రైతులకు అవగాహన పెంపొందించాలన్నారు. చివరగా ఫ్లడ్ ఎఫెక్టెడ్ ఫోటో ఎగ్జిబిషన్ తిలకించారు.మెదక్ పార్లమెంట్ అభివృద్ధికి సంబంధించి ఎంపీ రఘునందన్ రావు నాలుగు ప్రధాన డిమాండ్లను ముఖ్యమంత్రి ముందు ఉంచారు. వాటిపై ముఖ్యమంత్రి వెంటనే స్పందించి నిర్ణయాలు తీసుకున్నారు. మెదక్ బూరుగుపల్లి రాజాపేట కామారెడ్డి రహదారి మార్గంలో ఉన్న లో లెవెల్ బ్రిడ్జిలను ఎత్తు పెంచి, రహదారిని డబుల్ రోడ్‌గా విస్తరించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. సీఎం స్పందిస్తూ పంచాయతీరాజ్ రహదారిని ఆర్ అండ్ బి పరిధిలోకి మార్చి డబుల్ రోడ్‌గా విస్తరించేందుకు జిల్లా కలెక్టరుకు వెంటనే ఆదేశాలు జారీ చేశారు.

పిల్లికోటాల సబ్‌స్టేషన్ (మెదక్)

వరదలతో పూర్తిగా మునిగిపోయిన 33 కెవి సబ్‌స్టేషన్ బదులుగా, కొత్త స్థలంలో మూడు నుంచి ఐదు కోట్ల వ్యయంతో కొత్త సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ఎంపీ కోరారు. సీఎం వెంటనే అధికారులను దీనిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రామాయంపేట మహిళా డిగ్రీ కళాశాలలో వర్షాల కారణంగా 350 మంది విద్యార్థినులు ప్రైవేట్ భవనంలో ఇబ్బందులు పడుతున్న విషయం ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. సీఎం మాట్లాడుతూ, రామాయంపేటలో కొత్త మహిళా రెసిడెన్షియల్ కళాశాల స్థాపనకు స్థలం కేటాయించి ప్రతిపాదనలు పంపితే వెంటనే మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. రామాయంపేటలో పూర్తి హంగులతో కొత్త బస్ డిపో ఏర్పాటు చేయాలని ఎంపీ విజ్ఞప్తి సీఎం ముందు ఉంచగా దీనిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో ఆర్డీవో రమాదేవి, పీఆర్ ఈఈ నర్సింలు, జిల్లా నీటి పారుదల శాఖ అధికారులు శ్రీనివాసరావు, శివనాగరాజు, వివిధ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### సురవరం అమరత్వం...
# వామపక్ష ఉద్యమాలకు తీరనిలోటు

సిపిఐ (మావోయిస్టు) రాష్ట్ర కమిటీ సంతాపం

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** దేశంలో బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు విధానాలు ప్రమాదకరంగా మారిన ప్రస్తుత తరుణంలో సురవరం సుధాకర్‌రెడ్డి అమరత్వం బ్రాహ్మణీయ హిందుత్వ, మతోన్మాద వ్యతిరేక ప్రజాస్వామ్య ఐక్య ఉద్యమాలు సహా వామపక్ష ఉద్యమాలకూ తీరనిలోటు అని భాతర కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ సంతాపం తెలియజేసింది. ప్రజా ఉద్యమాలకు అహర్నిశలు శ్రమించిన సుధాకర్‌రెడ్డికి తెలంగాణ రాష్ట్ర కమిటీ విప్లవ జోహార్లు తెలియజేసింది. ఈ మేరకు ఇటీవల సిపిఐ (మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ ఇక్కడొక ప్రకటన విడుదల చేశారు. సిపిఐ సీనియర్ నాయకుడు సురవరం సుధాకర్ రెడ్డి భౌతికంగా మనముందు లేడనే సమాచారం సిపిఐ (మావోయిస్టు) తెలంగాణరాష్ట్ర కమిటీని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని జగన్ వెల్లడించారు. విద్యార్థి దశ నుంచి జాతీయ ప్రధానకార్యదర్శి వరకు సమసమాజ నిర్మాణం కోసం తాను ఎంచుకున్న మార్గంలో అహర్నిశలు శ్రమించారని, ఆయన స్వాభావికంగా సౌమ్యుడు, వివాదాలకు అతీతంగా తన రాజకీయ కార్యాచరణను కొనసాగించాడని కీర్తించారు. సురవరం సుధాకర్ రెడ్డి తాను నమ్మిన సిద్ధాంతంతో ప్రజల పక్షాన నిలబడి కార్మిక, రైతాంగ, విద్యార్థి ఉద్యమాలలో జీవితాంతం పనిచేసిన కమ్యూనిస్టు యోధుడని జగన్ కొనియాడారు. ఆయన కుటుంబానికి, సిపిఐ శ్రేణులకు సానుభూతిని తెలిపారు.

## లా సెక్రటరీగా జస్టిస్ బి.పాపిరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం లా సెక్రెటరీ గా జిల్లా జడ్జి బి. పాపి రెడ్డి ని నియమించింది. కెసిఆర్ సర్కార్ నియమించిన రెండ్ల తిరుపతి రిటైర్ అవుతున్న నేపథ్యంలో ఈ కొత్త నియామకం జరిగింది.

## కల్లు దుకాణాలను తెరిపించాలి
### మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా మూసివేసిన కల్లు దుకాణాలను వెంటనే తెరిపించాలని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సచివాలయం మీడియా సెంటర్ ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ జిఒ 93ను సవరించాలన్నారు. ఎక్స్‌గ్రేషియాను రూ 10 లక్షలకు పెంచి, తక్షణమే పెండింగ్ నిధులను విడుదల చేయాలన్నారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరును పెట్టాలని, కేరళ రాష్ట్రంలో తరహా కల్లుగీత పాలసీని 8.98 శాతం అల్కహాల్ తో అధికారికంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ ఛైర్మన్ బాలగౌని బాలరాజ్, గౌడ కల్లు గీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆయిల్ వెంకన్న గౌడ్,గౌడ జన హక్కుల పోరాట సమితి అధ్యక్షులు ఎలుకట్టే విజయ్ కుమార్ గౌడ్, గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్ పాల్గొన్నారు.

### విధులకు అలస్యంగా వచ్చే ఉద్యోగులపై
## శాఖపరమైన చర్యలు : మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విధులకు ఆలస్యంగా హాజరైన ఉద్యోగులపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన పరిధిలోని శాఖలు, కార్పోరేషన్ల ఉద్యోగుల హాజరుపై మంత్రి గురువారం సమీక్షించారు. ఉదయం 10.40 గంటల వరకు కూడా పలువురు ఉద్యోగులు విధులకు హాజరు కాకపోవడం మంత్రి అసహనం వ్యక్తం చేయడంతో పాటు వారి నుంచి వివరణ తీసుకోవాలని అదేశించారు. శుక్రవారం నుంచి విధులకు ఆలస్యంగా హాజరయ్యే ఉద్యోగులపై శాఖ పరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఉద్యోగులంతా రైతులకు అందుబాటులో ఉండేవిధంగా పనిచేయాలని, రైతులకు కావాల్సిన టార్పలిన్లు అందుబాటులో ఉంచాలని, పంటలు తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. యూరియా పరిస్థితులపై మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రానికి వస్తున్న యూరియాను డిమాండ్ ఎక్కువగా ఉన్న జిల్లాల వారిగా కేటాయించాలని, భారీ వర్షాలకు జరిగిన పంట నష్టం వివరాలు త్వరగా సేకరించాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

### కాంట్రాక్ట్ ఉద్యోగులను
# రెగ్యులరైజ్ చేయండి
### హైకోర్టు కీలక తీర్పు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంట్రాక్ట్ పేరుతో సంవత్సరాల తరబడి సేవలు చేయించుకుని ఇప్పుడు ఉద్యోగాల నియామకాలకు అర్హత సాధిస్తే అందులో 15 శాతం అవకాశం కల్పిస్తామని ప్రభుత్వం చెప్పడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. కాంట్రాక్ట్ సర్వీసు ఇస్తున్న వాళ్లను క్రమబద్ధీకరించకుండా తిరిగి నియామకాలు చేస్తామంటే కుదరదని చెప్పింది. కాంట్రాక్ట్ సేవలు అందించిన వాళ్లను ఉద్యోగ నియామకాలోట్ల పాల్గొనాలని చెప్పడం సరికాదని చెప్పింది. రెగ్యులర్ నియామక ప్రక్రియలో ఎంపిక అయ్యాక ఉద్యోగ నియామకాలపై నిషేధం ఉందని చెప్పి వాళ్ల సర్వీసులను ఇప్పుడు వాడుకోమంటే ఎలాగని ప్రశ్నించింది. నియామకాలపై నిషేధం తొలగించాక వాళ్ల సేవలను విస్మరించి కొత్త నియామకాలు చేపట్టడానికి వీల్లేదని తీర్పు చెప్పింది. కాంట్రాక్ట్ పద్ధతిలో 6–15 ఏళ్లుగా పనిచేస్తున్న తమ సర్వీసును క్రమబద్ధీకరించకుండా 2013లో తాజా నోటిఫికేషన్ జారీచేయడాన్ని సవాల్‌చేస్తూ అప్పట్లో దాదాపు 200 వేసిన పిటిషన్లల్లో హైకోర్టు మధ్యంతర స్టే ఇచ్చింది. దీంతో వారంతా కాంట్రాక్ట్ పద్ధతిలోనే ఉద్యోగాలు చేస్తున్నారు. వాళ్ల సర్వీసును క్రమబద్ధీకరించేలా ప్రభుత్వానికి ఆదేశాలివ్వాలని కోరుతూ మెదక్ జిల్లా సదాశివపేటకు చెందిన మీరాభాయ్ ఇతరులు వేసిన పిటిషన్లను జస్టిస్ నగేశ్ భీమపాక విచారించి పైవిధంగా తీర్పు చెప్పారు. వాళ్లు కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్నారు. ఉద్యోగాలకు అర్హులు. గతంలో రెగ్యులర్ పోస్టులకే ఎంపికయ్యారు. అయితే, అప్పుడు ఉద్యోగ నియామకాలపై బ్యాన్ ఉండటంతో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు. ఈ నిషేధం ఉన్న నేపథ్యంలో వారు కాంట్రాక్ట్ పద్ధతిలో చేస్తున్నారని చెప్పి ఇప్పుడు వాళ్లను అలాగే కొనసాగించేందుకు వీల్లేదు. తాజాగా నోటిఫికేషన్ జారీచేసి వాళ్లకు 15 శాతం వెయిటేజీ మార్కులు ఇస్తామంటే కుదరదు. నియామకాలపై నిషేధం ఎత్తివేసినపుడు కాంట్రాక్ట్ కింద పనిచేస్తున్నవారికి ప్రాధాన్యం ఇవ్వాల్సిందే. అందుకు విరుద్ధంగా వారిని పరీక్షలు రాసి ఎంపిక ప్రక్రియలో పాల్గొనాలనడం చెల్లదు. ఇది చట్టవిరుద్ధమే. 2013లో పిటిషన్ దాఖలు చేశారు. 23 ఏళ్లు అయ్యింది. అప్పటి నుంచి పనిచేస్తున్నా ఇంకా కాంట్రాక్ట్ విధానంలోనే కొనసాగించడం చట్ట వ్యతిరేకం.ఈ మేరకు పలు సుప్రీం కోర్టు తీర్పులు ఉన్నాయి.. అని హైకోర్టు తీర్పు చెప్పింది.

సూపర్‌వైజర్‌గ్రేడ్–2 పోస్టుల భర్తీకి సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌లో అంగన్వాడి కాంట్రాక్ట్ ఉద్యోగులకు 15 శాతం వెయిటేజ్ మార్కులు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌ను హైకోర్టు తప్పుపట్టింది. గతంలో వారంతా రెగ్యులర్ పోస్టులకే ఎంపికయ్యారని, అయితే, అప్పుడు ఉద్యోగ నియామాకాలపై నిషేధం ఉండటంలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు చేస్తున్నారని గుర్తు చేసింది.


## వరద సాయం వివరాలివ్వండి
### ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా గత కొన్ని రోజులుగా వర్షాలు వరదలుగా మారడంతో బాధితులకు ప్రభుత్వం అందజేసిన సహాయక చర్యలపై నివేదిక అందజేయాలని హైకోర్టు రాష్ట్రానికి ఆదేశాలు జారీ చేసింది. విపత్తుల నిర్వహణ చట్టం కింద గతంలో ఇదే అంశంపై జారీ చేసిన మార్గదర్శకాలను ఏమేరకు అమలు చేశారో చెప్పాలంది. ఈ మేరకు గురువారం ఆదేశాలు జారీ చేసింది. వరదలపై గతంలో దాఖలైన పిల్‌ను చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌లతో కూడిన బెంచ్ విచారించింది. పిటిషనర్ న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదిస్తూ, భారీ వర్షాల ప్రభావం రాష్ట్ర వ్యాప్తంగా కామారెడ్డి, మెదక్, రాజన్నసిరిసిల్ల, నిర్మల్, నిజామబాద్‌తో సహా 10 జిల్లాల్లో వరద ప్రభావం ఉందన్నారు. దారుణపరిస్థితులు ఉన్నాయని చెప్పారు. ప్రభేత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ వరద సహాయక చర్యలు ప్రభుత్వం చేపట్టిందన్నారు. షెల్టర్లు, ఆహారం, నీరు అందిస్తున్నామని, వైద్యసేవలు కూడా అందిస్తున్నామన్నారు. తగిన చర్యలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలన్న పిటిషనర్ న్యాయవాది అభ్యర్థనను ధర్మాసనం తిరస్కరించింది. ప్రభుత్వం ఇప్పటికే చేపట్టిన చర్యలు తెలుసుకోకుండా ఉత్తర్వులు ఇవ్వలేమని, కౌంటర్లు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను సెప్టెంబరు 17కు వాయిదా వేసింది.



### జపనీస్ సెమికండక్టర్ పరిజ్ఞానానికి
# ముఖద్వారం తెలంగాణ
### జపాన్ సంస్థతో ఎంఒయు
### ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జపనీస్ సెమీకండక్టర్ సాంకేతిక పరిజ్ఞానానికి తెలంగాణా ముఖద్వారంగా అభివృద్ధి చెందుంతోందని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. సెమీకండకర్ల తయారీలో కీలకమైన కెమికల్, మెకానికల్ పాలిషింగ్ (సిఎంపి) టెక్నాలజీని స్థానికంగా అందుబాటులోకి తెచ్చేందుకు జపాన్ కు చెందిన టోహో కోకి సెయిసాకుషో సంస్థ ముందుకు రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేసారు. భారత్ లో తొలిసారి సిఎంపి ప్యాడ హబ్ ను రూ.8 కోట్ల వ్యయంతో ఆ సంస్థ ఏర్పాటు చేస్తుంది. ఈ మేరకు టోహో కోకి సెయిసాకుషో, టివరక్స్ మధ్య అవగాహన ఒప్పందరం (ఎంఒయు) కుదిరిందని శ్రీధర్ బాబు తెలిపారు. దేశంలోనే అతి పెద్ద ఫోటో టైపింగ్ కేంద్రం టివరక్స్ ను జపనీస్ సంస్థ భాగస్వామిగా ఎంపిక చేసుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేసారు. విద్యార్థులు, పరిశోధకులు, అంకుర సంస్థలకు ఈ ప్యాడ హబ్ ఎంతో ఉపయోగపడుతుందని ఆయన వివరించారు. సిఎంపి సేవలు అవసరమైన పరిశ్రమలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. సెమీ కండక్టర్ పరిశ్రమకు విడిభాగాలు అందించే చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఈ సదుపాయాన్ని వినియోగించుకుని తెలంగాణా ప్రతిష్టను పెంచాలని ఆయన కోరారు. జపనీస్ పరిశ్రమలు, అంకుర సంస్థలు, పరిశోధకుల కోసం టీ వరక్స్ లో ప్రత్యేకంగా ఒక 'సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్సును' నెలకొల్పనున్నట్టు శ్రీధర్ బాబు తెలిపారు. ఈ సాంకేతికత అందుబాటులోకి వచ్చిన తర్వాత ఇక్కడ శిక్షణ పొందిన వారు స్థానికంగా సిఎంపి ప్యాడ లను సొంతగా తయారు చేయగలిగే పరిజ్ఞానం పొందగలుగుతారు. దీని కోసం తొలుత ఒకటి లేదా రెండు చిన్న, మధ్య తరగతి పరిశ్రమలను ఎంపిక చేసి శిక్షణ అందిస్తామని శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ రంగంలో 200300 మంది సాంకేతిక నిపుణులను తయారు చేయడం తమ లక్ష్యమని అన్నారు. దేశం సిఎంపి ప్యాడ ల ఉత్పత్తిలో స్వావలంబన సాధించేందుకు తెలంగాణా రాష్ట్రం పాటు పడుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో సిఎంపి ప్యాడ్లను ఉత్పత్తి చేసే పరిశ్రమలు లేకపోవడం వల్ల ఏటా రూ.100 కోట్ల విలువైన దిగుమతులు చేసుకుంటున్నట్టు వెల్లడించారు. అవగాహన ఒప్పంద కార్యక్రమంలో టోహో కోకి సంస్థ గ్లోబల్ బిజినెస్ హెడ్ టకుయా నిషిమురా, టి వరక్స్ సిఇఒ జోగిందర్ తనికెళ్ల పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## చొరబాటు యత్నం భగ్నం..

### ఇద్దరు ఉగ్రవాదులను హతమార్చిన సైన్యం

**శ్రీనగర్ :** జమ్ము కశ్మీర్‌లోని బందిపోరా జిల్లాలో నియంత్రణరేఖ వెంబడి చొరబాటు ప్రయత్నాన్ని భద్రతా దళాలు భగ్నం చేశాయి. గురేజ్ సెక్టార్ లోని నౌషెరా నార్ ప్రాంతంలో నియంత్రణ రేఖ వెంబడి భారత భూభాగం లోకి చొరబడేందుకు యత్నించిన ఇద్దరు ఉగ్రవాదులను భద్రతా దళాలు మట్టుబెట్టాయి. చొరబాటు ప్రయత్నం జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాల నుంచి సమాచారం అందడంతో ఎల్‌ఒసి వద్ద భారత సైన్యం అప్రమత్తమైంది. గురేజ్ సెక్టార్‌లో సైన్యం, కశ్మీర్ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ ప్రారంభించాయి. ఈ క్రమంలో అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించిన దళాలు కాల్పులు జరిపాయి. ఉగ్రవాదులు సైతం సైన్యంపై ఎదురు కాల్పులకు దిగారు. అయితే, మన సైన్యం కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. ఆ ప్రాంతంలో మరింత మంది ఉగ్రవాదులు నక్కిఉన్నారని భద్రతా దళాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. ఈ మేరకు ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి.

# ఓటర్ల జాబితాలను తారుమారు చేశారు

### పోరాటంతో సాధించుకున్న ఓటుహక్కు కాపాడండి

### సిఇసిని కోరిన సిపిఐ ప్రతినిధి బృందం



**న్యూఢిల్లీ:** స్వాతంత్ర్యపోరాటం ద్వారా దేశ ప్రజలు సాధించుకున్న రాజ్యాంగబద్ధమైన ఓటుహక్కును కాపాడాలని భారత ప్రధాన ఎన్నికల అధికారి (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ సహా ముగ్గురు సభ్యుల పూర్తిస్థాయి ఎన్నికల సంఘంతో జరిపిన సమావేశంలో భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) ప్రతినిధి బృందం కోరింది. ఎన్నికలసంఘం ఆహ్వానం మేరకు ప్రతినిధిబృందం వారిని కలిసి చర్చలు జరిపింది. రాజ్యాంగంలోని 324వ అధికరణ ప్రకారం దేశంలో స్వేచ్ఛగా, సజావుగా, న్యాయబద్ధంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలకు భరోసా ఇవ్వాల్సినబాధ్యత ఎన్నికల సంఘం ప్రధాన కర్తవ్యమని పార్టీ ప్రతినిధిబృందం గుర్తుచేసింది. దేశ ఎన్నికల ప్రక్రియలో విశ్వసనీయత, దాపరికంలేని బాహాటతలను పటిష్టం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పార్టీ ప్రతినిధిబృందం అనేక సూచనలు చేసింది. బీహార్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న 'సర్' (ప్రత్యేక ముమ్మర సవరణ) దగ్గర నుండి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు వరకూ అనేక అంశాలపై ఎన్నికల సంఘ సభ్యులతో పార్టీ ప్రతినిధులు చర్చించారు.

సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా సారథ్యంలో పార్టీ ప్రతినిధిబృందం గురువారం నిర్వచన్ సదన్‌లో వారితో సమావేశమైంది. జ్ఞానేశ్ కుమార్‌తో పాటు ఎన్నికల కమిషనర్లు డా.సుఖ్‌బీర్‌సింగ్ సంధు, డా.వివేక్‌జోషి సమావేశంలో పాల్గొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం బిజెపితో కుమ్మక్కై ఓటర్ల జాబితాలను తారుమారు చేసిందని బీహార్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తీవ్రఆరోపణలు ఎదుర్కొంటున్న తరుణంలో పార్టీ ప్రతినిధిబృందం వారిని కలుసుకుంది. డి.రాజాతోపాటు పార్టీ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు పల్లబ్‌సేన్‌గుప్తా, డా.భాల్‌చంద్రకంగో, రామకృష్ణపాండా ఈ ప్రతినిధి బృందంలో ఉన్నారు. ఓటర్ల పేర్ల నమోదు మొదలుకొని మొత్తం ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ దాపరికంలేకుండా, విశ్వసనీయ పద్ధతుల్లో తాము చర్యలు తీసుకుంటున్నామని ఎన్నికల సంఘం అధికారులు ఈ సందర్భంగా వివరించినప్పటికీ, ఓటర్ల జాబితాలలో సామూహికంగా భారీ ఎత్తున ఓటర్ల తొలగింపు, తమకు అనుకూలమైన పద్ధతులలో ఓటర్ల జాబితాల్లో మార్పులకు సంబంధించిన వ్యక్తమవుతున్న తీవ్ర ఆందోళనను సిపిఐ ప్రతినిధి బృందం ప్రస్తావించింది. భారీ మొత్తంలో ఓటర్లను జాబితాల నుండి తొలగించడం భారత ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతకు తీవ్ర బెదిరింపని ఎన్నికల సంఘానికి స్పష్టం చేసింది. దేశంలో అర్హులైన ప్రతి ఒక్క ఓటరుకూ భరోసా ఇవ్వాల్సిన బాధ్యత ఎన్నికల సంఘం బాధ్యతేనని, ఎంతో కష్టపడి సంపాదించుకున్న ఓటుహక్కును వినియోగించుకునేందుకు పూర్తి బాధ్యత వహించాలని కోరింది. ''నిష్పాక్షికమైన, తటస్థ విభాగమైన ఎన్నికలసంఘానికి మన ప్రజాస్వామ్యంలో విశ్వసనీయత, చట్టబద్ధత ఎంతో అవసరం, ఎల్లవేళలా ఎన్నికల సంఘం ప్రవర్తన సందేహాలకు, అనుమానాలకు అతీతంగా ఉండాలి, ప్రజాస్వామ్యాన్ని, ప్రజల హక్కులను సంరక్షించేందుకు దేశంలో ఉన్న అన్ని ప్రజాస్వామ్యశక్తులతో కలిసి భారత కమ్యూనిస్టుపార్టీ తన పోరాటాలను కొనసాగిస్తుంది'' అని పార్టీ ప్రకటన పేర్కొంది.

### ఓటర్ల హక్కులు కాపాడే బాధ్యత ఇసిదే

సమావేశానంతరం డి.రాజా పిటిఐ వార్తాసంస్థ ప్రతినిధితో మాట్లాడుతూ, ఎన్నికల సంఘం ఆహ్వానం మేరకు తాము వెళ్ళి చర్చించి పలు సూచనలు, సలహాలు ఇచ్చినట్లు చెప్పారు. ప్రస్తుతం దేశంలో ప్రజలలో, పార్టీలలో నెలకున్న ఆందోళన, అర్హులైన ఓటర్లను జాబితాల నుండి తొలగించడంపై ఎన్నికల సంఘంవద్ద ప్రస్తావించినట్లు చెప్పారు. అర్హులైన, దేశంలో ఉన్న ఓటర్లందరి హక్కులను కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదేనని తాము గుర్తుచేశామన్నారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ అనేక సమస్యలు సృష్టిస్తోందని చెప్పామని, 2024 లోక్‌సభ ఎన్నికలలో ఉపయోగించిన ఓటర్ల జాబితాల అంశాన్ని ప్రశ్నించామని చెప్పారు. అన్ని రాజకీయపార్టీలకు సమానప్రాతినిధ్యం, సమాన అవకాశాలు ఇచ్చేవిధంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేయాల్సిన అవసరం ఉందని చెప్పామన్నారు. స్వేచ్ఛగా ఓటుహక్కు ఉపయోగించుకునేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. దేశంలో ఉన్న వివిధ రాజకీయపార్టీలు, జాతీయ, రాష్ట్రస్థాయి పార్టీల నాయకులతో ఇసిఐ నిర్వహిస్తున్న వరుస సమావేశాలలో భాగంగా అందిన ఆహ్వానం మేరకు సిపిఐ ప్రతినిధిబృందం ఎన్నికల సంఘంతో ముఖాముఖి చర్చించి తన అభిప్రాయాలు, సూచనలు, సలహాలను తెలియజేసింది. గడచిన 150 రోజుల్లో 4,719 సార్లు అఖిలపక్ష సమావేశాలు నిర్వహించినట్లు ఎన్నికల సంఘం తెలియజేసింది. వీటిలో 40 సమావేశాలు ప్రధాన ఎన్నికల అధికారులు నిర్వహించారు. 800 సమావేశాలు జిల్లాస్థాయి ఎన్నికల అధికారులు నిర్వహించారు. 3,879 సమావేశాలను ఎన్నికల రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు నిర్వహించారు. మొత్తంమీద వివిధ జకీయపార్టీలకు చెందిన 28,000మంది ప్రతినిధులు ఈ సమావేశాల్లో పాల్గొన్నారు.

### రాష్ట్రపతి, గవర్నర్ల చర్యలను వ్యతిరేకిస్తూ రాష్ట్రాలు 'సుప్రీం'లో

# రిట్ పిటిషన్లు దాఖలు చేయలేవు

### సుప్రీంకోర్టుకు 'కేంద్రం' స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** ప్రాథమిక హక్కుల ఉల్లంఘనకు సంబంధించి శాసనసభలు ఆమోదించిన బిల్లులను పరిష్కరించడంలో రాష్ట్రపతి, గవర్నర్ల చర్యలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్లు దాఖలు చేయలేవని కేంద్రం గురువారం సుప్రీంకోర్టుకు స్పష్టం చేసింది.ప్రాథమిక హక్కుల ఉల్లంఘనకు సంబంధించి రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద రాష్ట్రాలు రిట్ పిటిషన్ దాఖలు చేయవచ్చా? లేదా? అనే అంశంపై సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరుతున్నట్లు కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహ్‌తా సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి బిఆర్.గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి విన్నవించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 361 పరిధిపై కూడా రాష్ట్రపతి అభిప్రాయం కోరుతున్నారని ఆయన చెప్పారు. రాష్ట్రపతి లేదా గవర్నర్ తన పదవీ అధికారాన్ని విధుల వినియోగం, పనితీరు లేదా ఏదైనా చర్యకు ఏ కోర్టు కూడా జవాబుదారీగా ఉండదని ఇది చెబుతుందని ఆయన తెలిపారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పిఎస్.నరసింహ్మా, ఎఎస్.చందుర్కర్‌లు కూడా ప్రాతినిథ్యం వహించిన ఈ రాజ్యాంగ ధర్మాసనాన్ని ఉద్దేశించి తుషార్‌మెహ్‌తా మాట్లాడుతూ ఈ ప్రశ్నలన్నింటిపై తాము చర్చిస్తున్నామని, అయితే భవిష్యత్తులో సమస్య తలెత్తే అవకాశం ఉన్నందున ఖచ్చితమైన చట్టపరమైన స్థితిని తెలుసుకోవడానికి రాష్ట్రపతి కోర్టు అభిప్రాయాన్ని కోరుతున్నారని వివరించారు. గవర్నర్, రాష్ట్రపతి చర్యకు వ్యతిరేకంగా రాష్ట్ర శాసనసభ తరపున ఆర్టికల్ 32 పిటిషన్‌ను దాఖలు చేయలేమని, అది నిర్వహించదగింది కానందున రాష్ట్రపతి, గవర్నర్‌కు వ్యతిరేకంగా ఎటువంటి ఆదేశాలు జారీచేయలేమని, మూడవదిగా బిల్లులను పరిష్కరించడంలో గవర్నర్, రాష్ట్రపతి చర్య న్యాయబద్ధమైనది కాదని ఆయన కేంద్రం తరపున తనవాదన వినిపించారు. 'ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు ఆర్టికల్ 32 ఉంటుంది. రాజ్యాంగ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక హక్కును కలిగిఉండదు. ఇది దాని ప్రజల ప్రాథమిక హక్కులను కాపాడే 'ఒక రిపోసిటరీ'గా వ్యవహరిస్తుంది' అని తుషార్ మెహ్ తా చెప్పారు. ఏప్రిల్ 8న తమిళనాడు తీర్పును ఆయన ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ అసెంబ్లీ బిల్లులను ఆమోదించినప్పుడు నిర్దేశించిన కాలక్రమాల (టైమ్‌లైన్స్) మేరకు దానిని గవర్నర్ క్లియర్ చేయని పక్షంలో రాష్ట్రాలు నేరుగా సుప్రీం కోర్టును ఆశ్రయించే స్వేచ్ఛను ఇచ్చిందన్నారు. ప్రధానన్యాయమూర్తి బిఆర్.గవాయ్ మాట్లాడుతూ ఏప్రిల్ 8న ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పుకు సంబంధించి తాము ఎలాంటి మాటలు చెప్పబోమని, కానీ గవర్నర్ మాత్రం ఆరునెలల కాలానికిపైగా బిల్లును పరిష్కారం చేయకుండా అలాగే ఉన్నారని చెప్పారు. ఒక రాజ్యాంగ సంస్థ తన విధులను నిర్వర్తించకపోవడం వల్ల మరొక రాజ్యాంగ సంస్థను ఆదేశించే హక్కు కోర్టుకు లేదని మెహ్‌తా స్పష్టంచేశారు.

## పత్తిపై దిగుమతి సుంకం మరో మూడు నెలల మినహాయింపు

**న్యూఢిల్లీ :** అమెరికాలో 50 శాతం సుంకాలను ఎదుర్కొంటున్న వస్త్ర ఎగుమతి దారులకు మద్దతుగా భారత ప్రభుత్వం మరో మూడు నెలలు డిసెంబర్ 31 వరకు పత్తిపై సుంకం లేని దిగుమతిని పొడిగించింది. గతంలో ఆగస్టు 18న, ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆగస్టు 19 నుండి సెప్టెంబర్ 30 వరకు పత్తి దిగుమతులపై సుంకం మినహాయింపును అనుమతించింది. 'ఎగుమతిదారులకు మరింత మద్దతు ఇవ్వడానికి, కేంద్ర ప్రభుత్వం పత్తిపై దిగుమతి సుంకం మినహాయింపు (హెచ్ఎస్ 5201)ను 30 సెప్టెంబర్ 2025 నుండి 31 డిసెంబర్ 2025 వరకు పొడిగించాలని నిర్ణయించింది' అని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇందులో 5 శాతం బేసిక్ కస్టమ్స్ డ్యూటీ (బిసిడి), 5 శాతం వ్యవసాయ మౌలిక సదుపాయాలు, అభివృద్ధి సెస్ (ఎఐడిసి) రెండింటి నుండి మినహాయింపు, అలాగే రెండింటిపై 10 శాతం సామాజిక సంక్షేమ సర్‌చార్జ్ ఉన్నాయి. దీని వలన పత్తిపై మొత్తం 11 శాతం దిగుమతి సుంకం ఏర్పడింది. ఈ చర్య వస్త్ర విలువ గొలుసు అంతటా ఇన్‌పుట్ ఖర్చులను తగ్గిస్తుందని, నూలు, ఫ్యాబ్రిక్, దుస్తులు, మేడ్ అప్‌లను కలిగి ఉంటుందని, తయారీదారులు, వినియోగదారులకు చాలా అవసరమైన ఉపశమనాన్ని అందిస్తుందని భావిస్తున్నారు. ఆగస్టు 27 నుండి అమెరికా, వస్త్రాలు, రత్నాలు, ఆభరణాలు, తోలుతో సహా భారతీయ వస్తువులపై 50 శాతం సుంకాన్ని అమలులోకి తెచ్చింది. ఈ సుంకం మినహాయింపు దేశీయ మార్కెట్లో ముడి పత్తి లభ్యతను పెంచుతుంది. పత్తి ధరలను స్థిరీకరిస్తుంది. తద్వారా పూర్తయిన వస్త్ర ఉత్పత్తులపై ద్రవ్యోల్బణ ఒత్తిడిని తగ్గిస్తుంది. ఉత్పత్తి ఖర్చులను తగ్గించడం ద్వారా, వస్త్ర రంగంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలను రక్షించడం ద్వారా ఇది భారతీయ వస్త్ర ఉత్పత్తుల ఎగుమతి పోటీతత్వాన్ని పెంచుతుందని ప్రభుత్వం తెలిపింది.

# ఓట్లు దొంగిలిస్తే బిహార్ ప్రజలు ఊరుకోరు

### ఓట్ల చోరీ జరిగిందని నిరూపించేందుకు భవిష్యత్‌లో మరిన్ని ఆధారాలు చూపిస్తా : రాహుల్‌గాంధీ

**సీతామఢి :** బిజెపి, ఎన్నికల సంఘం ఓట్లను దొంగిలిస్తే బిహార్ ప్రజలు ఊరుకోరని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. బిహార్ ఓటర్ల జాబితా నుంచి 65 లక్షల మంది పేదల పేర్లు తొలగించారని పేర్కొన్నారు. ఓట్ల చోరీ జరిగిందని నిరూపించేందుకు భవిష్యత్‌లో మరిన్ని ఆధారాలు చూపిస్తానని చెప్పారు. గురువారం బిహార్‌లోని సీతామఢీలో నిర్వహించిన ఓటర్ అధికార్ యాత్రలో రాహుల్ గాంధీ పాల్గొని ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'బిహార్‌లో ఓట్ల దొంగిలించడాని ప్రయత్నిస్తున్నారని మాకు తెలుసు. బిహార్ ప్రజలు తెలివైనవారు. అలాగే జాగ్రత్తగా కూడా ఉన్నారు. బిజెపి, ఎన్నికల కమిషన్ బిహార్‌లో ఒక్క ఓటును కూడా దొంగిలించనివ్వరని తెలుసుకోవాలి. మేం ఇక్కడ ఓటర్ అధికార్ యాత్రలో ప్రారంభించాం. బిజెపి, ఇసి కలిసి మీ గొంతును అణచివేయాలని అనుకుంటున్నారు. అందుకే పేదల ఓట్లను దొంగిలిస్తున్నారు. మీకు తోడుగా నేను నిలబడతా. వారు మీ హక్కులను ఎప్పటికీ అణచివేయలేరు. ఇది కేవలం ఓటు హక్కు గురించి కాదు. ఎందుకంటే ఓటు పోతే భారత్‌లోని పేద ప్రజలకు ఏం మిగలదు. ఓటుతో మొదలై తర్వాత రేషన్ కార్డ్ భూమి అలా ప్రతిదీ పోతుంది' అని రాహుల్ గాంధీ తెలిపారు. ఈ యాత్రలో బిహార్ ప్రజలు మాకు తోడుగా ఉన్నారని రాహుల్ గాంధీ అన్నారు. 'ఈ యాత్రలో చిన్న పిల్లలు కూడా వస్తున్నారు. వారు నా చెవిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఓట్లను దొంగలించారని చెబుతున్నారు. కర్ణాటకలో బిజెపి ఓట్లను దొంగిలించిందని మేం



రుజువు చేసి నిరూపించాం. దీనికి ముందు, బిజెపి, ఎన్నికల సంఘం కలిసి ఓట్లను దొంగిలిస్తున్నాయి. నేను ఎప్పుడూ చెప్పలేదు. ఇప్పటివరకు, నేను కర్ణాటకకు మాత్రమే రుజువు ఇచ్చా. రాబోయే కాలంలో, లోక్‌సభ ఎన్నికలు, హర్యానా ఎన్నికల్లో కూడా ఓట్ల చోరీ జరిగిందని ఆధారాలు ఇస్తా. బిజెపి, ఆర్ఎస్ఎస్ ఓట్లను దొంగిలించడం ద్వారా ఎన్నికల్లో గెలుస్తాయని మేం నిరూపిస్తా' అని రాహుల్ గాంధీ అన్నారు. అంతకుముందు కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం దొంగిలించిన ఓట్లతో ఏర్పడిందంటూ రాహుల్ ఆరోపించారు. ప్రధానమంత్రి కూడా ఓట్ల తస్కరణకు పాల్పడ్డారని విమర్శించారు. కొందరు పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలిగించేందుకు ప్రజల ఓటు హక్కును దొంగిలించేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని అన్నారు. ప్రజాస్వామ్యానికి జన్మస్థలం బిహార్ అని ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ అన్నారు. బిజెపి, దాని అనుబంధ సంస్థ ఎన్నికల కమిషన్ కలిసి ఈ భూమి నుంచి ప్రజాస్వామ్యాన్ని అంతం చేయాలని అనుకుంటున్నాయి. వారు మీ ఓటు హక్కును మాత్రమే కాదు మీ ఉనికిని కూడా అంతం చేయాలనుకుంటున్నారు. ప్రధాని మోదీ ప్రజాస్వామ్యాన్ని అంతం చేసి రాచరిక ప్రభుత్వాన్ని స్థాపించాలనుకుంటున్నారు' అని తేజస్వీ యాదవ్ విమర్శిస్తున్నారు.

## శిబు సోరెన్‌కు భారతరత్న ఇవ్వాలి

### కేంద్రానికి సిఫార్సు చేస్తూ జార్ఖండ్ అసెంబ్లీ తీర్మానం

**రాంచి :** ప్రముఖ గిరిజన నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి శిబు సోరెన్‌కు భారతరత్న ఇవ్వాలని కేంద్రానికి సిఫార్సు చేస్తూ గురువారం జార్ఖండ్ అసెంబ్లీ తీర్మానాన్ని ఆమోదించింది. రవాణామంత్రి దీపక్ బిరువా ప్రవేశపెట్టిన ఈతీర్మానాన్ని వాయిస్ ఓటు ద్వారా ఆమోదించారు. ఈ తీర్మానాన్ని ప్రవేశపెడుతూ బిరువా మాట్లడుతూ సోరెన్ తన జీవితాంతం గిరిజనులు, రైతులు, కార్మికులు, అణగారినవర్గాల హక్కులు, గౌరవం, ఆత్మగౌరవాన్ని కాపాడటానికి అంకితం చేశారని, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు యుద్ధం చేశారన్నారు. ఆయన కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాదు, దార్శనికుడన్నారు. అటువంటి నాయకుడికి అత్యున్నత జాతీయ పౌరగౌరవాన్ని అందించడం ఆయనకు నిజమైన నివాళి అవుతుందన్నారు. 'పాలక, ప్రతిపక్ష స్ఫూర్తికి అనుగుణంగా, దిషోం గురు శిబు సోరెన్‌కు భారతరత్నను ప్రదానం చేయాలని ఈ సభ భారత ప్రభుత్వాన్ని అభ్యర్థించాలని ఒక తీర్మానాన్ని ప్రతిపాదిస్తున్నాను' అని ఆయన అన్నారు. ప్రతిపక్ష నాయకుడు బాబులాల్ మరాండి తమ పార్టీ (బిజెపి) ఈ నిర్ణయానికి మద్దతు ఇచ్చిందన్నారు. ' ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంటున్నందున జార్ఖండ్ ఉద్యమానికి మార్గదర్శకులైన మారంగ్ గోమ్కే జైపాల్ సింగ్ ముండా, బినోద్ బిహారీ మహతోల పేర్లను తీర్మానంలో చేర్చాలని' అని మారండి పేర్కొన్నారు.


**దక్షిణ మధ్య రైల్వే**

Follow us on @SCRailwayindia దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

ఇ-టెండర్ నోటీసు నెంబర్. GNT/C.79/Catering/e-tenders/2/1-2/2025. తేదీ: 21.08.2025

PUB/1037

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, సౌత్ సెంట్రల్ రైల్వే, గుంటూరు డివిజన్, గుంటూరు, కింద డీటెయిల్డ్‌గా వివరించిన విధంగా 5 సంవత్సరాల కాలానికి కింది కేటరింగ్ యూనిట్లను నిర్వహించడానికి, లైసెన్సులను మంజూరు చేయడానికి ఆసక్తికర పార్టీల నుంచి ఇ-బిడ్లను ఆహ్వానిస్తున్నారు.

(1) టెండర్ నోటీస్ నెంబర్ : కేటగిరీ /1/2025 పేరు మరియు స్టేషన్ కేటగిరీ : గుంటూరు-A యూనిట్ పేరు : టీ స్టాల్ Stall ID : GMU PF నెంబర్ : 4 &5 లొకేషన్: సబ్‌వేకు ఎదురుగా రిజర్వ్ చేయబడింది: సాధారణ సూచిక లైసెన్స్ ఫీజు ఏడాదికి (రూ.) 9,65,027/- బయానా(EMD) (రూ.) : 2.51.000 టెండర్ విధానం : టూ ప్యాకెట్స్ సిస్టమ్.

(2) టెండర్ నోటీస్ నెంబర్ : కేటగిరీ /2/2025 పేరు మరియు స్టేషన్ కేటగిరీ : గుంటూరు-A యూనిట్ పేరు : టీ స్టాల్ Stall ID : GMU PF నెంబర్ : 2 &3 లొకేషన్ : ప్లాట్‌ఫామ్ మధ్యలో రిజర్వ్ చేయబడింది: సాధారణ సూచిక లైసెన్స్ ఫీజు ఏడాదికి (రూ.) 5,79,700/- బయానా (EMD) (రూ.): 1,50.800 టెండర్ విధానం : టూ ప్యాకెట్స్ సిస్టమ్

టెండర్ డాక్యుమెంట్‌ను http://www.ireps.gov.in.లో చూడవచ్చు మరియు వెబ్‌సైట్ http://www.ireps.gov.inలో సమర్పించవచ్చు. టెండరుదారులు / బిడ్డర్లు Class-III డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్‌ను తప్పక కలిగి ఉండాలి మరియు IREPS పోర్టల్‌లో విధిగా రిజిస్టర్ అయ్యి ఉండాలి. రిజిస్టర్డ్ టెండరుదారులు / బిడ్డర్లు మాత్రమే ఇ-టెండరింగ్‌లో పాల్గొనాలి. ఇ-టెండరింగ్‌లో పాల్గొనే సమయంలో సంబంధిత అన్ని పత్రాలను తప్పక అప్‌లోడ్ చేసి ఉండాలి. మ్యాన్యువల్ ఆఫర్స్‌ను పరిగణలోనికి తీసుకోబడవు. ఎర్నెస్ట్ మనీని తప్పకుండా ఆన్‌లైన్‌లో నెట్‌బ్యాంకింగ్ లేదా పేమెంట్ గేట్‌వే ద్వారా సమర్పించాలి.

**గమనిక:** టెండరుదారు టెండర్ ఫారాన్ని సరిగ్గా అప్‌లోడ్ చేయాలి. డిజిటల్ సర్టిఫికెట్‌తో సక్రమంగా సంతకం చేయబడి ఉండాలి.

**ముఖ్యమైన తేదీలు**

| | |
|---|---|
| ప్రచురణ తేదీ | 21.08.2025 |
| ప్రీ-బిడ్ మీట్ | 29.08.2025 |
| ముగింపు తేదీ & సమయం | 17.09.2025న 15.00గంటలకు |
| టెండర్ ఆహ్వానించే అథారిటీ | సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం, గుంటూరు డివిజన్, దక్షిణ మధ్య రైల్వే, గుంటూరు-6. |

మరిన్ని వివరాలకు బిడ్డర్లు కింద సంతకం చేసిన కార్యాలయాన్ని ఏదైనా పనివేళల్లో సంప్రదించవచ్చు.నోటిఫికేషన్ http://www.ireps.gov.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయబడింది.

A1288 సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, గుంటూరు.


# ఓటుహక్కును లాక్కోనివ్వను

### దేశవ్యాప్తంగా బెంగాలీల్లో బిజెపి 'భాషా భయాన్ని' నింపుతోంది

### ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మండిపాటు




**కోల్‌కతా :** ప్రజల ఓటుహక్కును ఎవరినీ లాక్కోనీయబోమని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా బెంగాలీల్లో బిజెపి 'భాషా భయాన్ని' నింపుతోందని ఆరోపించారు. తృణమూల్ కాంగ్రెస్ విద్యార్థి విభాగం అయిన 'తృణమూల్ ఛత్ర పరిషత్' వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని కోల్‌కతాలో గురువారం జరిగిన ర్యాలీలో మమతా బెనర్జీ ప్రసంగించారు. ఓటర్ల జాబితా నుండి ఓటర్ల పేర్లను తొలగించే లక్ష్యంతో సర్వేలు నిర్వహించడానికి బిజెపి దేశవ్యాప్తంగా ఉన్న 500కి పైగా బృందాలను పశ్చిమ బెంగాల్‌లో మోహరించిందని పేర్కొన్నారు. సర్వేల కోసం ఎవరైనా తమ ఇంటికి వస్తే వివరాలను ఇవ్వొద్దన్నారు. ఓటర్ల జాబితా నుండి పేరును తొలగించడానికి వారు ఆ డేటాను ఉపయోగిస్తారని, బదులుగా పోలింగ్ కేంద్రాల్లో నేరుగా తనిఖీ చేసుకోవాలని, ఆధార్ కార్డులు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఎందుకంటే కేంద్రం దానిని తప్పనిసరి చేసిందన్నారు. బిజెపి ఆదేశం మేరకు ఎన్నికల కమిషన్ రాష్ట్ర ప్రభుత్వ అధికారులను బెదిరిస్తోందని ఆరోపించారు. తాను ఇసి కార్యాలయాన్ని గౌరవిస్తానని చెప్పారు. పిల్లలకు లాలీపాప్‌లు సరిపోతాయని, అయితే ఒక పార్టీ తరపున పెద్దలు లాలీపాప్‌లు తీసుకోవడం ప్రారంభించడం మంచిది కాదన్నారు. రాష్ట్రం నుండి వచ్చిన పేద వలస కార్మికులను బంగ్లాదేశీయులు అని ముద్ర వేయడం ద్వారా బిజెపి బెంగాలీలను అవమానిస్తోందని టిఎంసి చైర్‌పర్సన్ బెనర్జీ ఆరోపించారు. 'మీరు పేదలను బంగ్లాదేశీయులు అని పిలుస్తూ హింసిస్తున్నారు. కానీ నాకు, పేదలే నా అతిపెద్ద బలం. నేను కులం లేదా మతాన్ని నమ్మను, నేను మానవత్వాన్ని నమ్ముతాను' అని వ్యాఖ్యానించారు. అని ఆమె అన్నారు. ఇటీవల, మహారాష్ట్రలో హబ్రాకు చెందిన ఒక వలస కార్మికుడు హత్యకు గురైనా బిజెపి నేతలు ఇలాంటి దారుణాలపై ఎప్పుడూ తమ గొంతును ఎత్తలేదని విమర్శించారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో బెంగాలీలు పోషించిన పాత్రను ప్రజలు మరచిపోయేలా చేయడానికి బిజెపి ప్రయత్నిస్తోందని బెనర్జీ ఆరోపించారు. 'బెంగాలీ భాష లేకపోతే, జాతీయ గీతం ఏ భాషలో వ్రాయబడ్డాయి? బెంగాలీలు పోషించిన చారిత్రక పాత్రను ప్రజలు మరచిపోవాలని వారు కోరుకుంటున్నారు. ఇప్పుడు వారు బెంగాల్‌ను కించపరచడానికి, మన చరిత్రను అవమానించడానికి సినిమాలకు కూడా నిధులు సమకూరుస్తున్నారు' అని ఆమె ఆరోపించారు. 2026లో బెంగాల్‌లో అసెంబ్లీ జరగాల్సి ఉండగా, మమతా బెనర్జీ ఇప్పటి నుంచే ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. అందులో భాగంగానే బిజెపి తీవ్ర విమర్శలు చేస్తున్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడే వలస కార్మికులను వేధిస్తున్నారని ఆరోపిస్తూ బెనర్జీ నిరంతరం రోడ్డుపైకి వస్తున్నారు. ప్రతిపక్ష పార్టీలను లక్ష్యంగా చేసుకోవడానికి బిజెపి కేంద్ర సంస్థలను ఆయుధంగా ఉపయోగించుకుందని మండిపడ్డారు. గతంలో, ఎన్నికలకు ముందు ఏ ప్రభుత్వం కూడా ఇలా కేంద్ర సంస్థలను ఉపయోగించలేదని, కానీ బిజెపి దీనిని ఒక దినచర్యగా మార్చుకుందని ధ్వజమెత్తారు.

## బిహార్‌లో చొరబడ్డ ఉగ్రవాదులు

### అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం

### అనుమానితుల ఫొటోలు విడుదల



**పాట్నా:** నిషేధిత ఉగ్రవాద సంస్థ జైష్–ఎ–మహ్మద్‌కు చెందిన ముగ్గురు అనుమానిత కార్యకర్తలు నేపాల్ సరిహద్దు గుండా రాష్ట్రంలోకి చొరబడ్డారని, రానున్న అసెంబ్లీ ఎన్నికలకు విఘాతం కలిగించడానికి కుట్ర చేస్తున్నట్లు నిఘా వర్గాల సమాచారం మేరకు రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం బిహార్ అంతటా హై అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలోకి చొరబడ్డ ఉగ్రవాదులను హస్నైన్ అలీ (పాకిస్తాన్‌లోని రావల్పిండి నుండి), ఆదిల్ హుస్సేన్ (పాకిస్తాన్‌లోని ఉమర్‌కోట్), మొహమ్మద్ ఉస్మాన్ (బహవల్‌పూర్, పాకిస్తాన్)గా గుర్తించారు. ఈ ముగ్గురూ ఆగస్టు రెండవ వారంలో నేపాల్‌లోని కాఠ్మాండుకు చేరుకున్నారని, మూడవ వారంలో బిహార్‌లోని భారత భూభాగంలోకి ప్రవేశించినట్లు నిఘా నివేదికలు సూచిస్తున్నాయి. వారికి స్థానిక నేపాలీ నివాసి సహాయం చేసినట్లు అధికారులు భావిస్తున్నారు. నేపాల్‌తో పాటు బంగ్లాదేశ్‌తో సరిహద్దులను పంచుకునే పూర్ణియా, కతిహార్, అరారియా, కిషన్‌గంజ్ ఎస్‌పిలను భారీ హెచ్చరికను కొనసాగించాలని కోరినట్లు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డిఐజి) పూర్ణియా ప్రమోద్ కుమార్ మండల్ తెలిపారు. ఈ ఏడాది చివర్లో రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్నందున వివిధ సంస్థల నుండి ఇటువంటి నిఘా సమాచారం వస్తుందని ఆయన అన్నారు. ఈ ప్రాంతంలో ఇటీవల జరిగిన అరెస్టు తర్వాత ఈ హెచ్చరిక మరింత అత్యవసరమైంది. జైష్–ఎ–మొహమ్మద్ అనుమానిత కార్యకర్తలపై ఇంటెన్సివ్ సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించామని, ముఖ్యంగా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ ప్రాంతంలో భద్రతను కట్టదిట్టం చేసేందుకు అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు.

# అమెరికా దిగుమతులపై అధిక సుంకాలు విధించాలి

### ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ డిమాండ్




**న్యూఢిల్లీ :** అమెరికా దిగుమతులపై భారత్ అధిక సుంకాలు విధించాలని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. ఈ నిర్ణయానికి యావత్ దేశం మద్దతు ఇస్తుందన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమెరికా నుండి దిగుమతి చేసుకునే పత్తిపై 11 శాతం సుంకాన్ని మాఫీ చేయాలని నిర్ణయించిందని, ఇది ఇక్కడి స్థానిక రైతుల వ్యాపారంపై ప్రభావం చూపుతుందని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నిర్ణయం భారతదేశ రైతులకు హానికరం అని నిరూపితమవుతుందని, ప్రభుత్వం అమెరికా దిగుమతులపై అధిక సుంకాలను విధించాలని ఆప్ అధినేత డిమాండ్ చేశారు. ఇతరదేశాలు తలవంచకుండా అధిక సుంకాలను విధించాయన్నారు. మనం కూడా అధిక సుంకాలను విధించాలని పేర్కొన్నారు. అమెరికా 50 శాతం సుంకాలను విధిస్తుంటే, మనం దానిని 100 శాతానికి రెట్టింపు చేయాలని, ఈనిర్ణయానికి యావత్ దేశం మద్దతు తెలుపుతుందన్నారు. ఏ దేశమూ భారతదేశాన్ని కించపరచలేదని, మనది 140 కోట్ల మంది జనాభా కలిగిన దేశమని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. అమెరికాలో 50 శాతం సుంకాలను ఎదుర్కొంటున్న వస్త్ర ఎగుమతిదారులకు మద్దతుగా ప్రభుత్వం గురువారం డిసెంబర్ 31వరకు సుంకం లేని పత్తి దిగుమతిని మరో మూడు నెలలు పొడిగించింది. గతంలో, ఆగస్టు 18న, ఆర్థిక మంత్రిత్వశాఖ ఆగస్టు 19 నుండి సెప్టెంబర్ 30 వరకు పత్తి దిగుమతులపై సుంకం మినహాయింపును అనుమతించింది. 'భారతదేశం అమెరికా నుండి దిగుమతి చేసుకున్న పత్తిపై 11 శాతం సుంకం విధించేది. దీని అర్థం అమెరికన్ పత్తి స్వదేశీ పత్తి కంటే ఖరీదైనది. కానీ మోదీ ప్రభుత్వం ఆగస్టు 19నుండి సెప్టెంబర్ 30 వరకు ఈ సుంకాన్ని మాఫీ చేయాలని నిర్ణయించింది. దీంతో వస్త్ర పరిశ్రమలు చౌకగా పత్తిని పొందుతాయని, మన పత్తి అక్టోబర్‌లో అమ్మకానికి మార్కెట్‌లోకి వచ్చినప్పుడు, కొంతమంది మాత్రమే కొనుగోలు చేస్తారని కేజ్రీవాల్ పేర్కొన్నారు. తెలంగాణ, పంజాబ్, విదర్భ, గుజరాత్ రైతులపై ఈ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. 'అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50 శాతం సుంకాలను విధించారని మనందరికీ తెలుసు. మనం 11 శాతం సుంకాన్ని 50 శాతానికి పెంచి ఉండాలి, దానిని పూర్తిగా మాఫీ చేయకూడదు' అని ఆయన అన్నారు. అమెరికన్ పత్తిపై 11 శాతం సుంకాన్ని కేంద్రం తిరిగి విధించాలని తమ పార్టీ కోరుతుందని కేజ్రీవాల్ అన్నారు. 'సెప్టెంబర్ 7న, ఈ అంశంపై గుజరాత్‌లోని చోటిలాలో ఆప్ భారీ బహిరంగ సభను నిర్వహిస్తుంది. ఈ అంశాన్ని లేవనెత్తాలని అన్ని రాజకీయ పార్టీలు, రైతు సంస్థలను కోరుతున్నాను. కేంద్ర ప్రభుత్వ ఈ నిర్ణయం వల్ల చోటిలాలోని రైతులు తీవ్రంగా ప్రభావితమవుతారు' అని ఆప్ అధినేత అన్నారు.


**SHRIRAM Finance — వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS05UA 1734 | Gone Krishna | TATA LPT 3118 CUMMINS FBT | 2014 |
| 2 | TS03UA 3339 | Daravath Anitha | TATA LPT 3118 CUMMINS FBT-T | 2014 |
| 3 | AP20TC 2478 | Manthri Karthik | TATA LPT 3118 CUMMINS FBT-T | 2013 |
| 4 | TS03FA 8896 | Rahu Bochu | ERTIGA VXI BS6 PETROL 7 DEATER | 2020 |
| 5 | TS03FA 1719 | Radhika Thatla | TRIBER RXT PETROL 7 SEATER | 2020 |
| 6 | AP07TD 4459 | Srinivas Anaparthi | AL 3718 IL FBT | 2013 |

AUCTION DATE : 30-08-2025

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED
1st Floor, H No 6-159, Above DCC Bank. Reddy Colony, Jayashankar Bhupalpally. Cell : 9849981545, 9949340057

ప్రజాపక్షం
శుక్రవారం, 29 ఆగస్టు

# కాంగ్రెస్ వ్యూహంలో మార్పు

రాష్ట్ర రాజకీయాలలో బిజెపిపై కాంగ్రెస్ పార్టీ దాడిని ఉధృతం చేస్తోంది. ఇప్పటి వరకు ప్రధాన ప్రతిపక్షం బిఆర్‌ఎస్‌పైనే అధికంగా విమర్శలు ఎక్కుపెడుతూ వస్తున్న అధికార పక్షం తన వాగ్బాణాలను బిజెపి వైపు మళ్ళించింది. జనహిత పాదయాత్రలో భాగంగా టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ చేస్తున్న విమర్శలు బిజెపిని ఇరుకున పెడుతున్నాయి. ముఖ్యంగా తెలంగాణలో బిజెపి గెలుచుకున్న ఎనిమిది లోక్‌సభ స్థానాలలో దొంగ ఓట్లతో గెలిచిందేమోననే సందేహాన్ని వ్యక్తం చేశారాయన. కరీంనగర్‌లో ఒకే ఇంటి నంబర్‌పై 40 ఓట్లు ఉండడాన్ని ఉటంకిస్తూ, నేరుగా కేంద్ర హోం శాఖ బండి సంజయ్‌పై విమర్శల దాడి పెంచారు. దానికి తోడు రాముడు, దేవుడు పేరు చెప్పి ఓట్లు వేయించుకోవడం తప్ప, రాష్ట్రాన్ని ఏమి అభివృద్ధి చేసారంటూ విసిరిన సవాలు రాజకీయ వేడిని పుట్టించింది. కాషాయ పార్టీ మూల సిద్ధాంతంపైనే పిసిసి అధ్యక్షుడు చేస్తున్న విమర్శలు కాకపుట్టిస్తున్నాయి. ఒకడుగు ముందుకేసి బిసి రిజర్వేషన్‌ల బిల్లులు, ఆర్డినెన్స్‌లను కేంద్ర ప్రభుత్వం ఆమోదం చేయించడంలో తాత్సారంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఇరుకున పెట్టే ప్రయత్నం చేశారు.

ఇవన్నీ కూడా కాంగ్రెస్ పార్టీ ఇక తన భవిష్యత్తు రాజకీయ ప్రత్యర్థిగా బిజెపిని నిర్ణయించుకున్నదనే సంకేతాలనిస్తోంది. శాసనసభ ఎన్నికల తరువాత జరిగిన దాదాపు అన్ని ఎన్నికల్లో బిజెపినే ద్వితీయ స్థానంలో నిలిచినప్పటికీ పెద్దగా పట్టించుకోలేదు. ముక్కోణపు రాజకీయాలే ఉంటాయనే ధీమాతో బిఆర్‌ఎస్‌పైనే దృష్టి పెట్టింది కాంగ్రెస్. తాజాగా బిజెపిలో బిఆర్‌ఎస్ విలీనమనే ప్రచారానికి ఎంఎల్‌సి కవిత లేఖ ఊతమివ్వడం, వివిధ విచారణలలో బిఆర్‌ఎస్ ముఖ్యనేతలు నిందితులుగా మారితే నాయక, కార్యకర్త గణం బిజెపివైపు మళ్లుతుందనేమోననే అంచనాకు కాంగ్రెస్ వచ్చినట్లు అభిజ్ఞవర్గాలు చెబుతున్నాయి. ఇక బిజెపిపై దాడిని ఉధృతం చేయాల్సిందనే నిర్ధారణకు ఈ అంశాలన్నీ దారి తీసాయి.

సైద్ధాంతికంగా కరుడుగట్టిన రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ప్రత్యక్ష మార్గదర్శనంలో జనహిత పాదయాత్ర సాగుతున్నది. ఆమె సైతం పాదయాత్రలో పాల్గొనడంపై ప్రతిపక్షాలే కాకుండా, అంతర్గతంగా సొంత పార్టీలో కూడా గుసగసలు వినపడ్డాయి. మీనాక్షి నటరాజన్ బాధ్యతలు స్వీకరించిన తొలినాళ్ళలోనే బిజెపితో సైద్ధాంతిక పోరుకు శ్రేణులను చైతన్యపరచాల్సిన ఆవశ్యకతను ఉద్ఘాటించారు. అదే కోవలో పిసిసి అధ్యక్షుడి సారధ్యాన జులై 31న వికారాబాద్ జిల్లా పరిగిలో మొదలైన ఈ యాత్ర బాలారిష్టాలను అధిగమిస్తూ నెమ్మదిగా కార్యకర్తల స్పందనను చవిచూస్తున్నది.

అంతకుముందు పిసిసి అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి నాటి బిఆర్‌ఎస్ ప్రభుత్వంతో యుద్ధానికి తలపడి ముఖ్యమంత్రి అయ్యాక క్షేత్రస్థాయిలో కార్యకర్తల కదలిక నెమ్మదించింది. దీనిపై అసంతృప్తి కూడా వ్యక్తమైంది. ఇప్పుడా అంతరాన్ని కొంతవరకు జనహిత యాత్ర తీర్చే అవకాశం లేకపోలేదు. కర్నాటకలోని మహాదేవ్‌పుర శాసనసభ సెగ్మెంట్‌లో దొంగ ఓట్లతో బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ స్థానాన్ని బిజెపి అక్రమంగా గెలుచుకున్నదని ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత సాధికారంగా వివరించి దేశ రాజకీయాలలో సంచలనం సృష్టించారు. ఆ వెంటనే బిహార్‌లో 65 లక్షల ఓటర్లను తొలగించారని, అక్రమ ఓట్లను తొలగించి, అసలైన ఓటర్ల ఓటు బిహార్‌లో చేపట్టిన ఓట్ అధికార్ యాత్ర అనూహ్య స్పందనతో ముందుకు సాగుతోంది. ఆ యాత్ర సైతం రాష్ట్ర కాంగ్రెస్‌కు నూతనోత్సాహాన్ని అందిస్తున్నది. వర్ధన్నపేటలో సాగిన జనహిత యాత్రకు మంచి స్పందన రావడమే కాకుండా, బిజెపిని బోనులో నిలబడుతూ చేస్తున్న విమర్శలనూ కార్యకర్తలు కరతాళ ధ్వనులతో ఆదరిస్తున్నారు. బిజెపిని తన ప్రత్యర్థులను ఆత్మరక్షణలోకి నెట్టేస్తూ కవచంగా వాడుకునే అంశాలపైనే రాష్ట్ర కాంగ్రెస్ కదనానికి కాలుదువ్వుతుండడం వర్తమాన పరిణామం.

హాకీని జాతీయ క్రీడగా గుర్తించని, 'హాకీ మాంత్రికుడు' ధ్యాన్ చంద్‌కు 'భారత రత్న' ఇవ్వడానికి ఒప్పుకోని ప్రభుత్వం, ఆయన జయంతి (ఆగస్టు 29)ని జాతీయ క్రీడా దినోత్సవంగా నిర్వహించడం హాస్యాస్పదం. ధ్యాన్‌చంద్‌కు అవమానం. 'భారతరత్న'కు ఆయన అన్నివిధాలా అర్హుడు.





మదన్ బి.లోకుర్
భారత సుప్రీం కోర్టు, ఫిజీ సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి

# ప్రమాదకరమైన 'గూడుపురాణీ'

సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం 1950లో రొమేశ్ థాపర్ కేసులో పత్రికా స్వేచ్ఛను హక్కుగా గుర్తించింది. ఇప్పుడు ఆ స్వేచ్ఛ హత్యకు గురవుతుండటాన్ని మనం వీక్షిస్తున్నాం. అందులో భాగంగా ఇటీవల బాధితులైన వారిలో ఒకరు రొమేశ్ థాపర్ బంధువైన కరణ్ థాపర్ కావడం వైచిత్రి. ఇలాంటి మరో బాధితుడే జర్నలిస్టు సిద్ధార్థ్ వరదరాజన్. వారిపై ''అశాంతిని రెచ్చగొట్టడం, జాతీయ భద్రతను బలహీనపరచటం, శత్రు ప్రయోజనాల ఇతివృత్తాలను వ్యాపింపచేయటం'' కోసం కుట్ర పన్నుతున్నారనే ఆరోపణలు మోపబడ్డాయి. అవి అత్యంత ముఖ్యమైనవి.

అస్సోంలోని గువహాటి క్రైమ్ బ్రాంచ్‌లో 2025, మే 9వ తేదీన నమోదైన ప్రాథమిక సమాచార నివేదిక(ఎఫ్‌ఐఆర్)లో వారికి వ్యతిరేకంగా నేరారోపణలు ఉన్నాయి. 'ది వైర్'లో ప్రచురితమైన ప్రమాదకరమైనవి అని ఆరోపించబడుతున్న వీడియో ఇంటర్వ్యూలు, వార్తా కథనాలు ఈ ఎఫ్‌ఐఆర్‌కు ఆధారం. ఎఫ్‌ఐఆర్‌లోని వివరాలపై లోతుగా వెళ్ళాల్సిన అవసరం లేదు. కానీ, ఫిర్యాదుదారుడు విద్యావంతుడు, చాలా బాగా రాసాడు కానీ జాతీయ భద్రతను బలహీనపరచారనే కేసును మోపడంలో నిజంగా బాగా శ్రమపడ్డాడు.

వాస్తవానికి, అతను చక్కగా రాసినప్పటికీ, ఫిర్యాదును అవగాహన చేసుకొని, గుర్తించి 2025 ఆగస్టు 12న నిందితులు హాజరు కావాలని సమ్మన్‌లు జారీ చేసేందుకు క్రైమ్ బ్రాంచ్ మూడు మాసాలు తీసుకుంది. బహుశా, అతను ఏమి చెప్పాలనుకుంటున్నాడనే ఉద్దేశ్యాన్ని పోలీసులు బొత్తిగా గ్రహించలేదు. అందుకే సిట్, నిఘంటువు సహకారం తీసుకున్నప్పటికీ తప్పుడు నిర్ధారణకు వచ్చారు. అది కూడా జాతీయ భద్రతకు సంబంధించిన విషయంలో. అసలేమి జరుగుతోంది?



కరణ్ థాపర్



సిద్ధార్థ వరద రాజన్



అభిసార్ శర్మ

భారతీయ న్యాయ సంహిత(బిఎన్‌ఎస్) ప్రకారం ఏ నేరాన్ని కూడా ఎఫ్‌ఐఆర్‌లోని కేసు రుజువు చేసే అవకాశం లేదు. పైగా అది కొట్టివేసేందుకు అర్హమైనది. అందులో ఫిర్యాదుదారుని అభిప్రాయం వ్యక్తీకరణ తప్ప ఏమీ లేదు. దురదృష్టవశాత్తు ఆ అభిప్రాయం మేరకు ఇద్దరు జర్నలిస్టులను జాతీయ భద్రతను బలహీనపరచారనే అభియోగాలపై ప్రశ్నించేందుకు అస్సోంలోని పోలీసులు (వారి ఉద్దేశ్యమేమిటో అందరికీ తెలిసిందే) పిలిపించారు. వారికి వ్యతిరేకంగా ఎలాంటి బెదిరింపు చర్య తీసుకోవద్దని భారత సుప్రీం కోర్టు నిర్దేశించింది. ప్రస్తుతానికైతే అది మంచిదే అయినప్పటికీ, దీర్ఘకాలికంగా జరిగే సంబంధిత నష్టాన్ని పాఠకులు పరిశీలించాలి.

**మేక తోలు కప్పుకున్న..**

భారత శిక్షాస్మృతి నుంచి నిరంకుశ రాజద్రోహం (సెడిషన్) నేరాన్ని తొలగించినట్లు మనకు చెప్పబడింది. అది సరైనదే. రాజద్రోహాన్ని బిఎన్‌ఎస్ శిక్షపూరిత నేరంగా పరిగణించదు. అయినప్పటికీ, భారత దేశ సార్వభౌమత్వం, ఐక్యత, సమగ్రతను ప్రమాదంలోకి నెట్టడాన్ని బిఎన్‌ఎస్‌లోని సెక్షన్ 152 నేరంగా మార్చింది. ఎవరైనా ''వేర్పాటు లేదా సాయుధ తిరుగుబాటు లేదా విధ్వంసక కార్యకలాపాలకు ప్రేరేపించినా లేదా ప్రేరేపించే ప్రయత్నాలు చేసినా, లేదా వేర్పాటువాద కార్యకలాపాల భావనలను ప్రోత్సహించినా లేదా భారతదేశ సార్వభౌమత్వం లేదా ఐక్యత లేదా సమగ్రతను ప్రమాదంలోకి నెట్టినా; లేదా అలాంటి చర్యల్లో పాలుపంచుకున్నా లేదా పాల్పడినా..'' అమలయ్యే విధంగా చట్టం అవకాశాన్ని కల్పించింది. భారత సార్వభౌమత్వం లేదా ఐక్యత, సమగ్రత అనే వ్యక్తీకరణలను రాజ్యాంగంలోని 19వ అధికరణలో ఉపయోగించడమే కాకుండా, దేశం పరాధీనత లేదా ముక్కలు చేయడం వంటి వాటికి సంబంధించిన కచ్చితమైన అర్థం కూడా అందులో ఉంది. సాధారణ సమయంలో వ్యక్తీకరించే వైఖరులు ఎంత తీవ్రంగా ఉన్నప్పటికీ, వాటిని భారత సార్వభౌమత్వం, సమగ్రతను ప్రమాదంలోకి నెట్టేవిగా అన్వయించవద్దు. వేర్పాటు లేదా సాయుధ తిరుగుబాటు లేదా పరాధీనత లేదా హానికర లేదా వేర్పాటువాద కార్యకలాపాల స్వభావాన్ని నిర్ధారించేందుకు అంతకు మించి మరింత ఎక్కువగా ఉండేది అవసరం. ఇలాంటి కారణం చేత సెక్షన్ 152 కింద నేరానికి బిఎన్‌ఎస్‌లో జీవితఖైదు శిక్ష విధించేందుకు వీలు కల్పించబడింది.

**సమ్మన్లు, పర్యవసానాలు**

కాబట్టి ఇవన్నీ కూడా బిఎన్‌ఎస్‌లోని సెక్షన్ 152ను రాజ్యాంగ విరుద్ధమైనదిగా మారుస్తుందా? నాకు తెలియదు. ఆ అంశాన్ని న్యాయస్థానంలోని రాజ్యాంగ ధర్మాసనం నిర్ణయిస్తుంది. నిర్మొహమాటంగా చెప్పాలంటే, నాకు వచ్చే ఫలితంపై ఊహించే ప్రమాదం తెచ్చుకోవాలని లేదు. కానీ, ప్రస్తుతానికైతే పోలీసు సమ్మన్ల పర్యవసానమేటి?

మొదటిది, బిగుసుకుపోయే ప్రభావం. రాజద్రోహం చట్టం కింద భయంకరమైన ప్రభావాన్ని మనం గతంలో గుర్తించాము. ఇప్పుడు దానిని మించిపోయింది. టెలివిజన్‌లో చర్చల ప్యానల్‌లో ఉండే ఏ జర్నలిస్టు అయినా లేదా ఎవరైనా, లేదా వేరే విధంగానైనా భారత ప్రభుత్వ విధానానికి సంబంధించి ఏ అంశం మీదైనా విమర్శించే ధైర్యం ఉంటుందా? ఎవరో దానికి వక్రభాష్యం పలికి, జాతీయ భద్రత అంశాన్ని ముందుకు తీసుకువస్తారు. పోలీసులు దానిని పరిగణలోకి తీసుకొని ఆరోపిత నిందితుడిని తమ ఎదుట హాజరుకావాలని పిలుస్తారు. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను నేలమట్టం చేసి, ధ్వంసం చేస్తారు. ఎందుకంటే వందకోట్ల మంది ప్రజలలో దేశంలో ఎక్కడైనా ఒక వ్యక్తి జాతీయ భద్రత ప్రమాదంలో పడిందని (ఆధారాలు లేకుండానే), లేదా సాయుధ బలగాలు నిస్పృహకు లోనయ్యాయని లేదా అసమ్మతి అనేది భారతదేశ సార్వభౌమత్వం, సమగ్రతను బలహీనపరిచే ''వ్యూహాత్మక పరాధీనత'' అని విశ్వసిస్తే, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను అణిచివేయవచ్చు లేదా ధ్వంసం చేయవచ్చు.

రెండవది, జర్నలిస్టు లేదా ఏ సామాన్య పౌరుడికైనా కలిగే ఆర్థిక ఇబ్బందిని పరిశీలించాలి. నిస్సారమైన ఫిర్యాదుకు వ్యతిరేకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించడం చాలా ఖరీదైన వ్యవహారం. న్యాయవాది ఫీజు, పేపర్‌లతో కూడిన పుస్తకాల ప్రింటింగ్, చిల్లర ఖర్చులను కక్షిదారుడే చెల్లించాలి. ఒకవేళ కక్షిదారుడు ఢిల్లీ నివాసి కానట్లయితే, ప్రయాణ ఖర్చులు, లాడ్జ్ ఖర్చులు అదనం. దీనిని ఎంత మంది భరించగలరు? తాము రాసిన లేదా వ్యక్తీకరించిన విషయాన్ని భారతదేశంలో ఏదో ఒక మూల ఒకరో లేదా ఇద్దరు వ్యక్తులు తప్పుగా అర్థం చేసుకుంటే వారెందుకు భరించాలి?గువహాటికి వెళ్లేందుకు, తిరిగివచ్చేందుకు (అరెస్టయితే తప్ప), రాత్రి బస చేసేందుకు థాపర్, వరదరాజన్‌కు అయ్యే ఖర్చులను గమనంలోకి తీసుకోవాలి. నిర్ణీత తేదీన విచారణ అధికారి అందుబాటులో ఉంటారా? ఆయన అనారోగ్యానికి గురి కావొచ్చు లేదా ఇంతకంటే ముఖ్యమైన కేసు విచారణలో ఉండొచ్చు. మరో విధంగా చెప్పాలంటే వారి ప్రయాణాన్ని ఆయన నిష్ఫలం చేయవచ్చు.

అలాగే ప్రశ్నించడం ఒక్కరోజులోనే అయిపోతుందనే గ్యారంటీ ఉంటుందా? బహుశా, వారు పదేపదే హాజరుకావాల్సిన అవసరం విచారణ అధికారికి ఉండొచ్చు. నేడు ఏ పోలీసు అధికారి జవాబుదారీ కాదు. అందుకే ముంబైలో అమాయకులు 18 సంవత్సరాలు జైలులో గడపాల్సి వచ్చింది. దేశంలోని న్యాయస్థానంలో జవాబుదారీతనం పూర్తిగా లోపించింది.

నా అభిపాయం ప్రకారం నిందితుడు సాధారణంగా నివసించే నగరం లేదా గ్రామానికి దర్యాప్తు పోలీసు అధికారి వెళ్ళాలి. ఆ అధికారి ప్రభుత్వం కోసం, దాని తరపున పనిచేస్తున్న వ్యక్తి. కాబట్టి, పౌరుడిని అమాయకుడిగా భావించి, బదులుగా ప్రభుత్వమే ఖర్చు భరించాలి.

జర్నలిస్టులను వీడియో కాన్ఫరెన్స్‌ను ఉపయోగించి ప్రశ్నించే అవకాశాన్ని అస్సోం పోలీసులు అన్వేషించారా? వీడియో కాల్ ద్వారా ప్రశ్నలకు సమాధానాలు చెప్పగలిగినప్పుడు, భారీ ఖర్చులు, అసౌకర్యాన్ని భరించి వారెందుకు భౌతికంగా హాజరుకావాలి? ఎలక్ట్రానిక్ పద్ధతిలో ప్రశ్నించడం ద్వారా మరో ప్రయోజనం కూడా ఉంది. ప్రశ్నలను, జవాబులను రికార్డు చేసుకొని, ఏమి అడిగారనే విషయాన్ని తెలుసుకునేందుకు సంబంధితులకు సాధ్యమవుతుంది. కొన్నిసార్లు ప్రశ్నలు ఉపయుక్తం కానివి ఉంటాయి. కాబట్టి, నిందితుడు 'సహకారించలేదు' అని దర్యాప్తు సంస్థ చేసే సాధారణ ఆరోపణను నిరోధించవచ్చు.

కొద్ది రోజుల క్రితం, వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా క్రిమినల్ ట్రయల్‌లో పోలీసు అధికారులను క్రాస్ ఎగ్జామినేషన్ చేయడాన్ని సాధ్యం చేస్తూ ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్‌జి) ఆదేశాలు జారీ చేశారు. ఈ పద్ధతిపై ఢిల్లీలోని న్యాయవాదులు అభ్యంతరపెట్టినప్పటికీ, ఎల్‌జి తన నిర్ణయానికే కట్టుబడి ఉన్నారు. పోలీసు అధికారులను వీడియో కాల్ ద్వారా క్రాస్ ఎగ్జామిన్ చేయగా లేనిది, జర్నలిస్టులను నేరారోపణలకు సంబంధించి ఇదే పద్ధతిలో ప్రశ్నించకపోవడానికి ఎలాంటి కారణం లేదు.

**వేధింపులు, శిక్ష**

జర్నలిస్టులను వేధించడం, ఉనికిలో లేని నేరానికి శిక్ష విధించే ప్రక్రియను కొనసాగించడంలో అస్సోం పోలీసుల వైఖరి సుస్పష్టంగా ఉంది. బిఎన్‌ఎస్‌లోని సెక్షన్ 152 లోని నేరం కింద ఇటీవల అభిసార్ శర్మకు సమ్మన్లు జారీ చేయడం ద్వారా జర్నలిస్టులను వెంటాడాలనే వారి ఉద్దేశ్యం స్పష్టంగా ఉంది. ప్రభుత్వాన్ని అవినీతి, మతం, అక్రమమైనదిగా చిత్రించడం ద్వారా భారతదేశ ఐక్యత, సమగ్రతను ప్రమాదంలోకి నెట్టివేస్తున్నారని ఆయనపై అభియోగా లు మోపారు. చట్ట గ్రంథాల నుంచి రాజద్రోహాన్ని తొలగించడం, దాని స్థానంలో మరింత దారుణమైన చట్టాన్ని తీసుకురావడం, దానిని ఆయుధంగా మార్చుకున్నా శిక్షలేకపోవడం వాస్తవమేకదా?

మూడవది, న్యాయస్థానాలు, వాటి తీర్పులపై ప్రభుత్వానికి ఏమైనా గౌరవరం ఉన్నదా? నాకైతే అంతగా తెలియదు. నిందితునికి ఎఫ్‌ఐఆర్ కాపీని ఇవ్వాల్సిన చట్టపరమైన అవసరాన్ని యూత్ బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (2016) కేసులో న్యాయస్థానం సమర్థించింది. ఎఫ్‌ఐఆర్ కాపీని పొందేందుకు నిందితులు ఇరువురూ వారం రోజులు ప్రయత్నించి విఫలమయ్యారు. శ్రీ తవరగి రాజశేఖర్ శివ ప్రసాద్ (2024) కేసులో కర్నాటక హైకోర్టు ఈ అభిప్రాయాన్నే అనుసరించింది. సుప్రీం కోర్టు తీర్పును పోలీసులు ధిక్కరిస్తూ రక్షణను ఆశ్రయించారు. సంబంధిత మెజిస్ట్రేట్ పరిధిలో ఎఫ్‌ఐఆర్ కాపీని ఫైల్ చేయాల్సిన అవసరం ఉంది. కాబట్టి, 2025 మేలో నమోదైన ఎఫ్‌ఐఆర్ కాపీకోసం థాపర్, వరదరాజన్‌లు మెజిస్ట్రేట్‌ను ఆశ్రయించగా, ఆ కాపీ లేదని వారికి తెలిపారు. ఇది రక్షణనా? అహంకారమా? నిర్లక్ష్యమా? మరో విధంగా చూసినా, నిందితుడిని ఆయనకు వ్యతిరేకంగా మోపిన ఆరోపణల గురించి సమాధానం అడిగితే, అతనికి ఆరోపణలు గురించిన సమాచారం తెలిసి ఉండాలనేది కనీస జ్ఞానం.

చివరగా, ఈ సిద్ధాంతం ప్రకారం, దర్యాప్తుకు క్రమంగా ఇంటర్వ్యూలు, వార్తా కథనాలలో భాగస్వాములైన ఇతర వ్యక్తులను కూడా లాగవచ్చు. నిందితులైన ప్రముఖ వ్యక్తులలో రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా) మాజీ ఛీఫ్, సీనియర్ జర్నలిస్టులు, రక్షణరంగ విశ్లేషకులను కూడా చేరుస్తారు. చూస్తూనే ఉండండి. ఇక్కడ ఏదో జరుగుతుంది, కానీ అదేమిటో మీకు తెలియదు.

చివరగా, మూడు ప్రశ్నలను అడగాల్సిన అవసరం ఉంది. చట్టం పుస్తకాలలో బిఎన్‌ఎస్‌లోని సెక్షన్ 152 ఉండాల్సిందేనా? అది రాజ్యాంగబద్ధమైనది అవునా, కాదా అనే అంశాలతో సంబంధం లేకుండా, చట్టబద్ధమైన ఆదేశాలను పోలీసులు అనుసరించాల్సిన అవసరం లేదా? సముచితమైన కేసులలో రాజ్యాన్ని జవాబుదారీ చేయకూడదా?

*(ది హిందూ సౌజన్యంతో)*



ఎస్.కె. జకీర్

# ఆపరేషన్ ఉస్మానియా – రేవంత్ 'క్లౌడ్ బరస్ట్'!

ఉస్మానియా యూనివర్సిటీలో సిఎం రేవంత్ రెడ్డి పర్యటన ప్రస్తుతం హాట్ టాపిక్. ఇంతకు ముందు సిఎంగా పనిచేసిన కెసిఆర్ ఆ పనిచేయకపోవడం వలన రేవంత్ ప్రతిష్ఠ ఇనుమడించింది. 'ఉస్మానియా యూనివర్సిటీ, తెలంగాణకు ప్రత్యామ్నాయ పదం' అన్నప్పుడు చాలామంది తెలంగాణవాదులకు కూడా మతిపోయింది. ఇలాంటి వాక్యాన్ని ఇదివరకు ఎవరూ చెప్పలేదు. తనకు తాను గొప్ప ఉద్యమకారునిగా చెప్పుకునే కెసిఆర్ పదేండ్ల లో యూనివర్సిటీకి వెళ్ళకపోవడం, వందేళ్ల పూర్తి చేసుకున్న యూనివర్సిటీ వేడుకలకు ప్రణబ్ ముఖర్జీ హాజరయినపుడు ఒక్క మాట కూడా మాట్లాడకుండానే నాటి ముఖ్యమంత్రి కెసిఆర్ వెనుదిరగడంతో విద్యార్థుల్లో తీవ్ర అసహనం, అసంతృప్తి పెల్లుబికాయి. ఉస్మానియా విద్యార్థులకు, కెసిఆర్ కు మధ్య పదహారేండ్లుగా 'గ్యాప్' ఉన్నది.

కెసిఆర్ ఆమరణ దీక్ష మధ్యలో 'జ్యూస్' తాగడం వల్ల ఆయనపై విద్యార్థిలోకం నిప్పులు గక్కింది. 2009 లో ఆ రోజు అర్ధరాత్రి ఉస్మానియా క్యాంపస్ లో 'కెసిఆర్ శవయాత్ర' జరిపారు. తెలంగాణ ఉద్యమానికి కెసిఆర్ తూట్లుపొడిచారని, ఆయన తెలంగాణ ద్రోహి అనే నినాదాలు మిన్నుముట్టాయి. ఆ ఆందోళన కార్యక్రమాల్లో ప్రజాగాయకుడు గద్దర్ కూడా పాల్గొన్నారు. 'బహుశా అప్పటినుంచే ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులపై కెసిఆర్ పగ పెట్టుకున్నట్టు' ఒక ప్రచారం ఉన్నది. తెలంగాణ ఉద్యమాన్ని, ఉస్మానియా విద్యార్థులను విడదీసి చూడడం చరిత్రను వక్రీకరించడమే. ఉస్మానియా విద్యార్థుల పోరాటాలే 'ఇంధనం'గా ప్రత్యేక తెలంగాణ ఉద్యమం నడిచింది. తనకు వ్యతిరేకంగా 'శవ యాత్ర' నిర్వహించిన వారి పట్ల 'దొర' ఎలా సహించగలరు?

కెసిఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత 'అసలు రంగు' బయటపడింది. ఆయనే కాకుండా ఆయన కేబినెట్‌లోని సభ్యులు, బిఆర్‌ఎస్ నాయకులు ఎవరూ ఉస్మానియావైపు తొంగి చూడడానికే జంకారు. 'మనందరికీ తెలిసిన కెసిఆర్ వేరు. అసలు కెసిఆర్ వేరు. ఆయన అత్యంత పిరికివాడు. భయస్తుడు. మావోయిస్టుల నుంచి ముప్పు కలుగుతుందనే భయంతో కెసిఆర్ పదేండ్లలో ఒక్కసారికూడా భద్రాచలంకు వెళ్ళలేదు' అని ఆయన సన్నిహితులు చెబుతుంటారు. వారు చెబుతున్న మాటల్లో పూర్తిగా నిజం లేకపోయినా, కొంతయినా నిజం ఉండి ఉండవచ్చు. 'తెలుగుదేశం మంత్రిగా ఉన్నప్పుడు పీపుల్స్ వార్ నక్సలైట్లు కెసిఆర్ ను కిడ్నాప్ చేశారు. కొన్ని గంటల పాటు తమ చెరలో ఉంచుకొని తర్వాత విడిచిపెట్టారు' అని ఆ కిడ్నాప్ ఘటనతో ప్రత్యక్షంగా సంబంధం ఉన్న మాజీ 'దళ సభ్యుడొకరు' చెప్పారు. అంటే 1995 నుంచే కెసిఆర్‌లో నక్సలైట్ల భయం రిజిస్టర్ అయిపోయిందని మరికొందరు మాజీలు చెబుతుంటారు.

''భారత రాష్ట్ర సమితి చీఫ్, తెలంగాణ సిఎం కెసిఆర్ 2024లో జరిగే ఎన్నికల్లో మొత్తం ఖర్చు తానే పెట్టుకుంటానని చెప్పారంటూ సీనియర్ జర్నలిస్ట్ రాజ్ దీప్ సర్దేశాయ్ బాంబు పేల్చాడు. ఆయన చేసిన వ్యాఖ్యలు దేశ వ్యాప్తం గా కలకలం రేపాయి. ఎన్ని వేల కోట్లు ఉంటే ఈ మాట కెసిఆర్ అంటారు. నిప్పు లేనిదే పొగ రాదు. కెసిఆర్ తెలంగాణ పేరుతో అందినంత మేర దండుకున్నారు. బలిదానా లు, ఆత్మ త్యాగాలతో సాధించుకున్న రాష్ట్రంలో కల్వకుంట్ల ఫ్యామిలీ అవినీతికి, అక్రమాలకు, స్కాంలకు కేరాఫ్ గా మారింది. ఎన్ని వేలకోట్లు వెనకేసుకుంటే దేశమంతా ఖర్చు పెట్టేందుకు ఇంత ధైర్యం వస్తుంది. అటు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అదానీ దేశాన్ని ఎలా దోచుకున్నారో అదే రీతిన కెసిఆర్ అండ్ కంపెనీ తెలంగాణను దోచుకున్నారు'' అని 2023 ఏప్రిల్‌లో నాటి బీఎస్పీ చీఫ్, మాజీ ఐపిఎస్ అధికారి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ నిప్పులు చెరిగారు. ''నేను బూటకపు ఎన్‌కౌంటర్లు చేసి ఉంటే జ్యూడిషియల్ విచారణలో నన్ను దోషిగా తేల్చేవారు. నేను జైల్లో ఉండేవాడిని కదా! ప్రస్తుత ముఖ్యమంత్రి కెసిఆర్ టిడిపి ప్రభుత్వంలో ఉండగా 100మందికి పైగా నక్సలైట్లు మరణించారు. మరి కెసిఆర్‌ను ఎన్‌కౌంటర్ స్పెషలిస్టుగా ఎందుకు పిలవరు''? అని ఒక న్యూస్ ఛానల్‌లో అన్నారు. సరే, పరిణామక్రమంలో ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ 'మతం' మార్చుకున్నారు. ఆయన ఇప్పుడు కెసిఆర్, కెటిఆర్ విధేయ బృందంలో అత్యంత కీలక వ్యక్తి.

''ఫామ్ హౌస్‌లో మానవ మృగాలు ఉన్నాయి. సెంట్రల్ యూనివర్సిటీలో ఏనుగులు, సింహాలు ఉన్నాయని వాటిని తాము చంపుతున్నట్టు సోషల్ మీడియాలో ప్రచారం చేసి అభివృద్ధిని అడ్డుకున్నారు. తెలంగాణలో ఒక్క ఏనుగు, సింహం కూడా లేదు. ఫామ్‌హౌస్ లో మాత్రమే మానవ రూపంలో మృగాలు ఉన్నాయి. వాటిని బంధించవలసి ఉంది''అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగస్టు 25న అత్యంత కటువుగా వ్యాఖ్యానించారు. ''ఉస్మానియా యూనివర్సిటీలో సిఎం వ్యాఖ్యలు కెసిఆర్ వాక్పటిమను ఓవర్ టేక్ చేశాయి. కాంగ్రెస్ పార్టీకి ఆయన గొప్ప నాయకుడనడంలో సందేహం లేదు. ఆ పార్టీకి ఆయన అస్సెట్'' అని బిఆర్‌ఎస్ పార్టీ అభిమాని, కెసిఆర్ సామాజికవర్గానికి చెందిన డాక్టర్ ఒకరు అన్నారు. రేవంత్ రెడ్డి ప్రసంగాలను పరిశీలిస్తే ఇటీవలికాలంలో బాగా పదునుతో ఉంటున్నాయి. అందులో పంచ్‌లు ఉంటున్నాయి. పరిణతి ఉంటోంది. ప్రత్యర్థులపై పులిలా విరుచుకుపడే మాటలు వినేవాళ్లకు 'కిక్కు'నిస్తున్నవి. విద్యార్థులు, యువకుల్లో అద్భుతమైన ఉత్తేజం కలిగిస్తున్నవి. ప్రత్యర్థి రాజకీయ పార్టీ నాయకులను 'మానవ మృగాలు'గా సంబోధించిన వారెవరూ ఇంతకు ముందు లేరు.తెలంగాణలోని కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులకు, మర్యాదస్తులకు ఇలాంటి 'భాష' వాడకం నచ్చకపోవచ్చు. కానీ ఆ మాత్రం దోసు లేకపోతే బిఆర్‌ఎస్‌కు చీమకుట్టినట్టుగా కూడా ఉండదని జనం అనుకునే మాట.



''అధికారం కోల్పోయారన్న బాధ, కడుపు మంటతో ఉన్న రాజకీయపార్టీ ఉచ్చులో పడొద్దు'' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒయు విద్యార్థులకు పిలుపునిచ్చారు. తాను ఎక్కడి నుంచో పుట్టుకు రాలేదని, మీ వాడిగా పుట్టుకొచ్చి మీ ఆశీస్సులతో సిఎం అయ్యాయని అన్నారు. ఏ మంచి పనిచేసినా కెసిఆర్ పార్టీ నాయకులు వద్దంటున్నారని సిఎం మండిపడ్డారు. గంజాయి నిర్మూలనకు ఈగల్ టీమ్ ఏర్పాటు చేస్తే ఆ పార్టీ వద్దంటుందని, హైడ్రా కూడా వద్దంటుందన్నారు. పేదోడికి రేషన్ కార్డు ఇవ్వొద్దు, సన్నబియ్యం పంపిణీ చేయొద్దు ఇలా ప్రతి పనికీ అడ్డు తగులుతున్నారని ధ్వజమెత్తారు.

''కేవలం ప్రజలకు విద్య అందించడం ద్వారా పేదరికాన్ని నిర్మూలించలేకపోవచ్చు. కార్మిక మార్కెట్లు ఉద్యోగాలు కల్పించకపోతే విద్య అర్థరహితంగా మారవచ్చు. విద్య ఒక వ్యక్తి ఆదాయాన్ని పెంచకపోయినా, ఖచ్చితం గా అతన్ని వేరే మనిషిగా మలుస్తుంది. దేశాల మధ్య పేదరిక సమస్యను పరిష్కరించడంలో విద్య పోషించే పాత్రపై నేను సూక్ష్మంగా అధ్యయనం చేశా. ప్రజాస్వామ్యానికి విద్య కీలకం. ఇది ప్రజలకు సమాజంలోని వనరులను పూర్తిగా అందుబాటులోకి తెస్తుంది. వారిని వివిధ సామాజిక కార్యకలాపాల్లో పూర్తి భాగస్వాములను చేస్తుంది.'' అని నోబెల్ బహుమతి గ్రహీత అభిజిత్ బెనర్జీ ఒక సందర్భంలో చెప్పారు. ఇటీవల ఆయన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా 'తెలంగాణ రైజింగ్ విజన్' బోర్డులో చేరడానికి అభిజిత్ బెనర్జీ అంగీకరించా రు.

విద్యా వ్యవస్థలో అవసరమైన మార్పులు, ప్రక్షాళన చేయడానికి సూచనలు, సలహాలతో సమగ్రమైన ఒక పాలసీ డాక్యుమెంట్‌ను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలువురు విద్యావేత్తలకు సూచించారు. పడిపోతున్న ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికీ మేల్కొనకపోతే భవిష్యత్తు తరాలకు ద్రోహం చేసిన వారమవుతామని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ ప్రక్షాళన చేయలేమని కూడా సిఎం రేవంత్ వ్యాఖ్యానించారు.

తెలంగాణ ప్రభుత్వం వృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగా ల సృష్టి, గొప్ప మౌలిక సదుపాయాల నిర్మాణం, అన్ని వర్గాల సంక్షేమం అనే దార్శనికతను 'తెలంగాణ రైజింగ్' గా సిఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి పట్టణాభివృద్ధి, ఆర్థిక వృద్ధి, ప్రజా ఆదాయాలను పెంచడం, ఆర్థిక క్రమశిక్షణ, పెద్ద ఎత్తున నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగాల కల్పనలో అనేక వినూత్న ఆలోచనలపై అభిజిత్ బెనర్జీ చర్చించారు. భారీ స్థాయిలో ఉద్యోగ సృష్టి గురించి చర్చిస్తూ సాంప్రదాయ కళాకారు లు ఆధునిక వ్యవస్థాపకులుగా మారేందుకుగాను ఆధుని క డిజైన్లు, ఆకర్షణ, మార్కెటింగ్ అవసరమని ముఖ్యమంత్రికి అభిజిత్ సూచించారు. సోషల్ మీడియా టెక్నాలజీ వినియోగంతో సాంప్రదాయ నైపుణ్యాలలో ప్రత్యేకమైన స్వల్పకాలిక కోర్సులను సృష్టించాల్సిన అవసరం గురించి కూడా కొన్ని సలహాలు ఇచ్చారు. ఫ్యూచర్ సిటీలో చేతిపనులు, కళలు, సృజనాత్మకతను ముఖ్యమైన భాగంగా చేర్చాలని ఆయన ముఖ్యమంత్రికి సూచించారు. కాగా గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో విద్యారంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని సిఎం రేవంత్ రెడ్డి పలు సందర్భాల్లో ఘాటు వ్యాఖ్య లు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రభుత్వ గురుకులాలు, పాఠశాలలను వారంలో రెండు రోజులు సందర్శించాలని సిఎం సూచించినా ఆచరణలో పెట్టిన వారు చాలా తక్కువ.

విద్యాశాఖను తన దగ్గరే పెట్టుకున్నందున సిఎం రేవంత్ రెడ్డి ఆ శాఖపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించినట్టు అధికారవర్గాలు తెలియజేశాయి. బిఆర్‌ఎస్ హయాంలో ప్రాథమిక విద్య నుంచి యూనివర్సిటీల్లో విద్య వరకు నిర్లక్ష్యం జరిగిందన్న భావన విద్యాధికుల్లో ఉన్నది. రైతుబంధు వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ తన ఓటు బ్యాంకులను సుస్థిర పరుచుకోవడానికి కెసిఆర్ పక్కా ప్రణాళికను అమలు చేసినట్టు ఫిర్యాదులున్నవి. అలాంటి ఫిర్యాదు రాకుండా బడ్జెట్‌లోనూ విద్యారంగానికి సముచిత వాటా కేటాయిస్తున్నట్టు మంత్రులు చెబుతున్నారు.

## మాతృ భాష తెలుగుకు వన్నె తెచ్చిన గిడుగు

మాతృ భాషగొప్పదనం గూర్చి ఎంతోమంది కవులు, రచయితలు ఎన్నో రకాలుగా వర్ణించారు. గిడుగు వెంకట రామమూర్తి 1863, ఆగస్టు 29 లో జన్మించారు. తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు. గ్రాంథికభాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుకభాషలోకి తీసుకు వచ్చి, నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న మాధుర్యాన్ని తెలియజెప్పిన మహనీయుడు. ఆంధ్రదేశంలో వ్యావహారిక భాషోద్యమానికి మూలపురుషుడు. బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘసంస్కర్త, హేతువాది. శిష్టజన వ్యవహారికభాషను గ్రంథరచనకు స్వీకరింపజేయడానికి చిత్తశుద్ధితో కృషిచేసిన అచ్చతెలుగు చిచ్చర పిడుగు గిడుగు. గిడుగు ఉద్యమం వల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు వ్యావహారిక భాషలో సాగి, అందరికీ అందుబాటులోకి వచ్చింది. పండితులకే పరిమితమైన సాహిత్యసృష్టి, సృజనాత్మకశక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ వీలైంది. గిడుగు రామ్మూర్తి జయంతి ఆగస్టు 29ని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నాము.

గిడుగు వెంకట రామమూర్తి శ్రీకాకుళం జిల్లా పర్వతాలపేట అనే గ్రామంలో జన్మించాడు. అతని తండ్రి వీర్రాజు, తల్లి వెంకమ్మ. వీర్రాజు పర్వతాలపేట ఠాణాలోరివెన్యూ అధికారిగా పని చేస్తుండేవాడు. 1875 దాకా ప్రాథమిక విద్య ఆ ఊళ్ళోనే సాగింది. తండ్రి చోడవరం బదిలీ అయ్యి అక్కడే జ్వరంతో 1875 లోనే చనిపోయాడు. విజయనగరంలో మేనమామగారి ఇంట్లో ఉంటూ రామమూర్తి మహారాజావారి ఇంగ్లీషు పాఠశాలలో ప్రవేశించి 1875 మొదలు 1880 వరకు విజయనగరంలో గడిపాడు. 1879లో మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు. ఆ ఏడే రామమూర్తికి పెండ్లి అయింది. 1880లో ముప్పై రూపాయల జీతంమీద పర్లాకిమిడి రాజావారి బళ్ళో ఫస్టు ఫారంలో చరిత్ర బోధించే అధ్యాపకుడైనాడు. ప్రతి ఒక్కరూ వారిని స్ఫూర్తిగా తీసుకోవాలి. వారి జయంతిని నిర్వహించి మాతృభాష తెలుగుకు ఉన్న తెగులును తరిమి కొట్టాలి. అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే జరపాలి. అధికార భాషా సంఘాన్ని ఏర్పా టు చేయాలి. మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి. తెలుగు మహాసభలు నిర్వహించాలి. ప్రభుత్వ కార్యాలయాల చిరునామాలు తెలుగులో రాయించాలి. జనవరి 22న 1940న గిడుగు మరణించారు.

**(ఆగస్ట్ 29న గిడుగు రాంమూర్తి పంతులు జయంతి)**

## గణనాథులను దర్శించుకున్న పీసరి మహిపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తూంకుంట మున్సిపాలిటి దేవరయాంజాల్‌లోని గణేశ్ మండపాల్లో నెలకొల్పిన గణనాథులను టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డిలు గురువారం దర్శించుకున్నారు. వినాయక చవితి పండగను పురస్కరించుకుని వార్డు కార్యాలయాల్లో యువజన సంఘాలు ప్రతిష్ఠించిన గణేశ్ మండపాలకు వెళ్లిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి మహిపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువజన సంఘాల నాయకులు, సభ్యులు నవరాత్రుల పూజలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకుని గణనాథుని నిమజ్జనానికి తరలించాలని సూచించారు.

## మహీంద్రా వర్సిటీ ముందు ధర్నా



**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ మున్సిపల్ పరిధిలోని బహదూర్ పల్లి టెక్ మహీంద్రా వర్సిటీ గేటు ముందు ఎబివిపి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఇటీవల యూనివర్సిటీలోని ఐదుగురు విద్యార్థులు గంజాయి విషయంలో పోలీసులకు దొరికారు. కాగా ఇదే విషయంపై వైస్ ఛాన్సిలర్ స్పందించకపోవడంపై ఎబివిపి కూకట్‌పల్లి విభాగం కన్వీనర్ నాగేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల నుండి లక్షల్లో డబ్బులు వసూలుచేసినా పట్టించుకోవడం లేదన్నారు. విసిని అరెస్ట్ చేసి యూనివర్సిటీ లైసెన్స్ ను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా దుండిగల్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



## ఉద్యోగులకు క్రీడా పోటీలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకొనే మేజర్ ధ్యాన్‌చంద్ హాకీ లెజెండ్ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఉద్యోగులకు గురువారం క్రీడా పోటీలు నిర్వహించారు. వాలీబాల్, రన్నింగ్, చెస్, టగ్ ఆఫ్ వార్, క్రికెట్, మ్యూజికల్ చైర్, క్యారం బోర్డు, మొదలగు క్రీడల్లో జిల్లా యూత్ అడ్వాన్స్‌మెంట్ స్పోర్ట్స్ నిర్వహించిన పోటీల్లో జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని, క్రీడా స్ఫూర్తిని తమ విధుల్లో సైతం పాటిస్తే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించగలుగుతారన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన వారికి ఆమె బహుమతులను అందచేసారు. ఈ కార్యక్రమంలో లా అధికారి చంద్రావతి, స్పోర్ట్స్ అధికారి గోపాల్‌రావు, పరిపాలనాధికారి రాంమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి

### నవాబుపేట్ ఎమ్మార్వో బుచ్చయ్య

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** రాష్ట్రంలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నవాబుపపేట్ ఎమ్మార్వో జెవాళ్ళ బుచ్చయ్య అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అత్యవసరం ఉంటే తప్పా వర్షాల సమయంలో రైతులు, ప్రజలు బయటికి రాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు.

రైతులు కరెంటు బావుల దగ్గరికి వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, వరద నీరు వెళ్లే నాలాలు, మ్యాన్ హోల్స్ సమీపంలోకి వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడే ప్రమాదాలు గతంలో చూశామని, కావున ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. వర్షాలు, వరదల వల్ల సహాయక చర్యలు చేపట్టేందుకున్నిటి కన్నా ముఖ్యంగా ఎవరికివారు వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. విద్యు త్ సరఫరా అయ్యో లైండ్లను పరిశీలిస్తూ తమ పశుసంపదను కాపాడుకునే ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. అత్యవసరమైతే, ఏదైనా సంఘటన జరిగితే 100 నంబర్ స్థానిక మండల అధికారులకు ఫోన్ చేయాలనిఅన్నారు.

## పశుసంవర్ధక శాఖ డిప్యూటి డైరెక్టర్‌గా బి.శంకర్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మేడ్చల్ జిల్లా నూతన పశువైద్య , పశుసంవర్ధక శాఖ డిప్యూటి డైరెక్టర్‌గా నియమితులైన బి.శంకర్ గురువారం పదవీ బాధ్యతలు నిర్వహించారు. ఇప్పటి వరకు ఆయన ఇక్కడే అసిస్టెంట్ డైరెక్టర్ హోదాలో పని చేస్తున్నారు.



## ధృవీకరణ పత్రాలు జాప్యం లేకుండా జారీ

### అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ధృవీకరణ పత్రాల కోసం వచ్చే ధరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత వ్యవధిలో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా జారీ చేస్తుండాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం కీర మండలంలో పర్యటిస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయా న్ని ఆకస్మికంగా తనిఖీ చేసారు. అక్కడ వివిధ రికార్డులు పరిశీలించిన అనంతరం కులం, లోకల్ (స్థానికత) ఆదాయం లాంటి ఇతరత్రా ధృవీకరణ పత్రాల నిమిత్తం విద్యార్థులు, ఉద్యోగాల కు వెళ్లే వారు, ఉపాధి రుణాలు పొందే వారు రెవెన్యూ అధికారులను ఆశ్రయిస్తుంటారని, వీటన్నింటిని ధరఖాస్తుదారులు పొందుపరచిన వివరాలు, జత పరచిన పత్రాలన్నింటిని పరిశీలించటం, అవసరమైన సందర్భాల్లో క్షేత్ర స్థాయికి వెళ్లటం చేయటం ద్వారా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సత్వరం జారీ చేస్తుండాలే తప్ప ఎవరినీ ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించారు.అదే విధంగా పరిపాలనాపరమైన ఫైళ్లను పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం రెవెన్యూ సదస్సులు, భూభారతి సదస్సుల్లో భూసంబంధిత అర్జీలు ఏ మాత్రం పరిష్కరమయ్యాయని ప్రశ్నిస్తూ సత్వరమే అపరిష్కృత ధరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యాలయ సిబ్బంది, శిక్షణ పొందిన సర్వేయర్ల పనితీరును అడిగి తెల్సుకొన్నారు. అనంతరం కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్, డిటి అశ్విన్ కుమార్, ఆర్‌ఐ విశ్వనాథ్ తదితర రెవెన్యూ సిబ్బంది ఈ కార్యక్రమంలో ఉన్నారు.

## సైబర్ నేరాల నియంత్రణ భేష్

### టిజిసిఎస్‌బికు పిఎస్‌సి ప్రశంసలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టడంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) సాధించిన అద్భుతమైన విజయాలను పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ (పిఎస్‌సి) ప్రశంసించింది. 'సైబర్ నేరాలు ధోరణులు, రక్షణలు, నియంత్రణ' అనే అంశంపై పార్లమెంటుకు ఇటీవల సమర్పించిన నివేదిక ఆధారంగా ఎంపి రాధా మోహన్ దాస్ అగర్వాల్ అధ్యక్షతన పిఎస్‌సి కమిటి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ చేధించిన విజయాలను చర్చించింది. ఆన్‌లైన్ బెదిరింపుల నుండి పౌరులను రక్షించడానికి వినూత్నమైన ,ప్రభావవంతమైన చొరవలను అవలంబించినందుకు మహారాష్ట్ర, కేరళతో పాటు తెలంగాణను ప్రశంసించింది. భారతదేశం అంతటా మొత్తం సైబర్ నేర నియంత్రణ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఈ మార్గదర్శక పద్ధతులను ఇతర రాష్ట్రాల్లో కూడా పునరావృతం చేయాలని ప్యానెల్ అభిప్రాయపడింది. ఏప్రిల్ 2024లో ప్రారంభమైనప్పటి నుండి, తెలంగా ణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో 472 కేసులు నమోదు చేయడం 160 మంది సైబర్ నేరస్థులను అరెస్టు చేయడం ద్వారా గణనీయమైన పురోగతి సాధించిందని కమిటీ హైలైట్ చేసింది. దీంతో పాటు రూ.283 కోట్ల విలువైన మోసాలను నిరోధించడంలో బ్యూరో చురుకైన విధానాన్ని, వివిధ సైబర్ నేరాలలో పాల్గొన్న 800 మందికి పైగా నేరస్థులను గుర్తించడాన్ని కూడా ఇది గుర్తించింది. టిజిసిఎస్‌బి వేగవంతమైన ప్రతిస్పందన విధానాలు, ప్రజా అవగాహన కార్యక్రమాలు పౌరులకు మరింత సురక్షితమైన డిజిటల్ పర్యావరణ వ్యవస్థను నిర్మించడంలో దోహదపడ్డాయని అధికారులు ప్యానెల్‌కు తెలియజేశారు. జాతీయ స్థాయి చట్టం అవసరాన్ని నొక్కి చెబుతూ, హోం మంత్రిత్వ శాఖ తగిన మద్దతును అందించాలని, అన్ని రాష్ట్రాలలో తెలంగాణ వంటి విజయవంతమైన నమూనాలను స్వీకరించేలా చూడాలని కమిటీ సిఫార్సు చేసింది. రాష్ట్రాల మధ్య సహకారం మరియు వనరుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా, అధునాతన ముప్పులను ఎదుర్కోవడానికి భారతదేశం మరింత స్థితిస్థాపక సైబర్ నేర నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయగలదని ప్యానెల్ నొక్కి చెప్పింది. సైబర్ భద్రత మరియు ప్రజా డిజిటల్ భద్రతలో తనను తాను అగ్రగామిగా నిలబెట్టుకోవడంలో దాని కొనసాగుతున్న ప్రయత్నాలకు తెలంగాణకు ఈ గుర్తింపు ఒక పెద్ద ప్రోత్సాహకంగా నిలుస్తుంది.

## నయాస్టైల్... మత్తుకోసం దగ్గు మందు..

* 102 బాటిళ్లు స్వాధీనం
* నిందితుడి అరెస్టు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గంజాయి, డ్రగ్స్ లభించక పోవడంతో డ్రగ్స్ మత్తుకు అలవాటు పడిన వ్యక్తులు నిషేధిత దగ్గు మందు టానిక్‌లను తాగి మత్తులో మునిగిపోతున్న ఉదంతం హైదరాబాద్‌లో తాజాగా వెలులోకి వచ్చింది.దీంతో రంగంలోకి దిగిన ఎక్సైజ్ అధికారులు నిషేదిత దగ్గు మందు బాటిళ్లను విక్రయిస్తున్న ఓ ముఠా గుట్టును రట్టు చేశారు. ఈ క్రమంలో 102 బాటిళ్లను స్వాధీనం చేసుకుని వీటిని అక్రమంగా విక్రయిస్తున్న నిందితుడిని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్ గురువారం మీడియాకు వెల్లడించారు. కొత్తపేటకు చెందిన మూసం లక్ష్మ ణ్ నిషేదిత దగ్గు మందు (కోడిన్ పాస్పెట్)ను గంజాయి, డ్రగ్స్ వినియోగదారులకు సరఫరా చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ బాలరాజు, ఎస్‌ఐ రవి లక్ష్మ ణ్‌పై నిఘా పెట్టారు. లక్ష్మ ణ్ ఈ దగ్గు మందును విక్రయించేందుకు బైక్‌పై వెళ్తుండగా మందమల్లమ్మ చౌరస్తా వద్ద ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అడ్డగించి తనిఖీ చేశారు. అతని వద్ద నుంచి 102 కోడిన్ పాస్పెట్ దగ్గు మందు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. రూ.190 ఎంఆర్‌పి ధర కలిగిన ఈ దగ్గుమందు బాటిల్స్‌ను లక్ష్మీ ణ్ తన ఇంట్లో పెట్టుకొని రూ. 350కు ఒక బాటిల్‌ను అమ్మకాలు చేపడుతున్నట్లు విచారణలో వెల్లడయ్యింది. కోడిన్ పాస్పెట్ బాటిళ్లను డ్రగ్స్ ఆధారిటీ గతంలోనే నిషేదించింది. దగ్గు మందును డాక్టర్ చీటితో మాత్రమే అమ్మకాలు జరపాల్సి ఉంది. కాని కొందరు అక్రమంగా దగ్గు మందు ను తయారు చేస్తూ ఎవ్వరికి అనుమానం రాకుండా అమ్మకాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. మార్కెట్‌లో మత్తు కలిగించే గంజాయి ప్యాకెట్ ధర రూ. 500 ఉంది. ఒక గ్రాము ఎండిఎంఎ డ్రగ్ విలువ రూ. రూ.5000 ఉంది. అంత డబ్బుతో కొనుగోలు చేయలేని వారు, మత్తుకు బానిసగా మారిన వారు ఇలా మార్కెట్ లో అక్రమంగా అమ్మకాలు జరుపుతున్న దగ్గు మందును వాడి మత్తులో మునిగి పోతున్నారని విచారణలో తేలింది.

ఇలాంటి నిషేది మత్తు మందు లను అమ్మకాలు జరుపుతున్న మెడికల్ హాల్‌పై చర్యలు తీసుకోవాల్సిందిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బాలరాజు డ్రగ్స్ కంట్రోల్‌కు సమాచారం ఇచ్చారు. ఇలాంటి నిషేదిత కోడిన్ పాస్పెట్ మందు ను పట్టుకున్న సిఐ, సిబ్బందిని అసిస్టెంట్ కమిషనర్ ఆర్. కిషన్, ఏఈఎస్ జీవన్ కిరణ్ అభినందించారు.

## వరద నీటి ప్రవాహ సమస్యకు శాశ్వత పరిష్కారం

### ఎమ్మెల్యే కెపి వివేకానంద



**ప్రజాపక్షం/నిజాంపేట్:** వరద నీటి ప్రవాహ సమస్యను శాశ్వతంగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని బిఆర్‌ఎస్ పార్టీ శాసనసభ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం డివిజన్ ఆదర్శనగర్ కాలనీలో కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఇళ్లలోకి వరద నీరు చేరుతున్న సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కెపి వివేక్ గురువారం పర్యటించారు. కాలనీలో ఎక్కడెక్కడ వరద నీరు తీవ్రంగా వస్తుందో తెలుసుకుని పరిష్కార దిశగా అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ నియోజకవర్గంలో గత పన్నెండు ఏళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో వెచ్చించి వరద నీటి ప్రవాహాన్ని, మురుగునీటి సమస్యను సాధ్యమైనంత వరకు పరిష్కరించామని వివరించారు. ఎత్తైన కాలనీల నుండి వస్తున్న వర్షపు నీటితో లోతట్టు ప్రాంతాలలోని ఇళ్లలోకి వరద నీరు చేరుతుందని, ఇట్టి సమస్యను సైతం పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. వరద నీటి సమస్య పరిష్కరించడానికి ప్రత్యేకంగా ఎస్ఎన్‌డిపి కింద ఇప్పటికే అనేక నాలాలను అభివృద్ధి చేశామని తెలిపారు. రాబోవు రోజుల్లో కూడా వరద నీరు కాలనీల్లోకి



రాకుండా తగిన చర్యలు తీసుకుంటానని అన్నారు. యుద్ధ ప్రాతిపదికన వరద నీటి ప్రవాహ సమస్యను పరిష్కరిస్తానని, సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు తగిన ప్రణాళికలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, సాగర్ రావు, శ్రీకాంత్ రెడ్డి, దయాకర్, కృష్ణ, గోపాల్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, విజయ్ రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**మిథులానగర్ గణేశ్ మండపంలో ఎమ్మెల్యే పూజలు..** గాజులరామారం డివిజన్ మిథులానగర్‌లో ఏర్పాటు చేసిన గణేశ్ మండపంలో స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద ప్రత్యేక పూజలు చేశారు. వివేక్ మాట్లాడుతూ విఘ్నాలను తొలగించే దైవం వినాయకుడని అన్నారు. ఆ గణనాథుని ఆశీస్సులతో ప్రజలంతా సుఖఃసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రవీంద్రనాథ్ ఠాకూర్, చెంగల్ రాయుడు, పోతినేని ప్రవీన్, చంద్రమోహన్, విజయ్, శ్రవన్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ స్తంభాల మార్పుకు సహకరించాలి

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న రోడ్డు వెడల్పు పనుల నేపథ్యంలో విద్యుత్ స్తంభాల మార్పు అంశంపై చర్యలు తీసుకోవాలని టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషార్రఫ్ అలీని బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ మింట్ కాంపౌండ్‌లోని కార్యాలయంలో కలసి విజ్ఞప్తి చేశారు. సిఎండి ముషార్రఫ్ అలీ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చోట స్తంభాల పునర్వ్యవస్థీకరణకు తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ చర్యల ద్వారా రాబోయే రోజుల్లో బోడుప్పల్ నివాసులకు ప్రయాణ సౌకర్యం పెరగడం, ట్రాఫిక్ సమస్యలు తగ్గడం జరుగుతుందని మాజీ మేయర్ అజయ్ యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎండీని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## గణేష్ నిమజ్జన ఉత్సవంలో ఇబ్బందులు రాకుండా చర్యలు : డిసిపి కోటిరెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** వినాయక ఉత్సవాల్లో బాగంగా నిమజ్జనాలకు తరలివచ్చే ప్రజలకు, భక్తులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి అన్నారు. గురువారం శామీర్‌పేట పెద్ద చెరువును మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి పేట్ బషీరాబాద్ ఎసిపి బాలగంగిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డిసిసి మాట్లాడు తూ వినాయక నిమజ్జనానికి చేస్తున్న ఏర్పాట్ల ను సంబందిత శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో పనిచేస్తు సమగ్ర ఏర్పాట్లను చేయాలని సూచించారు. గనేశ్ నిమజ్జనానికి విచ్చేసే భక్తులకు ఎట్టి పరిస్థితుల్లోను ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి, మున్సిపల్ డిఇ సునీత, శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్, ఎస్‌ఐ శశివర్ధన్‌రెడ్డి, బాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కోకన్వీనర్ రవీందర్ గౌడ్, సంబందిత అధికారులు పాల్గొన్నారు.

**డిజెలకు అనుమతి లేదు : ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్**

వినాయక ఉత్సవాలకు డిజేలకు అనుమతి లేదని డిజె నిర్వాహకులు డిజెలు పెడితే చట్టపరమైన చర్యలు చేపడుతామని శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ హెచ్చరించారు. గురువారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని డిజెల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సిఐ శ్రీనాథ్ మాట్లాడుతూ శబ్దకాలుష్యం లేకుండా వినాయక ఉత్సవాలను నిర్వహించుకోవాలని వినాయక మండపాల వద్ద





డిజెలు పెట్టకూడదని, చిన్న పిల్లలు, వయోవృద్దుల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకు ని డిజెలను నిషేధిస్తున్నట్లు పేర్కొన్నారు. వినాయక నిమజ్జన ఊరేగింపులో భారీ శబ్దాలతో డిజెల సౌండ్‌లు పెట్టకుండా భక్తిభావంతో స్వామి వారిని నిమజ్జనాలకు తరలించాలని తెలిపారు. ఎవరైనా డిజె నిర్వాహకులు పోలీస్ శాఖ చేసిన సూచనలను పాటించకుండా వ్యవహరిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సోమిరెడ్డి, డిజె నిర్వాహకులు పాల్గొన్నారు.

## యూరియా కొరతను తీర్చండి

### ఆర్‌డిఒకు మాజీ ఎమ్మెల్యే వినతిపత్రం

**ప్రజాపక్షం/వికారాబాద్:** వికారాబాద్ పట్టణంలోని పిఎసిఎస్ కార్యాలయం దగ్గర ఉదయం 6గంటలనుండి రైతులు యూరియా కోసం వానలో తడుస్తూ బారులు తీరిన రైతులను పరామర్శించిన వికారాబాద్ జిల్లా బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే అనంద్ ఈ సందర్భంగా లైన్లో వేచి ఉన్న రైతులతో మాట్లాడి యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం రైతుల పట్ల చూపిస్తున్న నిర్లక్ష్యానికి గాను రైతులతో పాటు క్యూలైన్‌లో నిలబడి నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇలా ఎరువుల కోసం సరఫరా కేంద్రాల ముందు బారులు తీరాల్సి వస్తుందని నిరసన వ్యక్తం చేశారు. స్పీకర్ యూరియాపై సమీక్ష నిర్వహించి రైతులకు అందించాలని విజ్ఞాప్తి చేశారు. కేసిఆర్ ,కేటిఆర్ మిద విమర్శలు మాని రైతులకు సరిపడా ఎరువులు సాకీంలో అందించడంపై దృష్టి పెట్టాండి అని అన్నారు.

అనంతరం ఆర్‌డిఓ కార్యాలయని నికి ర్యాలీగా వెళ్లి ఆర్‌డిఓ వాసుచంద్రకు వినతి పత్రం ఇచ్చారు. యూరియా సమస్యను పరిష్కి రంచకపోతే,కలెక్టర్ కార్యాలయం, అవసరం అయితే సచివాలయాన్ని ముట్టడిస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో పట్టణఅధ్యక్షులు గోపాల్ , ప్రభకర్‌రెడ్డి ,ఆశోక్ , తదితరలు పాల్గోన్నారు.




## స్వాతి హత్యపట్ల విచారణ కమిటీ

### మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ డిమాండ్

**ప్రజాపక్షం/వికారాబాద్:** వికారాబాద్ మండల పరిధిలోని కామారెడ్డి గూడా లో కులాంతర ప్రే వివాహం చేసుకునప్నా స్వాతి హత్య పట్ల ఎంక్వైరీ కమిటీ ఏర్పాటు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనసూయ , కార్యదర్శి వై గీత ప్రభుత్వంని డిమాండ్ చేశారు. తల్లి దండ్రులను పిఓడబ్ల్యు రాష్ట్ర బృందం స్పందిస్తూ హతురాలు స్వాతి హంతకుడు ఆమే భర్త మహేందర్‌రెడ్డి ఇండ్లు పక్కసక్కనే ఉండటం మహేందర్‌రెడ్డి తల్లిదండ్రులు కుటంబ సభ్యులు కింద కులం అమ్మాయిని పెళ్లి చేసుకున్నాందుకు అవమానంగా భావించి వారిని ఊర్లో లేకుండా కుట్రపూరితంగా హైదరాబాద్ పంపించి ఆ అమ్మాయిని అనేక హింసలకు గురిచేసి రెండుసార్లు గర్భవతి అయిన అమ్మాయిని అబార్షన్ చేయించి వివరకు పక్క ప్రణాళికతో ఆ అమ్మాయిన చంపి బాడి పార్ట్స్ దొరకకుండా మాయం చేసిన సంఘటనలో ప్రధానంగా మేము గమనించిన విషయాలు ,దీని వెనకాల క మహేందర్‌రెడ్డి కాదు ఇతరుల కూడా ఉండే అవకాశం ఉంది .అమ్మాయి కుటంబ సభ్యులకు ఆర్థిక బలం ,రాజకీయ అండ లేదు కవున ఏమి చేయలేరన్న ధీమ్మతో స్వాతి చెల్లె ,తమ్ముడిని కూడా చంపేస్తామని బెదరిస్తున్నారు . ఇది కులాంతర వివాహనికి ప్రతీకారంగా చేసిన పరువు హత్యగా మేం భవివిస్తున్నాము ,ఒక ప్రత్యేక ఎంక్వయిరీ కమిటీ వేసి నిజాలను బయటకు తీసీ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భారతి ,ప్రేమలత ,ప్రభావతి, అంజమ్మ ,లక్ష్మి , తదితరులు పాల్గోన్నారు

## యూరియా దుర్వినియోగం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు

**ప్రజాపక్షం/వికారాబాద్ :** యూరియా దుర్వినియోగం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను అదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో యూరియా లభ్యత ,నానో యూరియా వాడకం ,చెక్ పోస్ట్ ల ఏర్పాటు తదితర అంశాలపై వ్యవసాయ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూరియా బ్లాక్ మార్కెట్ కాకుండా జాగ్రత్త తీసుకోవాలని, యూరియా లభ్యతపై రైతులు ఎలాంటి ఆందోళన చెందకూడదనే భారోసా ఇవ్వాలన్నారు. రైతులకు యూరియా లభ్యతకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అందుబాటలో ఉంచాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 20124 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయడం జరిగిందని వారం రోజుల్లో గా జిల్లాకు అదనంగా 640 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ప్రైవేట్ డీలర్ల వద్ద 596 ఒట్టి టన్నుల యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ తెలిపారు. మార్‌పేడ్ సోసెటీలకు 100 మెట్రీక్ టన్నుల యూరియా ను తరలిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మండల వ్యవసాయ అధికారులు ,విస్తరణ అధాకారులు యూరియా విక్రయా కేంద్రాల వద్ద ఉంటూ క్షణంగా పరిశీలిస్తు రైతులకు యూరియా అందే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని అదికారులకు సూచించారు. నానో యూరియా పై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. నానో యూరియా వాడకంపై రైతులకు తెలియజేస్తూ వారిని ప్రోత్సమించాలని అయన అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సామవేశంలో అదనపు కలెక్టర్ సుధీర్ .జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాజారత్నం ఏడిఏ సంధీప్ కుమార్, ఎడిలు సౌభగ్యా లక్ష్మి శంకర్ నాయక్, వెంకటేశం తదితరులు పాల్గోన్నారు.



**పాఠశాలల నిర్వహణలో అధికారుల చిత్తశుద్ధితో పనిచేయాలి :** వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారులు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో పాఠశాలల్లో నోట ,వర్క్ ,పాఠ్యపుస్తకాలు, యునిఫామ్‌ల ఫంపిణీ ఉపాధ్యాయుల విద్యార్థుల ముఖ హాజరు అఫార్ ఐడి ఎఫ్ఎల్ఎన్ ,పాఠశాలల సందర్శన తదితర అంశాలను ఆన్‌లైన్ లో పోందుపరిచిన వివరాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా ప్రమాణాలకు తీసుకోవాలసిన మెళుకువలు గుర్తించాలన్నారు. సమాజాన్ని మార్చాల్సిన ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచిది కాదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సుదపాయలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచిది కాదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సదపాయాల కల్పనకు మరమ్మత్తు పనులు చేయించడం జరుగుతుందని అయన తెలిపారు. చిన్న చిన్న సమస్యలను అదిగమిస్తూ విద్యార్థుల భోధన పట్ల అంకితభవంతో పనిచేయాలని అయాన అన్నారు. ఎఫ్ఎల్ఎన్ విధానాన్ని సక్రమంగా నిర్వహించాలని తెలుగు ,ఇంగ్లీష్ , మాథ్స్ సబ్జెక్టులపై విద్యార్థులకు పట్టు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. మండల విద్యాధికారులు పాఠశాలలను తప్పనిసారిగా సందర్శిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా చేస్తున్న కార్యక్రమాలను ఆన్‌లైన్ లో ఎప్పటికప్పుడు పొందుపరాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఉపాధ్యాయులు ,విద్యార్థులు ముఖ హాజరును తప్పనిసరిగా పాటించాలని ఇప్పటికీ రిజిస్టేషన్ తీసుకోలేని వారు రిజిస్టేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని అయన సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ట్రైనింగ్ కలెక్టర్ హర్స్ చౌదరి , జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి పాల్గోన్నారు.

**ఎటిసిలో అత్యధికంగా యువతకు ప్రవేశాలు చేపట్టాలి:** సెప్టెంబర్ ఒకటోవ తేదీ నుండి ఏటీసీలలో కోర్సులు ప్రారంభమవుతున్న క్రమంలో ఏటీసీసంబంధించిన గోడు పత్రికను విడుదల చేశారు. తాండూర్ , వికారాబాద్ ,మోమిన్‌పేట్‌లో అత్యధిక నైపుణ్యతతో కూడిన శిక్షణ ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. ఈ నెల 30వరకు ఏటీసీలో ప్రవేశాలకు అవకాశాలన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

**విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందున జిల్లా సివిల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ అనంద్ కు మెమో :** వికారాబాద్ జిల్లా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో పని చేస్తున్న 9మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కలెక్టర్ అనుమతి లేకుండా ఎలంఆటి పర్మిషన్ తీసుకోకుండా బదిలీ చేయడం జరిగింది . సిబ్బంది అందుబాటులో లూనందున పరిపాలన పనులకు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో ఆటంకం ఏర్పాడినందున మెమో జారీ చేయడం జరిగిందని ,ఒక్క రోజులో నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అదేశించారు.

## ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు తెలపండి : ఎంపిడిఒ

**ప్రజాపక్షం/కొందుర్గు:** ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను తెలిపేందుకు ప్రజలు కృషి చేయాలని కొందుర్గు ఎంపిడిఒ లక్ష్మీ అనురాధ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాకు సంబంధించిన వివరాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ లక్ష్మీ అనురాధ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా..ఒక వార్డు నుండి మరో వార్డుకు పేరు మారిన, చిరునామా మారిన సంబంధిత పంచాయతీ కార్యదర్శి లేదా ఎంపిడిఓ ఆఫీసులో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆగస్టు 30వ లోగా ఓటర్ జాబితాలో ఎలాంటి తప్పులు ఉన్నా తక్షణమే పరిష్కరించుకునేందుకు ఓటర్లు కృషి చేయాలని, ఇందుకు అన్ని రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని పేర్కొన్నారు. ఇందుకు ప్రజలందరు, రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ గణపతితోపాటు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పోలింగ్ స్టేషన్లు, ఓటర్ల జాబితా విడుదల చేసిన అధికారులు

**ప్రజాపక్షం/కొత్తూరు:** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ స్టేషన్లు, ఓటర్ల జాబితాకు సంబంధించిన ముసాయిదాను అధికారులు విడుదల చేశారు. గురువారం కొత్తూరు మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీ వార్డుల వారిగా ముసాయిదా జాబితా, ముసాయిదా పోలింగ్ స్టేషన్ల జాబితా విడుదల చేశామని ఎంపిడిఓ అరుంధతి వివరించారు. జాబితాలో ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నవో గ్రామ పంచాయతీ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయంలో లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేసుకోవచ్చని తెలిపారు. ఈనెల 28వ తేది నుండి 30వ తేది వరకు తమ అభ్యంతరాలను తెలియజేసేందుకు అన్ని రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని ఎంపిడివో అరుంధతి సూచించారు. అదే విధంగా 30వ తేది మధ్యాహ్నం 12గంటలకు అన్ని రాజకీయ పార్టీలతో మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం సైతం నిర్వహించడం జరుగుతుందని వివరించారు.

## విద్యుత్ అమరవీరులకు నివాళులు

**ప్రజాపక్షం/గండిపేట:** బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరులకు సిపిఐ గండిపేట్ మండల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. సిపిఐ గండిపేట్ మండల కార్యదర్శి ఎస్.మల్లేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సిపిఐ గండిపేట్ మండల కార్యదర్శి మండల కార్యవర్గ సభ్యులు ఎం.శంకరయ్య,ఎం బాబురావు, డి.శ్రీనివాస్, కౌన్సిల్ సభ్యులు, రాములు గౌడ్, నాయక్,శీను,శంకర్,వెంకన్నపాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతులు



**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** బడంగ్‌పేట మున్సిపల్ కార్పోరేషన్‌లోని సుల్తాన్‌పూర్ గ్రామంలో శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మత్తులు ప్రభుత్వాన్ని చేయించేలా చర్యలు చేపట్టాలని వెంకటాపూర్ మాజీ సర్పంచ్, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొర్ర జగన్‌రెడ్డి అన్నారు. శిథిలావస్థలో ఉన్న సుల్తాన్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని జగన్‌రెడ్డి నాయకత్వంలో ప్రైవేట్ భవనంలోకి మార్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం భవనానికి మరమ్మత్తులు చేపట్టే వరకు ప్రైవేట్ భవనంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవనానికి నెలకు రూ.4వేల ను అద్దెను తాను చెల్లిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికైనా అధికారులు భవనానికి మరమ్మత్తులు చేయించాలని, మాతో కాదని చెబితే తన సొంత నిధులు మరమ్మత్తులు చేయించేందుకు సిద్దంగా ఉన్నట్లు తెలిపారు.

## విద్యా వలంటరికి లయన్స్‌చేయూత




**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని గంగారం ప్రభుత్వ పాఠశాలలో విద్యావాలంటిరిగా విధులు నిర్వహిస్తున్న సీతా రాధికకు లయన్స్ క్లబ్ ఆఫ్ హైద్రాబాద్ 2 నెలల జీతం 24 వెల రూపాయలను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ ఆఫ్ హోప్ ప్రధానకార్యదర్శి కొండా విజయ్ కుమార్ , లయన్స్ క్లబ్ జోన్ చైర్మేన్ మధూసుధన్ రెడ్డిలు విచ్చేసి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ లయన్స్ ఆఫ్ హైద్రాబాద్ అధ్వర్యంలో సాంఘిక సంక్షేమ సహయ సహకారలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోశాధికారి బర్కా మల్లేష్ యాదవ్, మారం ప్రసాద్, బస్వరాజు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ భీమమ్మ, నరహరి తదితరులు పాల్గొన్నారు.

## శివారు కాలనీల సమస్యలు పరిష్కారం

### బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

**ప్రజాపక్షం/ఎల్‌బినగర్:** బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎపిఆర్ క్రిస్టల్ విల్లా నుంచిహాలక్ష్మీ నగర్ వరకు స్ట్రోమ్ వాటర్ డ్రైన్ లైన్ ఏర్పాటు చేసి శివారు కాలనీల వరద ముంపుకు శాశ్వత పరిష్కారం చేయబోతున్నామని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి స్పష్టం చేశారు. గురువారం డివిజన్లోని ఎపిఆర్ క్రిస్టల్ విల్లా నుంచి మహాలక్ష్మీ నగర్ వరకు రాచ కాలువను ఇరిగేషన్ డీఈ శుక్లజ, సర్వేర్ జ్యోతితో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు ఏఇ సతీష్, హైడ్రా ఎస్ఐ ముజాఫర్, వనస్థలిపురం ఎస్ఐ అనిల్, జలమండలి మేనేజర్ సిరివెన్నెల, ఇంజనీరింగ్ విభాగం ఏఇ కార్తీక్, శ్రీకాంత్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## యూరియ కోసం రైతులు పడిగాపులు



**ప్రజాక్షం/ఇబ్రహీంపట్నం :** యూరియ కోసం రైతులు తీవ్ర ఇబ్బందులకు గురైవుతు సహకార సంఘం వద్ద పడిగాపులు కాస్తు భారి ఎత్తున బారులు తీరిన సంఘటన గురువారం చోటుచేసుకుంది.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం మండలం శేరిగూడ గ్రామంలో ఉన్న ఉప్పరిగూడ వ్యవసాయ సహకార సంఘం వద్ద యూరియ కోసం గంటల తరబడి లైన్లో నిలబడి ఉన్నా యూరియ బస్తాలు అయ్యి పోయాయని సహాకార సంఘం అధికారులు చెప్పటంతో యూరియ లభించక నిరాశతో వెనుతిరిగి పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంత మంది భూమి లేని మద్య దళారులు ఆధార్ కార్డుతో అక్రమంగా యూరియను తీసుక పోవటం వల్ల అర్హులైన రైతులకు యూరియ దొరకటం లేదని రైతులు ఆవేదన వెలిబుచ్చారు. ఆధార్ కార్డుతో పాటు భూమి పాస్ బుక్ తప్పని సరిపెడితే అర్హులైన రైతులకు న్యాయం జరుగుతుందని ప్రభుత్వాన్నికి సూచించారు. సంబందిత అధికారులు తక్షణమే స్పందించి యూరియను అందుబాటులో పెట్టి సమస్యను తీర్చాలని కోరారు.

## ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాలు

### శంషాబాద్ డిసిపి రాజేష్



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనాలను చేపట్టేందుకు నిర్వాహకులు కృషి చేయాలని శంషాబాద్ డిసిపి రాజేష్ సూచించారు. గురువారం షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని బొబ్బిలి చెరువు, చటాన్‌పల్లి చెరువు, ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దూసకల్ చెరువు, బుచ్చిగూడ చెరువులను స్థానిక ఏసిపి లక్ష్మీనారాయణతోపాటు పోలీస్ అధికారులు, మున్సిపల్ కమీషనర్ సునీతలు పరిశీలించారు. ఈ సందర్భంగా డిసిపి రాజేష్ మాట్లాడుతూ అధికారులు ప్రణాళిక బద్దంగా విధులు నిర్వహించాలని సూచించారు. నిమజ్జన సమయంలో వినాయకుల వెంట చిన్నారులకు రానివ్వకుండా చూడాలని, ముందుకుగా ఏర్పాటు చేసిన రూట్లలోనే వినాయకులను తరలించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రాత్రి సమయంలోనే వినాయకులు నిమజ్జన కోసం వస్తుంటాయని, చెరువుల వద్ద విద్యుత్ లైట్లు, క్రైన్లు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పట్టణ సిఐ విజయ్‌కుమార్, మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, మహ్మద్ ఇబ్రహీం, కాంగ్రెస నేత పులిమామిడి శ్రీశైలం గౌడ్‌లు పాల్గొన్నారు.

# నిమజ్జనానికి జిహెచ్‌ఎంసి ప్రత్యేక ఏర్పాట్లు







**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్‌లో గణేశ్ నిమజ్జన కార్యక్రమాన్ని సులభతరం చేసేందుకు జిహెచ్‌ఎంసి ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. గణేశ్ ప్రతిమలను నిమజ్జనం చేసేందుకు నగరంలో 74 కృత్రిమ నిమజ్జన కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. హుస్సేన్ సాగర్, సరూర్ నగర్ చెరువు, ఐడిఎల్ చెరువు, సఫిల్‌గూడ చెరువు, సున్నం చెరువు వంటి 20 ప్రధాన చెరువులతో పాటు ఈ కృత్రిమ నిమజ్జన కేంద్రాలలో కూడా నిమజ్జనాలు జరగనున్నాయి. ఈ కృత్రిమ కేంద్రాల ఏర్పాటుతో ప్రధాన చెరువులపై ఒత్తిడి తగ్గించవచ్చని, అలాగే ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లకుండా వారి ఇళ్లకు సమీపంలోనే నిమజ్జనం చేసుకోవచ్చని జిహెచ్‌ఎంసి అధికారులు పేర్కొన్నారు. నిమజ్జన కార్యక్రమం సాఫీగా జరిగేందుకు వీలుగా ప్రతి నిమజ్జన కేంద్రం వద్ద ఒక ఇన్‌చార్జ్ అధికారి, నోడల్ అధికారి, పారిశుధ్య సిబ్బంది అందుబాటులో ఉంటారు. నిమజ్జనం కోసం అవసరమైన క్రేన్‌లు, వాహనాలను కూడా ఏర్పాటు చేశారు. నిరంతరాయంగా నిమజ్జనం జరిగేలా సిబ్బంది మూడు షిఫ్ట్‌లలో పనిచేస్తారు. అంతేకాకుండా, కంట్రోల్ రూమ్, మెడికల్ క్యాంపు, నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యాలు కల్పించారు.

## నిర్వాసితులను ఆదుకోవాలి : టిడిపి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారీవర్షాలతో నిర్వాసితులైన ప్రజలను తక్షణం ఆదుకోవాలని టిడిపి నాయకుడు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఈ విపత్కర పరిస్థితుల్లో అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో లేరని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలోని సగం జిల్లాల్లో భారీ వర్షాల వల్ల నష్టం వాటిల్లినప్పటికీ, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు తమ ఇళ్లు, ఆస్తులను కాపాడుకోవడానికి మాత్రమే పరిమితమయ్యారని సాయి బాబా విమర్శించారు. భారీవర్షాలతో నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే సహాయం అందించాలని సాయిబాబా డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు నల్లెల్ల కిషోర్, పి.బాల్‌రాజ్ గౌడ్, బాను ప్రకాష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## 'పాత పెన్షన్' కోసం పోరాటం

### జిహెచ్‌ఎంఇయు అధ్యక్షుడు ఊదరి గోపాల్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పాత పెన్షన్ విధానం (ఓపిఎస్) సాధన కోసం జిహెచ్‌ఎంసి ఉద్యోగులు పోరాటం కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్(జిహెచ్‌ఎంఇయు) ఆధ్వర్యంలో 'ఉద్యోగుల ఆత్మ గౌరవ సభ' పోస్టర్‌ను అధ్యక్షుడు ఉదరి గోపాల్ విడుదల చేశారు. జిహెచ్‌ఎంసిలో పనిచేస్తున్న సిపిఎస్ ఉద్యోగులందరూ ఈ సభలో పాల్గొని, పాత పెన్షన్ స్కీం సాధన పోరాటంలో భాగస్వామ్యులు కావాలని కోరారు. సిపిఎస్ రద్దు చేసి, ఓపిఎస్ అమలు చేయాలని ఈ సందర్భంగా గోపాల్ డిమాండ్ చేశారు. వచ్చే నెల 1వ తేదీన బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటలకు జరగనున్న ఉద్యోగుల ఆత్మ గౌరవ సభను విజయవంతం చేయాలని గోపాల్ పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి డి. నర్సింగ్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ బి. కన్నా, నాయకులు జి. నర్సింగ్ రావు, ఎం. కృష్ణ, కె. శేఖర్, సురేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# వరద ముప్పు తప్పించిన 'హైడ్రా'



ఊపిరి పీల్చుకున్న ఒయు కాలనీవాసులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** షేక్‌పేట డివిజన్‌లోని ఒయు కాలనీలో హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ గురువారం పర్యటించారు. ఇటీవల వర్షాలకు నీట మునిగిన కాలనీలో వరద ముప్పును నివారిస్తూ చేపట్టిన కాలువల అనుసంధాన పనులను పర్యవేక్షించారు. ఒయు కాలనీలోని ఆదిత్యా నగర్, రాహుల్‌నగర్, బృందావన్, సూర్యనగర్ కాలనీల మీదుగా సాగే వరద కాలువను మణికొండ మున్సిపాలిటీలోని ఆంబియన్స్ కోర్టు యార్డు గేటెడ్ కమ్యూనిటీ ముందు నుంచి వెళ్లే లైనుకు అనుసంధానం చేస్తూ చేపట్టిన పనులను పరిశీలించారు. ప్రత్యేకంగా పైప్‌లైన్ వేసిన ప్రాంతాలను హైడ్రా కమిషనర్ పరిశీలించారు. షేక్‌పేట కొత్త చెరువు నుంచి ఆదిత్యనగర్ మీదుగా శాతం చెరువును అనుసంధానిస్తూ సాగే వరద నీటి కాలువ కబ్జాలను పరిశీలించారు. వరద ప్రవాహానికి ఆటంకం లేకుండా చూడాలన్నారు. అవసరమైన చోట నాలా వాస్తవ వెడల్పు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒయు కాలనీలో వరద ముప్పును నివారించినందుకుగాను హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను షేక్‌పేట కార్పొరేటర్ రాషెద్ ఫరాజుద్దీన్ శాలువతో సన్మానించారు. స్థానికులు కూడా కమిషనర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. హైడ్రా కమిషనర్ చొరవతో ఈ అనుసంధానం జరిగిందని స్థానికులు తెలిపారు. జూబ్లీ హిల్స్ రోడ్డు నంబరు 19 లో నాలాను ఆక్రమించినట్టు వచ్చిన ఫిర్యాదును పరిశీలించారు. ఇక్కడ నాలాను ఆక్రమించడమే కాకుండా, సెల్లార్ కోసం గుంత తవ్వి వెంటనే నిర్మాణ పనులు చేయకపోవడంతో చుట్టుపక్కల ఇళ్లకు ఇబ్బందిగా పరిణమించిందన్న ఫిర్యాదును క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. నాలా ఆక్రమణను ఉపేక్షించేది లేదని, ఇతరులకు ఇబ్బంది లేకుండా పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

# సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తం

### రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం పట్టణంలోని కమ్యూనిటి ఆసుపత్రిలో డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మీ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా వైద్య పరీక్షలు చేయడం జరుగుతుందని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను ప్రజలె సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రతోపాటు వర్షపునీరు నిల్వ లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. సీజనల్ వ్యాధుల్లో భాగంగా ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి అప్పుల పాలు కావద్దని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్యం చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ప్రైవేట్ ఆసుపత్రులు పని చేయాలని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వర్షాల నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖలో సెలవులను రద్దు చేయడం జరిగిందని, 24గంటలు ప్రజలకు వైద్యులు అంటుబాటులో ఉంటారని తెలిపారు. చిన్నపిల్లలు, గర్భిణీలు, బాలింతలు, వృద్దులు కాచిన వేడి నీటిని, వేడి వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ విష్ణువర్ధన్, హెల్త్ ఎద్యుకేటర్ జె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

## మీ సేవా కేంద్రాలకు దరఖాస్తు

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

**ప్రజాపక్షం /రంగారెడ్డి :** మీసేవ కేంద్రాలు నెలకొల్పేందుకు ఆసక్తి, అర్హత కలిగిన వారు సెప్టెంబర్ 29లోగా దరఖాస్తు చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి గురువారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. మీసేవ సెంటర్ల ఖాళీలకు సంబంధించి రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని గండిపేట్ మండలం వట్టినాగులపల్లి,గండిపేట్, కిస్మత్పూర్, గంధంగూడా అదేవిధంగా చేవెళ్ల రెవెన్యూ డివిజన్ పరిధిలోని మొయినాబాద్ మండలం అజీజ్ నగర్, హిమాయత్ నగర్, కనకమామిడి, షాద్నగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని జిల్లేడు చౌదరిగుడా మండలం తూంపల్లి, ఏదిర, కందుకూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని సరూర్నగర్ మండలం తుమ్మ బౌలి, ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలోని మంచాల మండలం లోయపల్లిలో ఒక్కొక్కటి చొప్పున మీసేవ సెంటర్ల ఖాళీలు ఉన్నట్లు కలెక్టర్ వివరించారు. దరఖాస్తు చేయదలచుకున్న వారు సెప్టెంబర్ 20వరకు తమ పరిధిలోని రెవెన్యూ డివిజన్‌లో దరఖాస్తులను అందజేయాలని కలెక్టర్ తెలిపారు.

## 'కొంగరకుర్తి ఎ'పై విచారణ చేపట్టాలి

### రాష్ట్ర ప్రభుత్వానికి స్థానిక రైతుల విజ్ఞప్తి



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** రంగారెడ్డి జిల్లా , మహేశ్వరం మండలం, 'కొంగరకుర్తి ఎ' గ్రామ పరిసరాల్లోని 600 ఎకరాల భూములపై కమిటీ వేసి, విచారణ జరిపించాలని కొంగరకుర్తి ఎ గ్రామ రైతులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో కొంగరకుర్తి రైతులు ఎన్.వెంకటేష్ గౌడ్, ఎస్.కృష్ణారెడ్డి, వై.వేణుగోపాల్, జంగయ్య, ఆర్.శేషగిరిరావు, వై.గోపాల్, శ్రీధర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు కొంగరకుర్తి ఎ రైతులకు న్యాయం చేయాలని వారు వేడుకొన్నారు. సమావేశంలో పలువురు కొంగరకుర్తి గ్రామ రైతులు పాల్గొన్నారు.

# లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్‌తో వ్యవసాయానికి మేలు

### ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్‌తోనే వ్యవసాయ రంగం సస్యశ్యామలం అవుతుందని, ప్రజలకు సాగునీరు, తాగునీరు అందుతుందని ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డితో కలిసి ఉన్నతస్థాయి అధికారులతో కలిసి జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని లక్ష్మీ దేవిపల్లి గ్రామం వద్ద నిర్మించనున్న లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ ప్రాంతాన్ని పరిశీలించి, మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని ఎన్నో ఏళ్లుగా అన్నదాతలు ఎదురు చూస్తున్నారని, వారి చిరకాల కోరికను తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్‌తో షాద్‌నగర్, చేవెళ్ల, పరిగి, వికారాబాద్ నియోజకవర్గాలతోపాటు నల్లగొండ జిల్లాకు సైతం సాగునీరు, తాగునీరు అందుతుందన్నారు. గత పాలకులు లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ పేరు చెప్పి ఓట్లు వేయించుకున్నారే తప్పా తట్టెడు మట్టి వేయలేదని ఎమ్మెల్యే మండిపడ్డారు. ఓట్ల రాజకీయం చేశారే తప్పా ప్రజా శ్రేయస్సును పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని, ఇందుకు ప్రజలందరు సహకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాజు, నేతలు చంద్రపాల్‌రెడ్డి, దామోదర్ రెడ్డి, కేకే కృష్ణ, వీర్లపల్లి అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా గణేష్ నవరాత్రులు జరుపుకోవాలి



ఎమ్మెల్యే సబితారెడ్డి



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** ప్రశాంత వాతావరణంలో, శాంతియుతంగా గణేష్ నవరాత్రులు జరుపుకోవాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి సూచించారు. బాలాపూర్‌లో ప్రతిష్టించిన గణనాధుడితో పాటు బడంగ్‌పేట పలు ప్రాంతాల్లోని మండపాల్లోని గణనాధులకు ఎమ్మెల్యే సబితారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని భగవంతుడిని కోరినట్లు తెలిపారు. విజయ గణపతి ఆశిస్సులతో ప్రజలందరి విఘ్నాలు తొలిగి విజయం చేకూరాలని ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనాలను చేపట్టేందుకు కృషి చేయాలని మంటప నిర్వాహకులకు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కోరారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు పటోళ్ల కౌశిక్‌రెడ్డి, బిఆర్‌ఎస్ మీర్‌పేట కార్పొరేషన్ అధ్యక్షులు అర్కల కామేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**హయత్ నగర్ :** చైతన్యపురి డివిజన్ పరిధిలోని ఫణిగిరి కాలనీ, శ్రీవెంకట సాయి నగర్ లో నెలకొల్పిన వినాయక మండపంలో జరిగిన పూజ కార్యక్రమంలోఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో వినాయక చవితి నిమజ్జన కార్యక్రమం జరుపుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ బిఆర్‌ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు తోట మహేష్ యాదవ్, సాయిబాబా, శ్రీనివాసనాయుడు, నరసింహ, ప్రసాద్, హరిశంకర్, ప్రభాకర్, సాయి పాల్గొన్నారు.

## 31 నుంచి బంజారాల రిజర్వేషన్ స్వర్ణోత్సవ రథయాత్ర

### మాజీ ఎంపి రవీంద్రనాయక్, డా.జగన్ నాయక్ వెల్లడి

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** బంజారాలు ఎస్‌టిలుగా గుర్తించబడి 50 ఏళ్లు పూర్తయినందున ఈనెల 31నుంచి సెప్టెంబర్ 6 వరకు రాష్ట్రవ్యాప్తంగా బంజారాల రిజర్వేషన్ స్వర్ణోత్సవ ప్రచార రథయాత్ర నిర్వహించనున్నట్టు మాజీ ఎంపి ధరావత్ రవీంద్రనాయక్, బంజారా భారత్ కన్వీనర్ డా.జగన్ నాయక్ తెలిపారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బంజారా భారత్ ప్రతినిధులతో కలిసి వారు రథయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్య వచ్చాక 1956 నుంచి 1976 వరకు 20ఏండ్లు రిజర్వేషన్లు కోల్పోయి బంజారా లంబాడీలు తీవ్ర అన్యాయానికి గురయ్యారన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి 6శాతం ఉన్న గిరిజనుల రిజర్వేషన్లను 10శాతం పెంచారన్నారు. ఇందుకు సిఎంకు, తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీకి కృతజ్ఞత సభను సెప్టెంబర్ 13, 14 తేదీల్లో హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులో నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశంలో బస్‌పి.నాయక్, డాక్టర్ రాజేశ్ నాయక్, బోసనాయక్, రాఘవానాయక్, సూర్యనాయక్ పాల్గొన్నారు.



# క్రీడ

## 'బలిగుడు'కు వేళాయే...

### నేటి నుంచి ప్రో కబడ్డీ లీగ్
### రెండు నెలల పాటు అలరించనున్న కబడ్డీ



**ప్రజాపక్షం/ఖమ్మం :** బలిగుడుకు వేళయింది. తెలంగాణలో బలిగుడుగా పేరొందిన కబడ్డీ భారతదేశపు అతిపురాతన, ప్రాచుర్యం పొందిన గ్రామీణ క్రీడ. ఒకప్పుడు గ్రామీణ, పట్టణ ప్రాంతాలు అనే తేడాలు లేకుండా జీవితంలో ఒక్కసారైనా కబడ్డీ ఆడని వారు లేరంటే అతిశయోక్తి కాదు. జనవరి మాసం మొదలు మే మాసం వరకు వివిధ సందర్భాలను పురస్కరించుకుని కబడ్డీ పోటీలను భారీగా నిర్వహించేవారు. మేధతో పాటు శారీరక బలం అవసరమైన కబడ్డీని బాడిటచ్ గేమ్ అంటారు. ఆట ఎంత మజా ఇస్తుందో ఆటగాళ్లకు అదే రీతిలో గాయాలు అవుతుంటాయి. కబడ్డీలో భారతదేశం ఎదురులేని ఛాంపియన్‌గా తన ఆధిపత్యాన్ని చాటుకుంటుంది. క్రికెట్ దేశంలో అతివేగంగా అభివృద్ధి చెందిన తర్వాత సందుల్లో, గొందుల్లో సైతం బ్యాట్లు తిరగాడుతున్న వేళ క్రికెట్ పురాతన క్రీడైన కబడ్డీని మింగేసింది. చాలా కాలం తర్వాత ప్రో కబడ్డీ పేరుతో గ్రామీణ క్రీడ మళ్లీ ఊపిరిపోసుకుంది. 2014లో ప్రారంభమైన ప్రో కబడ్డీ లీగ్ ప్రతియేటా వీక్షకులను పెంచుకుంటూ దేశ యువతపైన, క్రీడారంగంపైన తనదైన ముద్ర వేసింది. క్రికెట్‌కు సంబంధించి ఇండియన్ ప్రిమియం లీగ్ (ఐపిఎల్)తర్వాత ఆ స్థాయిలో వీక్షకులను కలిగిన ఏకైక క్రీడ ప్రో కబడ్డీ. ప్రో కబడ్డీ సీజన్ 12 ఈనెల 29న ప్రారంభం కానుంది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ పట్నంలో శుక్రవారం రాత్రి ఎనిమిది గంటలకు ప్రో కబడ్డీ లీగ్ ప్రారంభమవుతుంది. ఈ దఫా కేవలం నాలుగు వేదికలలో మాత్రమే పోటీలు జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్, రాజస్థాన్‌లోని జైపూర్, తమిళనాడులోని చెన్నై, ఢిల్లీలో జరగనున్నాయి. ఈ ఏడాది 12 జట్లు పాల్గొంటున్నాయి. బెంగాల్ వారియర్స్, బెంగుళూరు బూల్స్, దబాంగ్ ఢిల్లీ కెసి, గుజరాత్ జెయింట్స్, హర్యానా స్టిలర్స్, జైపూర్ పింక్ పాంథర్స్, పాట్నా పైరట్స్, పుణేరి పల్టాన్, తమిళ్ తలైవాస్, తెలుగు టైటాన్స్, యూ ముంబా, యూపి యోధా జట్లు పాల్గొంటున్నాయి. ఫ్రాంఛైజీల ద్వారా జట్లు పాల్గొంటుండడంతో కబడ్డీ ఆటగాళ్లకు ఆర్థికంగా మంచి రాబడితో పాటు తమ ఆటతో దేశ వ్యాప్తంగా అభిమానులను తెచ్చిపెడుతుంది. జట్ల ఆధిపతులు వేలంలో ఆటగాడి స్థాయి, నైపుణ్యాన్ని బట్టి పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. కోటి రూపాయలకు పైగా ధర పలికిన ఆటగాళ్లు ఉన్నారంటే ఫ్రాంఛైజీలు ఏ విధంగా పోటీపడుతున్నాయో ఆదరణ ఏవిధంగా ఉందో అర్థంచేసుకోవచ్చు. రాహుల్ చౌదరి, ప్రదీప్ నర్వాల్, నవీన్‌కుమార్, పవన్ షరావత్ ఇటీవలే ప్రో కబడ్డీలో ప్రవేశించిన దబాంగ్ దళాల్, విదేశీ ఆటగాళ్లు రేజా, సాధులుయ్, ఫజల్ అట్రాచెలి దేశ వ్యాప్తంగా కబడ్డీ ద్వారానే ప్రసిద్ధి చెందారు. ఈ ఏడాది ఆట నియమనిబంధనలలో కొన్ని మార్పులు చేశారు. గతంలో ఏ జట్టయినా ఏడు లేదా అంతకంటే తక్కువ పాయింట్ల తేడాతో ఓడిపోతే ఓడిన జట్టుకు ఒక పాయింట్ కేటాయించే వారు. కానీ ఇప్పుడు ఆ పద్ధతిని తీసివేసి గెలిచిన జట్టుకు మాత్రమే పాయింట్లు కేటాయించనున్నారు. గతంలో మ్యాచ్ టై అయితే ఇరు జట్లకు సమానంగా పాయింట్లు కేటాయించేవారు ఇప్పుడు మ్యాచ్ టై అయితే ఇరు జట్లకు చేరి ఐదు కూతలు (రైడ్స్) ఇస్తారు. అప్పటికీ ఫలితం తేలకపోతే గోల్డెన్ రైడ్ పద్ధతిని అమలు చేస్తారు. మొత్తంగా దేశవ్యాప్తంగా సుమారు రెండు మాసాలపాటు అలరించనున్న ప్రో కబడ్డీ స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం జరగనుంది.

ఫోకస్

స్పోర్ట్స్

## ఆసియా కప్ పోరుకు భారత హాకీ సిద్ధం




రాజ్‌గిర్ (బిహార్): మూడుసార్లు చాంపియన్‌గా నిలిచిన భారత హాకీ జట్టు, ఇటీవల జరిగిన నిరాశాజనక ప్రదర్శనను వెనక్కి నెట్టి, పురుషుల ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌పై దృష్టి కేంద్రీకరించింది. దీనిని గెలవడం ద్వారా వచ్చే ఏడాది జరిగే ప్రపంచ కప్‌కి అర్హత సాధించడమే లక్ష్యంగా ఎంచుకుంది. టోర్నమెంట్ తొలి రోజైన శుక్రవారం (ఈనెల 29) భారత్ తన కంటే ర్యాంకింగ్స్‌లో దిగువన ఉన్న చైనాతో తలపడుతుంది. భారత్, చైనా జట్లు పూల్ 'ఎ'లో జపాన్, ఖజకస్తాన్‌తో కలిసి ఉండగా, డిఫెండింగ్ చాంపియన్ దక్షిణ కొరియా (ఐదు సార్లు విజేత), మలేషియా, బంగ్లాదేశ్, చైనీస్ తైపీ పూల్ 'బి' నుంచి పోటీపడుతున్నాయి. ముప్పై ఏళ్ల తర్వాత తొలిసారి ఆసియా కప్‌లో ఆడుతున్న ఖజఖస్తాన్‌తోపాటు, బంగ్లాదేశ్‌కు కూడా ఈసారి టోర్నమెంట్‌లో ఆడే అవకాశం లభించింది. పాకిస్తాన్, ఒమాన్ స్థానాల్లో ఈ రెండు జట్లు టోర్నీలో చోటు సంపాదించాయి. ఈ ఏడాది ఏప్రిల్ మాసంలో పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో, భద్రతా కారణాలను ఉటంకిస్తూ పాకిస్తాన్ టోర్నమెంట్ నుంచి వైదొలగింది. బిహార్‌లోని రాజ్‌గిర్‌లో టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్న కారణంగా, భారత్‌లో పర్యటించడానికి పాకిస్తాన్ హాకీ సమాఖ్య సుముఖత వ్యక్తం చేయలేదు. ఇలా వుంటే, 'ఎ', 'బి' పూల్స్ నుంచి రెండేసి చొప్పున మొత్తం నాలుగు జట్లు సెమీ ఫైనల్‌కు అర్హత సంపాదిస్తాయి. సెప్టెంబర్ 7న ఫైనల్ జరుగుతుంది. ఇలా వుంటే, వచ్చే ఏడాది ఆగస్టు 14–30 మధ్యకాలంలో, బెల్జియం, నెదర్లాండ్స్ సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న పురుషుల ప్రపంచ కప్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే అర్హత సంపాదించడానికి భారత్‌కు ఇదే చివరి అవకాశం. అందుకే, ఈ టోర్నమెంట్‌ను గెల్చుకోవడమే ధ్యేయంగా భారత జట్టు అడుగుపెడుతున్నది. స్వదేశంలో టోర్నీ జరగడం భారత్‌కు కొంత వరకూ లాభిస్తుందని అంటున్నారు. ప్రపంచ హాకీ సమాఖ్య (హెఫ్ఐహెచ్) ప్రో లీగ్ యూరోపియన్ లెగ్‌లో భారత్ మొత్తం ఎనిమిది మ్యాచ్‌లలో ఏడింటిలో ఓడిపోయి, ఒక్క గెలుపుతో ఆశలను బతికించుకుంది. భారత జట్టు చరిత్రలోనే అతిపెద్ద పరాజయాల పరంపర. వరుస పరాజయాలను నేర్పిన పాఠాలతో, ప్రధాన కోచ్ క్రెగ్ ఫల్టన్ పూర్తి శక్తివంతమైన జట్టుని ఆసియా కప్ కోసం మళ్లీ సిద్ధం చేశారు. మొతతం మీద భారత్ ఈ టోర్నమెంట్‌లో ఉన్నత ర్యాంక్ కలిగిన జట్టు. దీని వలన ఒత్తిడి, అవకాశాలు రెండూ ఉన్నాయి. విమర్శకులను సమాధానం చెప్పడానికి భారత్ జట్టు ప్రభావవంతంగా రాణించాల్సిన అవసరం ఉంది. ప్రో లీగ్‌లో డిఫెన్స్ విభాగం చేసిన తప్పిదాల వల్ల భారత్ ఎనిమిది మ్యాచ్‌లలో 26 గోల్స్ వదిలేసింది. కాబట్టి ఈ టోర్నమెంట్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలో, ఈ లోపాన్ని సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలి. అలాగే పెనాల్టీ కార్నర్ మార్పిడి సమస్య కూడా ప్రధాన సమస్యగానే ఉంది. పెనాల్టీలపై జట్టు మొత్తం దాదాపుగా హర్మన్‌ప్రీత్ ఒక్కడిపైనే ఆధారపడుతున్నది. అతనిని తప్పిస్తే అమిత్ రోహిదాస్, జుగ్రాజ్ సింగ్, సంజయ్‌ల నుంచి ఆశించిన ఫలితాలు రావడం లేదు. వారు తమ ఆటను మెరుగుపరచుకుంటేనే భారత్ పరిస్థితి కొంత ఆశాజనకంగా ఉంటుంది.2023 ఆసియా క్రీడలు, 2024 ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ 14 మ్యాచ్‌ల్లో 94 గోల్స్ సాధించింది. దీనిని మెరుగైన ప్రదర్శనగానే పేర్కోవాలి. కానీ, మితిమీరిన ఆత్మవిశ్వాసం, నిర్లక్ష్యం వంటి కారణాలతో జట్టు ప్రదర్శన రోజురోజుకూ దిగజారుతున్నది. ఈ విషయంలో భారత జట్టు మేనేజ్‌మెంట్ సరైన చర్యలు తీసుకోవాలి.

### తొలి మ్యాచ్‌లోనే గట్టి పోటీ



భారత్‌కు తొలి మ్యాచ్‌లోనే చైనా నుంచి గట్టిపోటీ తప్పదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. నిజానికి చైనా కంటే భారత్ ర్యాంకింగ్స్ పరంగా మెరుగైన స్థానంలో ఉంది. అయితే, వరుస పరాజయాలు, సమన్వయ లోపం, సమష్టిగాకాకుండా ఎవరికివారే తమతమ వ్యక్తిగత ప్రయోజనాలే లక్ష్యంగా ఎంచుకోవడం వంటి సమస్యలు భారత జట్టును వేధిస్తున్నాయి. స్వదేశంలో టోర్నమెంట్ జరగడం కొంత వరకూ జట్టుకు లాభించవచ్చు. అయితే, అదే సమయంలో, ప్రపంచ కప్ చాంపియన్‌షిప్‌లో ఆడే అవకాశం దక్కించుకోవాలంటే, ఈ కప్‌ను తప్పక గెలవాల్సి ఉంటుందనే ఒత్తిడి కూడా ఆటగాళ్లపై ఉంటుంది. ఈ సమస్యను అధిగమించి భారత్ ఏ విధంగా ముందంజ వేస్తుందనేది చూడాలి. కాగా, చైనా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 23వ స్థానంలో ఉంది. అయితే, కౌంటర్ అటాక్‌పై ఆధారపడే ఈ జట్టును తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. చెన్ చాంగ్‌కాంగ్ నేతృత్వంలోని చైనా, అసాధారణ విజయాలను, అనూహ్య ఫలితాలను రాబట్టే అవకాశాలు లేకపోలేదు. అంతేకాక, చైనా జట్టు ఆటగాళ్లలో ఎక్కువ మంది ఇన్నర్ మంగోలియా ప్రాంతానికి చెందినవారు. అక్కడి దౌర్ గిరిజనులు వందల ఏళ్లుగా బీకౌ అనే ఫీల్డ్ హాకీ తరహా ఆట ఆడుతున్నారు. వారి ఆట తీరును, కదలికలను అంచనా వేయడం కష్టం. ఈ అంశం కూడా భారత్‌ను ఇబ్బంది పెట్టవచ్చు. మొత్తం మీద తొలి మ్యాచ్‌లోనే భారత్‌కు గట్టిపోటీ తప్పదనే అనుకోవాలి. మొదటి అడ్డంకిని సమర్థవంతంగా అధిగమిస్తే, భారత్ ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. టోర్నీలో మరింత మెరుగైన ప్రదర్శనలకు అవకాశం ఉంటుంది.

### జట్టు నిర్మాణం..

**రక్షణ:** హర్మన్‌ప్రీత్ సింగ్ (కెప్టెన్), సుమిత్, జర్మన్‌ప్రీత్ సింగ్, జుగ్రాజ్, సంజయ్, రోహిదాస్.

**మిడ్‌ఫీల్డ్:** రాజిందర్ సింగ్, రాజ్‌కుమార్ పాల్, మన్‌ప్రీత్ సింగ్, హార్దిక్ సింగ్, వివేక్ సాగర్ ప్రసాద్.

**స్ట్రయికింగ్:** మన్‌దీప్ సింగ్, శిలానంద్ లక్రా, అభిషేక్, సుఖ్జీత్ సింగ్, దిల్‌ప్రీత్ సింగ్.

**గోల్‌కీపింగ్:** కిషన్ బి పాఠక్, సూరజ్ కర్కేరా.

### పోటీపడుతున్న జట్లు

**పూల్ 'ఎ':**
**భారత్, చైనా, జపాన్, ఖజకస్థాన్.**
**పూల్ 'బి':**
**బంగ్లాదేశ్, చైనీస్ తైపీ, మలేసియా, దక్షిణ కొరియా.**

### తొలి విజేత పాకిస్తాన్

మొట్టమొదటి ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌కు ఆతిథ్యమిచ్చిన పాకిస్తాన్, తొలి విజేతగా నిలిచింది. భారత్‌పై విజయం సాధించి టైటిల్ అందుకుంది. మొదటి ఆసియా కప్‌లో పాకిస్తాన్, భారత్‌తోపాటు, చైనా, మలేసియా, సింగపూర్, శ్రీలంక జట్లు కూడా పోటీపడ్డాయి. నాలుగు సంవత్సరాలకోసారి జరిగే ఈ టోర్నమెంట్‌లో పాకిస్తాన్ మొత్తం మూడు పర్యాయాలు విజేతగా నిలిచింది. మొదటిసారి టైటిల్‌ను అందుకున్న జట్టు 1985, 1989 సంవత్సరాల్లోనూ అదే ఒరవడి కొనసాగించింది. ప్రత్యర్థి జట్లను చిత్తుచేస్తూ, తిరుగులేని ఆధిపత్యాన్ని కనబరచింది. కానీ, తర్వాతి కాలంలో క్రమంగా విఫలమవుతున్నది. ఈసారి టోర్నమెంట్‌కు భద్రతా కారణాలతో దూరమైంది.

### దక్షిణ కొరియా టాప్




పురుషుల ఆసియా హాకీ చాంపియన్‌షిప్‌లో దక్షిణ కొరియా అసాధారణ ప్రతిభకనబరుస్తున్నది. ఈ జట్టు మొత్తం 5 పర్యాయాలు (1994, 1999, 2009, 2013, 2022) టైటిల్ సాధించింది. ఒక పర్యాయం (2003) రన్నరప్ ట్రోఫీతో సరిపుచ్చుకుంది. మూడుసార్లు (1985, 1989, 2003) మూడో స్థానంలో నిలిచింది. ఈసారి డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతున్న దక్షిణ కొరియాకు టైటిల్ నిలబెట్టుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని క్రీడా నిపుణులు అంచనా వేస్తున్నారు.

### భారత్ ఖాతాలో మూడు టైటిళ్లు



పురుషుల ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో భారత్ ఇప్పటి వరకూ మూడు సార్లు విజేతగా నిలిచింది. 2003, 2007, 2017లో టైటిల్ అందుకున్న భారత జట్టు ఆరంభంలో వరుసగా నాలుగు పర్యాయాలు (1982, 1985, 1989, 1993) ఫైనల్ చేరినప్పటికీ, టైటిల్ గెల్చుకోలేక, రన్నరప్ ట్రోఫీతో సరిపుచ్చుకుంది. 2013లోనూ భారత్ ద్వితీయ స్థానానికే పరిమితమైంది. కాగా, 1999, 2022 సంవత్సరాల్లో మూడో స్థానంలో నిలిచింది.

**వివిధ జట్ల అరంగేట్రం..**
**ఆసియా పురుషుల హాకీ చాంపియన్‌షిప్‌లో వివిధ జట్లు తొలిసారి ఆడిన సంవత్సరాలు..**
**1982:** పాకిస్తాన్, భారత్, చైనా, మలేసియా, సింగపూర్, శ్రీలంక.
**1985:** ఇరాన్, జపాన్, దక్షిణ కొరియా. **1994:** ఖజకస్థాన్, థాయిలాండ్.
**1999:** హాంకాంగ్. **2013:** చైనీస్ తైపీ, ఒమాన్.
**2022:** ఇండోనేషియా.

# ఆ త్యాగాలు వృథా కాలేదు

### విజయాలు అందించిన మహత్తర విద్యుత్ పోరాటం
### బషీర్‌బాగ్ విద్యుత్ అమరులకు వామపక్షాల ఘననివాళి


ఖమ్మం..


హనుమకొండ..

**ప్రజాపక్షం/ఖమ్మం :** విద్యుత్ పోరాటం ఉద్యమ చరిత్రలో ఓ మహత్తర ఘట్టమని ఆ పోరాటంలో ఆసువులు బాసిన అమరుల త్యాగాలు, అలుపెరగక పోరాడిన కార్యకర్తల పోరాట పటిమ వృథా కాలేదని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. విద్యుత్ పోరాట ఫలితంగానే విద్యుత్ ప్రైవేటీకరణ ఆగిపోయిందని, ఉచిత విద్యుత్ అమలైందని, నేటికీ పాలక వర్గాలు రైతులకు ఉచిత విద్యుత్, పేదల ఇండ్లకు ఉచితంగా విద్యుత్‌ను అందిస్తున్నారంటే అది 2000 సంవత్సరం నాటి పోరాట ఫలితమేనని ఆయన తెలిపారు. చంద్రబాబునాయుడు పాలనలో విద్యుత్ ఛార్జీల వ్యతిరేక పోరాటంలో భాగంగా బషీర్‌బాగ్ వద్ద పోలీస్ కాల్పుల్లో మృతిచెందిన అమరవీరులకు గురువారం సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. రామకృష్ణ స్మారక స్తూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం డివిజన్ కార్యదర్శి వై.విక్రం అధ్యక్షతన జరిగిన సభలో బాగం హేమంతరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ (ఎంఎల్)మాస్‌లైన్ నాయకులు సివై పుల్లయ్య తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె జానిమియా, బిజి క్లెమెంట్, శింగు నర్సింహారావు, పోటు కళావతి, రావి శివరామకృష్ణ, సిహెచ్ సీతామహాలక్ష్మి, మేకల శ్రీనివాసరావు, ఏనుగు గాంధీ, గాదె లక్ష్మి నారాయణ, ఎస్‌కె సైదా, బోడా వీరన్న, సిపిఎం నాయకులు బండి రమేష్, రమేష్, యర్రా శ్రీను, బండి పద్మ, యర్రా గోపి, మాస్‌లైన్ నాయకులు ఆవుల అశోక్, రామయ్య, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ సంస్కరణల పేరిట దోపిడీకి కేంద్రం కుట్ర : తక్కళ్లపల్లి

**హనుమకొండ :** విద్యుత్ సంస్కరణల పేరిట కార్పొరేట్ వర్గాలకు దోచిపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. గురువారం విద్యుత్ పోరాట అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమాన్ని హనుమకొండ అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించారు. విద్యుత్ పోరాట అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం సిపిఐ(ఎం) హనుమకొండ జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2023లో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరిట కొత్త చట్టం తీసుకువచ్చిందని, రైతుల మోటార్లకు మీటర్లు బిగించి రైతులను దోపిడీ చేయాలని చూస్తున్నదన్నారు. విద్యుత్‌ను ప్రైవేటు పరం చేసి రైతాంగంతో పాటు అన్ని వర్గాల ప్రజలపై పెనుభారం మోపేలా చూస్తున్నారన్నారు. 2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ పోరాట అమరుల స్ఫూర్తితో కేంద్రం విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని తక్కళ్లపల్లి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు ఎన్ఎ స్టాలిన్, బత్తిని సదానందం, మునిగాల బిక్షపతి, కొట్టెపాక రవి, మాలోతు శంకర్ నాయక్, కామెర వెంకటరమణ,కండె నర్సయ్య, గుంటి రాజేందర్, యాళ్ల సంజయ్, లకావత్ లక్ష్మి, జిల్లా నాయకులు ఎం.చుక్కయ్య, బొట్ల చక్రపాణి, టి.ఉప్పలయ్య, గొడుగు వెంకట్, వాంకుడోతు వీరన్న, మంద సంపత్, మంద మల్లేషం, కారు ఉపేందర్, సాంబయ్య, డి.తిరుపతి, ఎం.రమాదేవి, ఎంసిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.హంసారెడ్డి, గడ్డం నాగార్జున, న్యూ డెమొక్రసీ జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

**కరీంనగర్‌సిటీ :** బషీర్‌బాగ్ విద్యుత్ పోరాట అమరవీరుల స్ఫూర్తితో మరిన్ని ప్రజా పోరాటాలకు సిద్ధమవుతామని సిపిఐ, సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శులు పంజాల శ్రీనివాస్, మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటం జరిగి 25 సంవత్సరాలు గడుస్తున్న సంధర్భంగా గురువారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సిపిఐ, సిపిఎం పార్టీల ఆధ్వర్యంలో అమరవీరుల స్మారక స్థూపానికి పంజాల శ్రీనివాస్, మిల్కూరి వాసుదేవరెడ్డిలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2020లో విద్యుత్ సంస్కరణల చట్టం తెచ్చి మోటార్లకు మీటర్లు బిగించే ప్రక్రియకు పూనుకుంటుందని, ఆచట్టం రద్దు అయ్యేంత వరకు అదే పోరాట స్ఫూర్తితో ఉధ్యమిస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, సిపిఐ, సిపిఎం జిల్లా నాయకులు గుడికందుల సత్యం, పైడిపల్లి రాజు, గుగులోతు తిరుపతి నాయక్, బూడిద సదాశివ, గజ్జెల శ్రీకాంత్, కూన రవి, కాంపెల్లి అరవింద్, కసిబోజుల సంతోష్‌చారి, అజయ్, సాంబయ్య, పంజాల ప్రజ్వల్ పాల్గొన్నారు.

**భద్రాద్రి కొత్తగూడెం :** బషీర్‌బాగ్ విద్యుత్ పోరాట అమరుల త్యాగాన్ని వృధా కానివ్వబోమని, వారి పోరాటస్ఫూర్తితో ప్రజా వ్యతిరేకవిధానాలపై పోరాడుతామని సిపిఐ జిల్లాకార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా అన్నారు. పేద, మధ్య తరగతి వర్గాలు, రైతులకు భారంగా మారిన విద్యుత్‌ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ వామపక్షాలు చేపట్టిన ఛలో అసెంబ్లీ కార్యక్రమం సందర్భంగా బషీర్‌బాగ్‌లో అప్పటి ప్రభుత్వం జరిపిన కాల్పుల్లో అమరులైన బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డిలను స్మరిస్తూ వారి చిత్రపటాలకు గురువారం సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో నివాళ్లర్పించారు. ఈసందర్భంగా పాషా మాట్లాడుతూ విద్యుత్ పోరాటం చారిత్రాత్మకం అని, కమ్యూనిస్టుల పోరాటాల స్ఫూర్తిని మరింత పెంచాయన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి ఎస్‌కె.షాహీన్, పట్టణ నాయకులు గుత్తుల శ్రీనివాస్, ప్రజానాట్య మండలి నాయకులు జోగా శ్రీనివాస్ పాల్గొన్నారు.

**వరంగల్ :** బషీర్ బాగ్ విద్యుత్ పోరాట అమరవీరుల ఆశయ సాధనకు పోరాటాలు కొనసాగిస్తామని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మేకల రవి, సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా అన్నారు. వరంగల్ పట్టనంలోని శివనగర్ తుమ్మెర భవన్ సిపిఐ జిల్లా కార్యాలయంలో బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరుల చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బషీర్బాగ్ విద్యుత్ పోరాటం జరిగి 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంలో అమరులైన వీర విప్లవ యోధులను స్మరిస్తూ వారికి నివాళి అర్పిస్తున్నామన్నారు. వారి త్యాగాలతో విద్యుత్ సంస్కరణల వ్యతిరేక పోరాటం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, గుండె భద్రి, సంఘీ ఏలేందర్, ఓర్సు రాజు, తాళ్లపల్లి జాన్ పాల్, ఎండి అక్బర్‌పాషా, ల్యాదర్ల శరత్, సుంకరి భవాని, సువర్ణ, నల్లతీగల కుమార్, విజయలక్ష్మి, ఎండి యాకుబ్, మహేష్, జన్ను రాజు, గజవెల్లి చిరంజీవి, రాజేష్, సాంబయ్య, రంజిత్, తస్లిం తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్...


వరంగల్...



భద్రాచలం...

## సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు

### వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్
### ఎఐటియుసిలో సింగరేణి కాంట్రాక్టు కార్మికుల చేరిక



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సింగరేణి కార్మిక గుర్తింపు సంఘం(ఎఐటియుసి) యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో నస్పూర్ కాలనీలోని సివిల్ డిపార్ట్‌మెంట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో సుమారు 30 మంది కాంట్రాక్టు కార్మికులు యూనియన్‌లో చేరారు. కార్యక్రమానికి వాసిరెడ్డి సీతారామయ్య హాజరై మాట్లాడుతూ సింగరేణి సంస్థలో 33 వేల మందికి పైగా కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నా, యాజమాన్యం వారికి కనీస వేతనాలు చెల్లించడంలో విఫలమైందని ఆరోపించారు. ఎఐటియుసి గుర్తింపు సంఘంగా ఉన్న కాలంలోనే కాంట్రాక్టు కార్మికులకు అరకొర వసతులు కూడా కల్పించబడ్డాయని గుర్తుచేశారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసేంత వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు దొడ్డిపట్ల రవీందర్, కాతరాజు ప్రభాకర్, బెల్లంపల్లి రీజియన్ ప్రధాన కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీ సైదా, మోత్కూరి కొమురయ్య, రాచర్ల చంద్రమోహన్ పాల్గొన్నారు.

## విద్యుత్ సంస్కరణల పేరిట కేంద్రం దోపిడీ

### సిపిఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** విద్యుత్ పోరాట అమరుల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం విద్యుత్ పోరాట అమరవీరుల సంస్మరణ దినోత్సవ సందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో రావి నారాయణరెడ్డి భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ పోరాట అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ పోరాటంలో తుపాకి తోటలకు బలయ్యారని గుర్తు చేశారు. 2023లో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరిట కొత్త చట్టం తీసుకువచ్చిందని, రైతుల మోటార్లకు మీటర్లు బిగించి రైతులను దోపిడీ చేయాలని చూస్తున్నదన్నారు. విద్యుత్ ను ప్రైవేటు పరం చేసి రైతాంగంతో పాటు అన్ని వర్గాల ప్రజలపై పెనుభారం మోపేలా చూస్తున్నారన్నారు. విద్యుత్ అమరుల స్ఫూర్తితో కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి జి.సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు మోటపలుకుల రమేష్, కె.సతీష్, కార్యదర్శి ప్రవీణ్ కుమార్, జిల్లా సమితి సభ్యులు మాతంగి రామచందర్, ఆసిఫ్ పాషా నేరెళ్ల జోసెఫ్, శ్రీకాంత్ తాళ్ల పోశం, ఏం.విజేందర్,లావణ్య పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## గ్యారంటీలు పూర్తిస్థాయిలో అమలుచేయాలి



**ప్రజాపక్షం/వంగూర్ :** రాష్ట్రంలో కాంగ్రెస్‌ప్రభుత్వం ఎన్నికలముందు ఇచ్చి న ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలుచేయాలని బిజెపి మండలపార్టీ అధ్యక్షులు గున్న ఆనంద్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో బిజెపి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ మురళిమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను అమలుపరుస్తూ ప్రజలకు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బిజెపిపార్టీ సీనియర్ నాయకులు భీమయ్య, యాదయ్య, సైదులు, శివకుమార్, ఆయాగ్రామాల బిజెపిపార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి వర్షం... పోలీసుల స్పందనతో రోడ్డు క్లియర్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** అర్ధరాత్రి వేళ మహబూబ్‌నగర్‌లో భారీ వర్షం కారణంగా మయూరి పార్కు, దగ్గర రోడ్డు పై చెట్లు విరిగిపడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు జిల్లా ఎస్‌పి డి.జానకికి కాల్ చేయడంతో ఆమే ఆదేశాల మేరకు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం నుండి ఎఆర్ సిబ్బందిని హుటాహుటిన పంపించారు. పిఎస్‌ఐ మహేందర్ రెడ్డి, ఎఆర్‌హెచ్‌సి గోపినాథ్, ఎఆర్‌పిసి లు సంఘటనా స్థలానికి చేరుకుని గొడ్డళ్లతో చెట్లు నరికి రోడ్డును క్లియర్ చేసి ట్రాఫిక్‌ను సజావుగా పునరుద్ధరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి జానకి ఐపిఎస్ సిబ్బందిని అభినందిస్తూ ప్రజల భద్రత కోసం ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటామని తెలిపారు.

## జడ్చర్ల జర్నలిస్టు నూతన కమిటీకి సన్మానం




**ప్రజాపక్షం/ జడ్చర్ల :** జడ్చర్ల జర్నలిస్టు నూతన కమిటీకి వివిధ సంఘాల నాయకులు ఆయా పార్టీలు నేతలు ఘనంగా సన్మానించారు. బుధవారం, గురువారం నాడు పట్టణంలోని వివిధ ప్రాంతాలలో పూలమాలలు శాలువాలు కప్పి నూతన కమిటీని సత్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి అవినీతి అక్రమాలు ఎక్కడ ఉన్న సహించకుండా తమరు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా నూతన కమిటీని ఎన్నుకున్నందుకు తోటి విలేకరులక ఎన్నికల కమిటీకి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సుల్దాన్ ,సభ్యులు శేఖర్, ప్రభాకర్, మల్లేష్ రిపోర్టర్లు తాంబూలం శ్రీనివాస్, ఎమ్‌వి రమణ, పిఎసిఎస్ అధ్యక్షులు సుదర్శన్ గౌడ్, మూడో మాజీ డైరెక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## భగీరథ నీరు అందక ఎండుతున్న గొంతులు

**ప్రజాపక్షం/ మక్తల్ :** మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో గత నెల రోజులుగా ప్రజలు మిషన్ భగీరథ తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎంపిటిసి జి. బలరాం రెడ్డి ఆరోపించారు. దాదాపు 25 వేల జనాభా కలిగిన మక్తల్ మున్సిపాలిటీలో మిషన్ భగీరథ తాగునీరు ప్రతిరోజు సరఫరా చేయవలసి ఉన్నప్పటికీ వారంలో ఒకటి రెండు రోజులు మాత్రమే తాగునీటి సరఫరా చేస్తున్నారన్నారు. దీంతో ప్రజలు తాగేందుకు నీరు లేక కలుషిత నీటిని తాగే పరిస్థితి నెలకొందన్నారు. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్న తాగునీటిని అందించవలసిన బాధ్యత ప్రభుత్వం పై ఉందన్నారు. అయితే స్థానిక మున్సిపల్ కమిషనర్ ఈ విషయమై పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో మిషన్ భగీరథ గ్రిడ్ అధికారులు కూడా నీటిని సక్రమంగా అందించడం లేదన్నారు. ఈ విషయమై ప్రజలు ఎన్ని ఫిర్యాదులు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది అన్నారు. దీంతో గత నెల రోజులుగా ప్రజలు కలుషితనీటిని తాగుతూ అనేక రోగాలకు గురవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, మిషన్ భగీరథ అధికారులు స్పందించి పట్టణ ప్రజలకు తాగునీటిని అందించాలని, లేనిచో బిజెపి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

## వీధి కుక్కల నుంచి కాపాడండి



**ప్రజాపక్షం/జడ్చర్ల:** జడ్చర్ల పట్టణంలో వివిధ వార్డులలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని పట్టణానికి చెందిన వివిధ వార్డు కౌన్సిలర్లు కమిషనర్ లక్ష్మారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. గురువారం నాడు మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లు ఉమా శంకర్ గౌడ్, నందకిశోర్, తదితరులు వల్ల ప్రజలు ఎంతో ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో సంచరిస్తున్న పిల్లలను వాహనదారులను కుక్కలు వెంబడించి కలిసుండడం వల్ల అనేక ప్రమాదాలు జరిగాయని మున్సిపాలిటీ అధికారులు దృష్టి సారించి పట్టణంలోని వీధి కుక్కలను తరలించాలని వారు డిమాండు చేశారు. గతంలో అనేక పర్యాయాలు వీధి కుక్కలు పందుపైఊల నుంచి ప్రమాదాలు జరిగిన పట్టించుకోలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి కుక్కలను తరిమికొట్టాలని లేదంటే ఎవరి ప్రమాదాలు జరిగినా మున్సిపాలిటీ అధికారులు బాధ్యత వహించాలని వారు హెచ్చరించారు.

## నారాయణపేట్‌లో డిజె సీజ్

**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** మతపరమైన ఉత్సవాలలో నారాయణపేట జిల్లా పరిధిలో డిజెలకు అనుమతి లేదని జిల్లా ఎస్‌పి యోగేష్ గౌతమ్ ఉత్వర్వుల మేరకు నారాయణపేట టౌన్‌లో ఓల్డ్ బస్టాండ్ వద్ద బుధవారం డిజెను సీజ్ చేయడం జరిగిందని, డిజె ఓనర్ ఈశ్వర్, డ్రైవర్ నరసింహులు ఎపి 28 వి 4212 డిసిఎం వాహనంలో డిజె పెట్టడం జరిగింది. గతం వారం 15 రోజుల నుండి డిజెలకు అనుమతి లేదని పలు మీటింగ్‌ల్లో ఎస్‌పి తెలిపినా, డిజెలకు అనుమతి లేదని ఆర్డిఓ జారీ చేసిన ఆర్డర్ కాఫీ ఉత్సవ కమిటీలకు ఇచ్చిన కూడా నారాయణపేటలో డిజె పెట్టడం వల్ల పోలీసులు డిజెను సీజ్ చేసి డ్రైవర్, ఓనర్లపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు మిలాద్ ఉన్ నబి పండుగల సందర్భంగా నారాయణపేట జిల్లా పరిధిలో డిజెలకు అనుమతి లేదని ఎవరైనా డిజెలు పెడితే సీజ్ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్‌పి హెచ్చరించారు. జిల్లా పరిధిలో డిజెలను పట్టుకోవడానికి ప్రత్యేక స్పెషల్ టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని, అందువలన ప్రజలు సంప్రదాయ బాండ్, డప్పులు వాయిద్యాలు, చిన్న సౌండ్ బాక్సులను ఉపయోగించాలని ఎస్‌పి తెలిపారు.







# ఇసుక కొరత అధిగమించి ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** ఇసుక కొరతను అధిగమించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. వర్షాలు పడక ముందే ఇండ్ల నిర్మాణాలను ప్రారంభించాల్సి ఉండేదని, కానీ ఇప్పుడు వర్షాలు కురుస్తుండటంతో నిర్మాణాలకు ఆటంకంగా మారుతుదన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ నర్వ మండలంలోని రాంపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు. నిర్మాణం ఇంకా బేస్ మెంట్ దశలోనే ఉండటం చూసి వెంటనే మిగతా నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని లబ్ధిదారురాలికి సూచించారు. ఇసుక లేకపోవడంతో నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదని, గ్రామంలో మిగతా ఇండ్ల నిర్మాణాలకు కూడా ఇదే సమస్య ఉందని లబ్ధిదారులు కలెక్టర్‌కు తెలపగా. ఇసుక సమస్య ఎందుకు ఏర్పడిందని తహసిల్దార్ మల్లారెడ్డిని కలెక్టర్ ప్రశ్నించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా మక్తల్, మాగనూరు ఇసుక రీచ్‌ల నుంచి ఇసుకను తరలించడం వీలు కావడం లేదని, రాంపూర్ గ్రామానికి కాకుండా మండలంలో మిగతా గ్రామాలలో ఇదే పరిస్థితి ఉందని తహసిల్దార్ తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఎక్కడైనా ఇసుక ఉంటే నర్వ మండల కేంద్రంలో ఒకచోట డం ప్ చేసి అవసరాన్ని బట్టి ఆయా గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఇసుకను సరఫరా చేయాలని ఆమె సూచించారు. మండలానికి మొత్తం ఎన్ని ఇండ్లు మంజూరు అయ్యాయని, ప్రస్తుత పరిస్థితి ఏమిటని ఎంపీడీఓ శ్రీనివాస్‌ను ప్రశ్నించగా, మొత్తం 308 ఇండ్లు మంజూరు కా గా, వాటిలో 130 ఇండ్లు గ్రౌండింగ్ అయ్యాయని, నిర్మాణాలలో మండలం మొత్తం 21 శాతం నమోదు ఉందని ఎంపీడీవో తెలిపారు. మండలంలో దాదాపు 70 ఇండ్ల నిర్మాణాలు ప్రారంభమే కాలేదని చెప్పడంతో అలాంటి వా టిని రద్దు చేయాలని కలెక్టర్ సూచించారు. ఫైలెట్ గ్రామమైన బెక్కరపల్లిలో ఇండ్ల నిర్మాణాలు చురుగ్గా కొనసాగుతున్నాయని ఎంపీడీఓ తెలపడంతో మిగతా గ్రామాలలో కూడా లబ్ధిదారులు తొందరగా ఇండ్లు నిర్మించుకునేలా వారిని ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆ వరణలో రూ.11 లక్షల వ్యయంతో కొనసాగుతున్న భవిత కేంద్ర నిర్మాణ పనులను పరిశీలించారు. ఆ పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. యూనిఫామ్ లు అందరికి వచ్చాయా? మధ్యాహ్న భోజనం బాగుంటుందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కాగా పాఠశాల అప్ గ్రేడ్ అయినా కూడా పూర్తి స్థాయిలో ఉపాధ్యాయుల భర్తీ లేదని, 62 మంది విద్యార్థుల సంఖ్యకు కేవలం ముగ్గురే ఉపాధ్యాయులం ఉన్నామని, అందులో ఒక ఉపాధ్యాయ ని మెటర్నటీ సెలవులో ఉందని పాఠశాల ఉపాధ్యాయుడు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, స్పందించిన ఆమె డిఈఓ తో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆ తర్వాత పాఠశాల ఆవరణలోనే ఉన్న అంగన్ వాడీ కేంద్రానికి వెళ్లిన కలెక్టర్ కేంద్రంలో చిన్నారులు, గర్భిణీలు, బాలింతల వివరాలను తెలుసుకున్నారు. వంటగదిని చూశారు. అంగన్ వాడీ కేంద్రంలో చిన్నారులకు కుర్చీలు లేకపోవడం చూసి టీచర్‌ను అడిగారు. భవనం చాలా చి న్నగా ఉందని కుర్చీలు రాలేదని, గ్రామ జనాభా, చిన్నారుల సంఖ్యకు అనుగుణంగా గ్రామానికి అదనంగా మరో అంగన్ వాడీ కేంద్రాన్ని మంజూరు చేయాలని ఆ టీచర్ కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కేంద్రంలో ఉన్న చిన్నారుల అభ్యాసన సామర్థ్యాన్ని కలెక్టర్ పరిశీలించి అభినందించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మల్లారెడ్డి, ఎంపిడివో శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### ఉల్లాస్ – అక్షర వికాసం

ఆడియో, వీడియో పాట ఆవిష్కరణ, గురువారం నారాయణపేట జిల్లాలోని 13 మండలాల ఎంఈఓ లు , కాంప్లెక్స్ హెడ్మాస్టర్లకు నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఉల్లాస్ అక్షర వికాసం ఆడియో , వీడియో పాటను ఆవిష్కరించడం జరిగింది. ఉల్లాస్ అనేది నవభరత్ సాక్షరతా కార్యక్రమం. దీనిని రాష్ట్ర ప్రభుత్వము 2022–23 వ ఆర్థిక సంవత్సరం నుండి ప్రారంభించింది. పాఠశాల విద్యావకాశం కోల్పోయిన 15 సంవత్సరాలు ఆ పై బడిన నిరక్షరాశ్యులకు జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ప్రాథమిక అక్షరాస్యతా ప్రాథమిక విద్యతో పాటు డిజిటల్ అక్షరాస్య కీలకమైన జీవన నైపుణ్యాలు, ఆర్థిక అక్షరాస్యత, వృత్తి నైపుణ్యాలు, నిరంతర విద్యను అందించడమే విల్లాస్ లక్ష్యం. జిల్లా కలెక్టర్ అదేశాను సారం కర్ని జీహెచ్‌ఎం గా పనిచేస్తున్న బాదేపల్లి వెంకటయ్య గౌడ్. ఈ పాటను రచించగా ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న నరసింహ చారి ఈ పాటకు సంగీతాన్ని రూపొందించడం జరిగింది.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వయోజనులకు సంబంధించిన ఉల్లాస్ అక్షర వికాసం పాట అద్భుతంగా కుదిరిందని చక్కని పదాలతో వయోజనులకు అందరికీ చేరువయ్యే విధంగా మంచి సంగీతాన్ని సమకూర్చడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రణయ్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు, విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు, మండల విద్యాధికారులు కాంప్లెక్స్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నరు.

## యూరియా సరఫరా పరిశీలించిన కలెక్టర్

### భూత్పూర్ మండల కేంద్రంలో రైతు ఆగ్రో సేవా కేంద్రంను తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** భూత్పూర్ మండల కేంద్రంలో రైతు ఆగ్రో సేవా కేంద్రం 1ను, శ్రీనివాస్ ట్రేడర్స్ ఫర్టి లైజర్ షాపు ను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి గురువారం తనిఖీ చేశారు. యూరియా స్టాక్ రిజిస్టర్ ను కలెక్టర్ పరిశీలించారు. స్టాక్ 27 మెట్రిక్ టన్నుల చొప్పున వచ్చినట్లు రైతు ఆగ్రో సేవా కేంద్రం 1, శ్రీనివాస ట్రేడర్స్ డీలర్ కలెక్టర్‌కు వివరించారు. రైతు వారి రిజిస్టర్ పరిశీలించి రైతు వారీ వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్ ఈ పాస్ యంత్రం ద్వారా సరఫరా ఓటి.పి జనరేట్ చేస్తున్న విధానం పరిశీలించారు. కొన్ని సాంకేతిక సమస్యలు, సర్వర్ స్లోగా ఉండడం సమస్యలు వివరించారు. సమస్య వస్తే రైతులు వివరాలు రైతు రిజిస్టర్ లో నమోదు చేసుకోని సరఫరా చేయాలని సూచించారు. అక్కడ క్యూ లో నిల్చున్న రైతులతో మాట్లాడారు. ప్రతి రైతుకు యూరియా సరఫరా చేస్తామని, రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని, రెండు బస్తాలు తీసుకువెళ్లాలని స్టాక్ వచ్చిన విధంగా సరఫరా చేస్తామని వివరించారు. రైతులకు టోకెన్ లు జారీ చేసి క్రమ పద్ధతి లో ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. వారికి తాగు నీరు అందించాలని, పోలీస్ అధికారుల సమన్వయంతో సరఫరా చేయాలని సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారి యూరియా సరఫరా నిశితంగా పరిశీలించి పర్యవేక్షణ చేయాలని సూచించారు. కలెక్టర్ తో పాటు ఎం.పి.డి.ఓ ప్రభాకర్, తహశీల్దార్ కిషన్, మండల వ్యవసాయ అధికారి మురళి, తదితరులు ఉన్నారు.

## గురుకుల పాఠశాలను సందర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**ప్రజాపక్షం / కొత్తకోట :** కొత్తకోట మున్సిపాల్టీ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో 15 మంది విద్యార్థినిలకు ఫీవర్ బాధపడుతున్నారని తెలియడంతో గురువారం పాఠశాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించి, గురుకుల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు ఎవరు కూడా ఇబ్బందులు పడొద్దని విద్యార్థులందరూ క్షేమంగానే ఉన్నారని, రాష్ట్ర ఎస్‌ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు మదనపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తకోట సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 15 మంది విద్యార్థినిలు మాత్రమే ఫివర్‌తో బాధపడుతూ పడుతున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారని, ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సూచన మేరకు కొత్తకోట గురుకుల పాఠశాలను సందర్శించమని కాంగ్రెస్ పార్టీ నాయకులు అనునిత్యం ప్రజల్లోనే ఉంటూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ మమ్ములను కూడా ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న మా దృష్టికి తేవాలని చెప్తున్నా ఎమ్మెల్యేపై కొన్ని వదంతలు వచ్చిన సందర్భంగా కొత్తకోట గురుకుల పాఠశాలకు వెళ్లి చూసిన తర్వాత 15 మంది పిల్లలు మాత్రమే జ్వరంతో బాధపడుతున్నట్లు వైద్య సిబ్బంది , ప్రిన్సిపల్ తెలిపారన్నారు. గురుకుల పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రులు ఎవరు కూడా ఇబ్బందులు పడొద్దు గురుకుల పాఠశాల పిల్లలందరూ కూడా క్షేమంగానే ఉన్నారని, వదంతులు నమ్మొద్దని తెలిపారు. విద్యార్థులను సందర్శించిన వారిలో రాష్ట్ర ఎస్‌ఎస్సి ఉపాధ్యక్షులు మదనపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్ , వనపర్తి జిల్లా కార్యదర్శి పి. కృష్ణారెడ్డి, ఎన్‌జె. బోయజ్ , పట్టణ అధ్యక్షులు మేస్త్రీ శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకుల తదితరులు ఉన్నారు.



## దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/బిజినేపల్లి :** శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్అండ్‌సైన్స్ అటానమస్ పాలెం కళాశాలలో కామర్స్ విభాగంలో ఒక అతిథిఅధ్యాపక పోస్టు ఖాళీగా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రాములు గురువారం ఒక ప్రకటనలోతెలిపారు. ఆసక్తికలిగిన అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఈనెల 29న ఉదయం 10గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు నేరుగా హాజరుకావాలని కోరారు. పీజీలో 55శాతం మార్కులు సాధించినవారు, నెట్ లేదా సెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు.

## ముసాయిదా ఓటర్ లిస్ట్ జాబితా విడుదల

**ప్రజాపక్షం/ మద్దూర్ / కొత్తపల్లి :** ఉమ్మడి మద్దూర్ మండలంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో గురువారం రోజు మద్దూర్ కోత్తపల్లి యంపిడివోలు రహమతుద్దిన్, కృష్ణారావు లు ముసాయిదా ఓటర్ లిస్టలు విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎంపిడిఓలు మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్ల జాబితా గ్రామ పంచాయతీల వారిగా అన్ని గ్రామాలలో పబ్లిష్ చేశారు.డ్రాఫ్ట్ ఓటర్ లిస్టులో ఎలాంటి తప్పోపులు ,అబ్జెక్షన్స్ ఉన్నా ఈ నెల 30 తెది ఉదయం 11 గంటల లెల్పలన్నారు. అదే రోజు అన్ని పార్టిలతో పొలిటికల్ మిటింగ్ నిర్వహిస్తామని,అందుకు అందరు సహకరించాలని కొరారు.ఈ కార్యాక్రమంలో ఆయా కార్యాలయాల పంచాయతి కార్యాదర్శులు,సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

## గ్రామ పంచాయతీలో ఓటర్ జాబితా ప్రదర్శన

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** మండల పరిధిలోని గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఓటర్ జాబితాలను ఆయా గ్రామ పంచాయతీల నోటీస్ బోర్డులపై ఉంచినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. ఈ జాబితాలో పేర్లు, వివరాల విషయంలో ఎవరైనా అభ్యంతరాలు లేదా సవరణలు సూచించాలనుకుంటే వాటిని ఈ నెల 30వ తేదీలోపు సంబంధిత అధికారులకు తెలియజేయాలని ఆయన సూచించారు. అంతేకాక, అన్ని అభ్యంతరాలు, సవరణలు పరిష్కరించిన అనంతరం సెప్టెంబర్ 2న తుది ఓటర్ జాబితాను విడుదల చేయనున్నట్లు ఎంపీడీఓ వెల్లడించారు.

## ఓటర్ లిస్ట్ సరి చూసుకోండి : ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/వనపర్తి:** నూతనంగా రూపొందించి గ్రామ పంచాయతీలలో నేడు ప్రదర్శించిన ఓటర్ లిస్టులో ఏవైనా పొరపాట్లు ఉంటే చూసి వెంటనే సరి చేసుకోవాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సూచించారు. పేరులో ఏమైనా పొరపాటున ఇంటి పేరులో ఏమైనా పొరపాటున ఆధార్ కార్డులో ఏదై నా పొరపాటు ఉన్న ఇంటి అడ్రస్‌లో ఏదైనా పొరపాటు ఉన్న స్థానికంగా ఉండే బూత్ లెవెల్ అధికారి సంప్రదించి సరి చేసుకోవాలన్నారు. ఓటు హక్కు కలిగి ఉండి ఓటర్ లిస్టులో పేరు కనబడకపోయినా గ్రామం పేరు తప్పు పడిన , ఒక ఒకే కుటుంబానికి చెందిన కుటుంబ సభ్యుల పేర్లు వేరే వేరే అవార్డులలో నమోదైన సవరించుకోవడానికి గ్రామ పంచాయతీ కార్యదర్శి సంప్రదించాలన్నారు. కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునేవారు మీ సేవలో అప్లై చేసుకొని సంబంధిత మండల తహసీల్దార్ కు ఇవ్వాలన్నారు. మండలాలలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు అందరూ ఈ ఓటర్ లిస్టుపై దృష్టి సారించి తప్పు ఒప్పులను వెంటనే సవరించుకోవాలన్నారు.

## ప్రధాన రహదారిపై అలుగు పారుతున్నా పట్టించుకోరా?

### బిసి పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డా.రాచాల యుగంధర్ గౌడ్



**ప్రజాపక్షం/వనపర్తిటౌన్ :** కలెక్టరేట్‌కు అతి సమీపంలోనే ఉన్న వనపర్తి ... పెబ్బేరు ప్రధాన రహదారిపై అలుగు నీరు పారుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని బిసి పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డా.రాచాల యుగంధర్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం వనపర్తి పట్టణం మర్రికుంట సమీపంలో ప్రధాన రహదారిపై పారుతున్న ఆలుగు నీటిని అక్కడి డ్రైనేజీ వ్యవస, ఇతర కాలువలను స్థానిక ప్రజలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా కల్వర్టులు, బ్రిడ్జిలు, కింద నుంచి కాలువలో, డ్రైనేజీలు, తూములో, వాగులో వెళ్తుంటే కడతారని, కానీ పక్కనే కుంట ఉన్నా దాని నుంచి ఇటు వచ్చే కాలువను ఏనాడో పూడ్చేసినా కాలువ లేకున్నా తూము లేకున్నా ... వేసవిలో ఏ అత్యవసర పనులు లేనట్లుగా కల్వర్టు నిర్మించి లక్షలాది ప్రజాధానం వృధా చేశారని అధికారుల తీరుపై మండిపడ్డారు. కలెక్టర్ ఎస్‌పి, జిల్లా స్థాయి అధికారులు నిత్యం ఇదే రహదారిపై ప్రయాణిస్తున్నా విచారణ చేసే ప్రయత్నం కూడా చేయలేదన్నారు. మర్రికుంట చెరువు అలుగు పారితే వచ్చే నీరు వనపర్తి, కర్నూల్ ప్రధాన రహదారి బీటీ రోడ్డుపై నుంచే అమ్మ చెరువులోకి వెళ్తుందని, నిజానికి కల్వర్టు నిర్మాణం ఈ ప్రాంతంలో చేసి ఉంటే బాగుండేది కాని కొందరు అవగాహన లేని అధికారులు ఏళ్ల క్రితమే మూసుకుపోయిన తూము కాల్వ పేరుతో రెండు ఇళ్ల మధ్యన ప్రధాన రహదారిపై కల్వర్టు నిర్మాణం చేపట్టారని, దీంతో ఎవరికి ప్రయోజనం కలుగుతుందనేది జిల్లా కలెక్టర్ విచారణ జరిపితే నిజా నిజాలు బయటకు వస్తాయన్నారు. స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకొని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి పొలిటికల్ జెఎసి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్ , జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్ , శ్రీరంగాపూర్ మండల అధఅయక్షుడు ధర్మేంద్రసాగర్ , ప్రధాన కార్యదర్శి అస్కని రమేష్ , మదనాపూర్ మండల కన్వీనర్ నర్సింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 30న జర్నలిస్టుల మెగా హెల్త్ క్యాంపు

### టియుడబ్ల్యుజె (ఐజెయు) నారాయణపేట జిల్లా అధ్యక్షుడు కోయిలకొండ నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** టియుడబ్ల్యుజె (ఐజెయు) ఆధ్వర్యంలో జిల్లాలోని జర్నలిస్టులు, జర్నలిస్టుల కుటుంబాలకు నిర్వహిస్తున్న ఉచిత ఆరోగ్య శిబిరాన్ని విజయవంతం చేయాలని టియుడబ్ల్యుజె (ఐజెయు) నారాయణపేట జిల్లా అధ్యక్షులు కోయిలకొండ నారాయణ రెడ్డి, హెల్త్ కన్వీనర్ సంజీవ్ ప్రకాష్ ప్రకటనలో తెలిపారు. నారాయణపేట జిల్లా చరిత్రలో మొట్టమొదటి సారిగా జర్నలిస్టుల సంక్షేమం కోసం ఈ నెల 30 శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నారాయణపేట పట్టణంలోని ఎస్‌ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట సహకారంతో హైదరాబాద్ యశోద ఆస్పత్రి( మలక్ పేట్ ) వైద్య బృందం హాజరై కార్డియాలజీ, ఆర్థోపెడిక్, గైనకాలజి, జనరల్ మెడిసిన్,న్యూరాలజీ విభాగాలతో పాటు బీపీ, షుగర్ ఇసిజి, 2డి ఎకో తదితర వైద్య సవేలు అందించడం జరుగుతుందన్నారు. ఈ శిబిరానికి మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి, జిల్లా కలెక్టర్, ఎస్పీలు హాజరవుతున్నట్లు తెలిపారు. అలాగే జర్నలిస్టుల హెల్త్ కార్డు దరకాస్తు కోసం యూజర్ నేమ్, పాస్వర్డ్ తో అటు హెల్త్ కార్డు సేవలు అందించే ఆసుపత్రుల వివరాలు తెలపడం జరుగుతుందని జిల్లాలోని జర్నలిస్టులు అందరూ ఇట్టి గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## విద్యుత్ పోరాట అమరులకు జోహర్లు




**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట 2000 సంవత్సరంలో ఆగస్టు 28న హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ దగ్గర విద్యుత్ ప్రైవేట్ కరుణ ఆపాలి. విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ చేసిన పోరాటంలో పోలీసుల కాల్పులులో అమరులైన విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి, రామకృష్ణకు గురువారం చౌరస్తాలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి జోహర్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎం) కొత్తకోట మండల కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఉచితంగా ఇస్తున్న విద్యుత్ బషీర్‌బాగ్ విద్యుత్ అమరుల ప్రాణ త్యాగం ఫలితమే అని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అవలంబించిన ప్రజాగ్రహ వ్యతిరేక విధానమైన విద్యుత్ రంగాన్ని ప్రపంచ బ్యాంకు కోరల్లో చిక్కుకోకుండా విద్యుత్ ప్రైవేటీకరణ ఆపాలని పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని దాదాపుగా వంద రోజులు పాటు 9 కమ్యూనిస్టు పార్టీలు, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమం అని చెప్పారు.విద్యుత్ పోరాటం చరిత్ర లో నిలిచిన ఉద్యమం చెప్పారు. ఈ కార్యక్రమంలో యాద య్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## బ్రిడ్జి నిర్మాణంతో నెరవేరిన కల



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** మండలపరిధిలోని పాలెం పెంటోని చెరువుకట్టకు ఆనుకొని బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయడంతో గుడ్లనర్వ, కారుకొండ, వసంతాపూర్ ప్రజలు గురువారం ఆనందంలో ఉన్నారు. ఈసందర్భంగా మాజీ ఎంపిపి పుప్పాల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ పాలెం పెంటోని చెరువు అలుగు పారుతుంది అంటే వివిధ గ్రామాలతో పాటు రైతులు, వ్యాపారస్తులకు, ద్విచక్రవాహనాలకు అసౌకర్యంగా ఉండేదన్నారు. దీనిని ప్రతిపాదనలతో మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి దృష్టికి తీసుకుపోవడంతో మాజీ ముఖ్యమంత్రి దృష్టికితీసుకువెళ్లి సాంక్షన్ చేయించడం జరిగిందని తెలిపారు. రూ. ఒకకోటి30లక్షల రూపాయలతో బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేశారని తెలిపారు. కావున మాజీ ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గడ్ల నర్వ గ్రామ మాజీసర్పంచ్ మహేష్, సుదర్శన్‌రెడ్డి, కాశిరెడ్డి, చంద్రారెడ్డి, శేఖర్‌రావు, పులేందర్‌రెడ్డి, సైదులు, సొప్పరిబాలస్వామి పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## గ్రంథాలయ పన్ను బకాయిల వేగవంతం



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : గ్రంథాలయ పన్ను బకాయిలను వేగవంతంగా వసూలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు అధికారులను ఆదేశించారు. గురువారం సూర్యాపేట పట్టణంలోని జిల్లా గ్రంథాలయ కేంద్రంలో మున్సిపల్ కమీషనర్లు, పంచాయితీ అధికారులతో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావుతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామ పంచాయితీలు, మున్సిపాలిటిలలో గ్రంథాలయ పాత పన్నుబకాయిలు, నూతన పన్నులు వసూలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో గ్రంథాలయ కార్యదర్శి బాలమ్మ, డిపిఒ యాదగిరి, ఆడిటర్ శ్యాంసుందర్ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్లు హన్మంతరెడ్డి, రమాదేవి, శ్రీనివాసరెడ్డి, అశోక్‌రెడ్డి, మున్వర్‌అలీ, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## పాలేరు వాగులో యువకుడి గల్లంతు

వాగు దాటేందుకు పందెం వేసుకున్న ఇద్దరు యువకులు



**ప్రజాపక్షం/కోదాడ (అనంతగిరి)** : మండలంలోని గొండ్రియాల గ్రామ శివారులో ఉన్న పాలేరు వాగులో ఓ యువకుడు గురువారం గల్లంతు అయ్యాడు. ముగ్గురు యువకులు వాగు దాటేందుకు పందెం వేసుకోగా వాగు ను దాటేందుకు వెళ్ళిన ఒకరు వరద పోటెత్తడంతో కొట్టుకుపోయాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పాలేరు వాగు బ్రిడ్జిపైకి గ్రామానికి చెందిన ఉపేందర్ (30)తోపాటు మరో ఇద్దరు స్నేహితులు కలిసి వెళ్ళారు. వాగులో వరద వస్తుండడంతో వాగులోకి దిగి తిరిగి బ్రిడ్జిపైకి ఎక్కాలని వారు పందెం పెట్టుకున్నారు. దీనికి ఉపేందర్ పందెంకు నేను రెడీ అంటూ వాగులోకి దూకాడు. తిరిగి బ్రిడ్జిపైకి రాలేదు. దీంతో బ్రిడ్జిపై ఉన్న ఇద్దరు స్నేహితులు కేకలు వేస్తూ భయభ్రాంతులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గల్లంతైన యువకుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## రైతులకు యూరియా సరఫరాలో కేంద్రం నిర్లక్ష్యం...

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తూం బుచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/డిండి**: కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు యూరియా సరిపడా అందించకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతూ అరకొర యూరియాతో సతమతమవుతున్నారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తూం బుచ్చిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సహకార కేంద్రాల వద్ద యూరియాకు వచ్చిన రైతులతో మాట్లాడుతూ తెలంగాణకు యూరియా సరఫరాలో కేంద్రం నిర్లక్ష్యం వీడి, సరిపడా యూరియాను అందించాలని డిమాండ్ చేశారు. నాట్లు వేసి నెల రోజులు అవుతున్నా రైతులకు సరిపడా యూరియా అందుబాటులో లేకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సహకార సొసైటీలకు సరిపడా యూరియా అందకపోవడంతో రైతులు ఎరువుల వ్యాపారస్తులు అధిక ధరలకు యూరియా అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతోరైతులు అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. డిండి ఆయకట్టు విస్తీర్ణం పూర్తిగా వ్యవసాయ స్థిరీకరణ జరుగుతున్న నేపథ్యంలో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై నాట్లు వేస్తున్నారని, యూరియా సరఫరాలో నల్లగొండ జిల్లాలో డిండి ప్రాజెక్టు ఆయకట్టుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని బుచ్చిరెడ్డి అధికారులను కోరారు.

## విద్యుత్ అమరవీరుల పోరాట స్ఫూర్తితోనే ఉచిత విద్యుత్

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి



**ప్రజాపక్షం/నల్లగొండ** : నాటి విద్యుత్ ఉద్యమ పోరాట స్ఫూర్తితోనే రాష్ట్రంలో ఉచిత విద్యుత్ అమలవుతుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి అన్నారు. గురువారం స్థానిక సిపిఐ కార్యాలయం మగ్దూమ్ భవన్ లో బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటంలో అమరులైన రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీరస్వామి మాట్లాడుతూ గత 25 సంవత్సరాల క్రితం చంద్రబాబు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడం జరిగిందని, అన్ని రాజకీయ పార్టీలు చలో హైదరాబాద్ పిలుపునిస్తే ర్యాలీకి అప్పటి రాష్ట్ర కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి నాయకత్వం వహించారని గుర్తు చేశారు. చలో హైదరాబాద్ ర్యాలీపై నరహంతకుడు చంద్రబాబు ఆదేశాలతో పోలీసులు జరిపిన లాఠీచార్జి, తుపాకుల కాల్పులతో ముగ్గురు అమరులు అయి ఎంతోమంది క్షతగాత్రులు కావడం జరిగిందని పేర్కొన్నారు. నాటి అమరుల స్ఫూర్తితో నేడు విద్యుత్ సంస్కరణలను వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని చూస్తున్న విధానాలపై సంఘటితంగా ప్రజా ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి శ్రవ సైదిరెడ్డి, సహాయ కార్యదర్శి, వి లెనిన్, నందం, ముంఢ్ల ముత్యాలు, కోమటిరెడ్డి ప్రద్యుమ్న రెడ్డి,ఎండీ మదర్,యూసుఫ్, వీరయ్య,సుజాత, విజయ,ధనలక్ష్మి, సర్దార్,చంద్ నాగమ్మ,రేణుక, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## 640 ఇండ్లు మంజూరు



**ప్రజాపక్షం/ఉండవెల్లి** : మండలంలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని అలంపూరు మండల అభివృద్ధి అధికారి పద్మ తెలిపారు. గురువారం అలంపూరు మండలంలోని ఊట్కూరు, భీమవరం క్యాతూరు గ్రామాల్లోని ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఇల్లు కట్టిన వారికి బిల్లులు చెల్లిస్తామని లబ్ధిదారులకు వారు హామీ ఇచ్చారు. బేస్మెంట్ లెవల్ కట్టిన వాళ్లకు లబ్ధిదారుని ఖాతాల్లో లక్ష రూపాయలు జమవుతాయని వారు పేర్కొన్నారు. ఇండ్ల నిర్మాణాలు ప్రారంభించని వారిని త్వరగా ప్రారంభించేదుకు పంచాయితీ కార్యదర్శి ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని కోరారు. మండలంలోని 13 గ్రామపంచాయితీలకు సుమారు 640 ఇండ్లు మంజూరైనట్లు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ప్రారంభం లేకపోవడం కొంతమంది లబ్ధిదారులు కట్టలేమని వాపోతున్నట్లు పేర్కొన్నారు. వీలైనంత త్వరగా ఇండ్ల నిర్మాణాలు చేపట్టాలని లబ్ధిదారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ఆయా గ్రామాల్లోని పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**ప్రజాపక్షం/ఎర్రవల్లి**: జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం జింకలపల్లి స్టేజీ సమీపంలో బెంగుళూరు నుండి హైదరాబాద్ వెళ్తున్న జగన్ ట్రావెల్ బస్సును ముందు వెళ్తున్న కంటైనర్ సడెన్ బ్రేక్ వేయడంతో వెనుక నుండి ఢీకొంది. బస్సులో క్యాబిన్ సీట్లో ప్రయాణం చేస్తున్న అత్తాపూర్ కు చెందిన ధీరజ్ అనే వ్యక్తి మృతి చెందాడు. మరోకరికి గాయాలయ్యాయి. బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు.

# సాగర్ సందర్శించిన విదేశీ ప్రతినిధులు



**ప్రజాపక్షం/నందికొండ**: అంతర్జాతీయ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్ ను బుధవారం 23 దేశాలకు చెందిన 27 మంది ప్రతినిధులు సందర్శించారు. నేపాల్ శ్రీలంక, రష్యా, వియత్నాం ,జింబాబ్వే, నైజీరియా,ఇతియోపియా, సౌత్ సూడాన్, టాన్జానియా, జమైకా, జోర్డాన్ కు చెందిన 23 దేశాల ప్రతినిధులు హైదరాబాదు లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ లోఈ నెల 15 నుండి వీరు వివిధ రంగాలలో నూతన ఆవిష్కరణలు అభివృద్ధి అనే అంశంపై శిక్షణ పొందుతున్నారు. ఈ నెల 30 న ఈ శిక్షణ ముగియనుంది. ఈ శిక్షణలో భాగంగా బుధవారం టీం కోఆర్డినేటర్ డాక్టర్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో నాగార్జునసాగర్ ను సందర్శించారు. సాగర్ సందర్శనలో భాగంగా నాగార్జునకొండ ను చేరుకొని అక్కడ పురావస్తు మ్యూజియాన్ని, మాన్యుమెంట్స్ ను సందర్శించారు. అనంతరం నాగార్జునసాగర్ ప్రధాన డ్యామ్ ను, నాగార్జునసాగర్ లో తెలంగాణ టూరిజం నిర్మించిన బుద్ధవనాన్ని సందర్శించారు. బుద్ధ వనం వివరాలకు సంబంధించిన వీడియోని వీక్షించిన అనంతరం మహా స్తూపం లోని ధ్యాన మందిరంలో ధ్యానం చేశారు అనంతరం బుద్ధ చరిత వనం, ధ్యానవనం, స్థూప వనాలను సందర్శించారు. వీరికి స్థానిక టూరిజం గైడు సత్యనారాయణ నాగర్జున కొండ చారిత్రక విశేషాలను, నాగార్జునసాగర్ ప్రాజెక్టు వివరాలను, బుద్ధవనం విశేషాలను వివరించారు. వీరితోపాటు డిఆర్‌డిఓ వై.శేఖర్ రెడ్డి, పెద్దవూర తాహసిల్దార్ రఘు,సాగర్ డ్యాం ఈఈ నాగేశ్వర రావు,ఎఇ కృష్ణయ్య బుద్ధవనం అధికారులు శాసన, రవిచంద్ర, రెవెన్యూ ప్రోటోకాల్ ఆఫీసర్ దండా శ్రీనివాస్ రెడ్డి, సాగర్ సిఐ శ్రీను నాయక్, ఎస్ఐ ముత్తయ్య, ఎస్‌పిఎఫ్ ఎస్ఐ రఘు తదితరులు ఉన్నారు.

# జాతీయ కుటుంబ ప్రయోజన పథకం దరఖాస్తుల ప్రక్రియ వేగవంతం



**ప్రజాపక్షం/నల్లగొండ** : జాతీయ కుటుంబ ప్రయోజన పథకం దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. గురువారం ఆమె శాలిగౌరారం ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మిక సందర్శించి జాతీయ కుటుంబ ప్రయోజనం కింద వచ్చిన దరఖాస్తుల వివరాలను ఎంపీడీవో జ్యోతిలక్ష్మి, తహసీల్దారు జమీరుద్దీన్‌లను అడిగి తెలుసుకున్నారు. కాగా ఏప్రిల్ 1,2017 నుండి మండలంలో 176 మరణాలు సంభవించగా, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద 73 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 23 దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించడం జరిగిందని తహసీల్దార్ జిల్లా కలెక్టర్ కు వివరించారు.జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద లబ్ధిదారులకు మేలు చేకూర్చేందుకుగాను దరఖాస్తుల స్వీకరణ,పరిశీలన ప్రక్రియలను వేగవంతం చేసి శనివారంలోగా ఆర్డిఓ ద్వారా ఆన్లైన్ లో పంపించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ శాలిగౌరారం నుండి ఊట్కూరు వెళ్లే రహదారిలో లో లెవెల్ కాజ్ వే పై నీరు ప్రవహిస్తుండగా పరిశీలించారు. ఉట్కూరు నుండి బండమీదిగూడెం వెళ్లే రహదారి వద్ద కూడా రోడ్డుపై నీరు ప్రవహిస్తున్నదని తెలుసుకొని పరిశీలించి పరిస్థితిపై నివేదిక సమర్పించాలని తహసిల్దారు, ఎంపీడీవోలను ఆదేశించారు.

**పాఠశాలల తనిఖీలు పెంచాలి** : మండల విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పాఠశాలల సందర్శనలను పెంచాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో విద్యాశాఖ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు.ఎంఈఓ లు పాఠశాలలను సందర్శించడంతోపాటు,విద్యార్థులలో విద్యా సామర్థ్యాలు పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. పాఠశాలల తనిఖీ తోపాటు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, పాఠశాలలకు మంజూరైన పనుల పురోగతి, తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అన్నారు.ఎంఈఓలు సైతం పాఠశాలలను సందర్శించి వారి సబ్జెక్టు నాలెడ్జిని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

# అధికారులు సమన్వయంతో పని చేయాలి




సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : అన్ని శాఖల సమన్వయంతో జిల్లాలో హరితహారాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ మీటింగ్ హాల్ నందు జిల్లాలోని ఆర్‌డిఓలు, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిఓలు, ఏపిఓలు, ఫారెస్టు అధికారులతో హరితహారంపై వెబ్ఎక్స్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క శాఖ తనకు నిర్దేశించిన హరితహారం లక్ష్యాలను పూర్తి చేయాలని సాంఘీక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ తమకు సంబంధించిన గిరిజన ఆశ్రమ పాఠశాలలో, రెసిడెన్షియల్ స్కూల్లో, కాలేజీలలో, కస్తూర్బా గాంధీ పాఠశాలలో, గురుకుల పాఠశాలల్లో, ఎంపిడిఓలతో సమన్వయం చేసుకుంటూ పూల మొక్కలను, డెకరేషన్ మొక్కలను నాటించాలని, పరిశ్రమల శాఖకు సంబంధించి సిమెంట్ పరిశ్రమలలో డిఎఫ్ఓ కలిసి సిమెంట్ ఫ్యాక్టరీ వారితో సమన్వయం చేసుకుంటూ సిమెంట్ పరిశ్రమలలో పెద్దగా పెరిగే మొక్కలు నాటించాలని సూచించారు. మైనార్టీ శాఖ సంబంధిత ప్రదేశాలలో జాన్‌పహాడ్ దర్గా వంటి దర్శనీయ స్థలాలలో మొక్కలు నాటించడం లేదా ప్లాంటేషన్ చేయించాలని, పోలీసు శాఖ వారు కూడా తమ తమ పోలీసు స్టేషన్‌లలోని ఖాళీ స్థలాలలో మొక్కలు నాటించాలని, సూర్యాపేట మున్సిపాలిటి వారు ఆర్‌డిఓతో సమన్వయం చేసుకుంటూ తమ తమ పరిధిలో గల కొత్త, పాత రోడ్లలో ఎక్కడ అయితే మొక్కలు లేవో అక్కడ గుర్తించి మొక్కలు నాటాలని అలాగే కేసారం, గాంధీనగర్‌లో కూడా మొక్కలు నాటించాలని, మిగతా మున్సిపాలిటి వారు కూడా తమ తమ పరిధిలో గల ఖాళీ ప్రదేశాలలో, రోడ్ల వెంట మొక్కలు నాటించాలన్నారు. దీనికి ప్రతి ఒక్క శాఖ కృషి చేసి హరితహారాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఏ పిడి అప్పారావు, డిపిఓ యాదగిరి, సిపిఓ కిషన్, బిసి అభివృద్ధి అధికారి శ్రీనివాస్, ఎస్‌సి సంక్షేమ శాఖ అధికారి దయానంద రాణి, పరిశ్రమల శాఖ అధికారి సీతారాం నాయక్, జిల్లా హార్టికల్చర్ అధికారి నాగయ్య పాల్గొన్నారు.

## ఆచార్య నాగార్జునుడి బోధనలు ఎప్పటికీ ఆచరణీయమే!



చికాగో బౌద్ధాలయంలో ప్రసంగించిన శివనాగిరెడ్డి

**ప్రజాపక్షం/నందికొండ**: రెండో బుద్ధునిగా కీర్తి గడించి12 శతాబ్దాల్లో కృష్ణా తీరంలోని విజయపురి (ప్రస్తుత నాగార్జునకొండ) లో తన జీవిత చివరి దశలో నివసించిన ఆచార్య నాగార్జునుడు, తన బోధనలను పొందుపరిచి రచించిన సుహృల్లేఖ, రత్నావళి, మూలమాధ్యమికకారిక, శూన్యతాస్తపతి గ్రంథాలు ఇప్పటి తరానికి ఆచరణీయాలని పురావస్తు శాస్త్రవేత్త ప్రముఖ బౌద్ధ పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్, సిఇఒ, డా. ఈమని శివనాగిరెడ్డి అన్నారు. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో ఇల్లినాయిస్ రాష్ట్రం చికాగోలో 1944లో, రెండో ప్రపంచ యుద్ధ శిబిరాల్లో బంధీలైన జపాన్ అమెరికన్ల పునరావాస సందర్భంగా నిర్మించిన మిడ్ వెస్ట్ అమితాభ బౌద్ధాలయాన్ని గురువారం సందర్శించిన శివనాగిరెడ్డి, ఆచార్య నాగార్జునుని మధ్యమమార్గం, శూన్యవాదం, నైతిక వర్తన, సశ్చీలత, వివేకం, శాశ్వతానందాన్నిచ్చే బుద్ధుని చతురార్య సత్యాలు, ఆర్య అష్టాంగిక మార్గాలను ఆచరిస్తే ప్రస్తుత సమాజంలోని రుగ్మతలను నిర్మూలించవచ్చని తన ప్రసంగంలో వివరించారు. బుద్ధుని బోధనలు, నాగార్జునుని తాత్వికతలను ఈ తరానికి అందించి, బౌద్ధ సంస్కృతిని పరిరక్షించటానికి బుద్ధవనాన్ని నిర్మించటమైందని, దేశంలోనే అతిపెద్దదైన బుద్ధవనాన్ని దేశంలో నుంచి కాక దక్షిణాసియా, పశ్చిమ దేశాల బౌద్ధ పర్యాటకులు సందర్శిస్తున్నారని శివనాగిరెడ్డి అన్నారు.అనంతరం చికాగో మిడ్ వెస్ట్ బుద్ధిస్ట్ టెంపుల్ ప్రధానాచార్యులు పూజ్య గ్యాదో కోనో వారి ప్రచురణలను శివనాగిరెడ్డికి బహుకరించారు. ఈ కార్యక్రమంలో చికాగో సాహితీ మిత్రులు సంస్థ కార్యదర్శి జయదేవ్ మెట్టుపల్లి పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో యాదాద్రి జిల్లా ముందంజ

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి** : నిరుపేదలకు సొంత ఇళ్లను అందించే లక్ష్యంతో అమలు చేస్తోన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జిల్లాలో వేగవంతంగా జరిగేలా ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేస్తున్నారని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడత, రెండవ విడత పూర్తి స్థాయిలో గ్రౌండింగ్ పూర్తి అయినందున ఈ నెలలో రాష్ట్ర స్థాయిలో మన జిల్లా మొదటి స్థానం దక్కిన నేపథ్యంలో ప్రభు త్వం నుండి ప్రశాంస పత్రం, ల్యాప్ టాప్‌ను పీడీ హౌసింగ్ విజయసింగ్ ఇవ్వడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పనులను త్వరగా పూర్తి చేసి మన జిల్లాను రాష్ట్ర స్థాయిలో ముందంజలో ఉండటానికి ప్రజాప్రతినిధులు, మండల స్పెషల్ అధికారులు, హౌసింగ్ శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపీడీఓలు, ఇంజనీరింగ్ ఎంపీవో, పంచాయతీ అధికారులు కృషి చేయడం జరిగిందన్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులు నిర్మాణాల్లో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ఎప్పటికప్పుడు సందర్శించి లబ్ధిదారులతో నిరంతర మాట్లాడుతూ ఇసుక, మొరం తదితర సామాగ్రి నిర్ణీత ధరలకు అందేలా అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారన్నారన్నారు. జిల్లాలో మొత్తం 9495 ఇల్లు మంజూరు కాగా 7730 గ్రౌండింగ్ దశలో ఉన్నాయన్నారు. ఇందులో 4951 బెస్మెంట్ లెవల్‌లో, గోడల దశలో 387, స్లాబ్ స్థాయికి 134 దశకి చేరుకున్నాయన్నారు. ఇందుకు గాను రూ.44 కోట్ల 94 లక్షల లబ్ధిదారుల ఖాతాలోకి ప్రభుత్వం జమ చేసిందన్నారు. మిగతా ఇళ్ళు కూడా త్వరగా పూర్తి అ య్యేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని, ఇందుకు లబ్ధిదారులు కూడా సహకరించి జిల్లాకి మంచి పేరు రావడానికి అందరూ కృషి చేయాలన్నారు.

## యూరియా కొరత లేకుండా చర్యలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ**: రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు, జిల్లా సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్యలు అన్నారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం కార్యాలయంలో వినతి పత్రం అందించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల రైతులకు ఇవ్వాల్సిన యూరియా ఇప్పటివరకు సరిపడా ఇవ్వనందున రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతులు వరినాట్లు వేసిన 20 రోజులకే యూరియా చల్లాల్సి ఉంటుందని కాని నాటు వేసి 30 రోజులు కావొస్తున్నా కూడా యూరియా చల్లక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సమితి సభ్యూరాలు ఎర్రబోతు పద్మ, సీపీఐ పార్టీ మండల కార్యదర్శి అంజనపెల్లి రామలింగం, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి.సయీద్, దామరచర్ల మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్‌కుమార్, మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి ఎస్‌కె.షమీం, సభ్యులు గువ్వల మట్టయ్య, మందడి కృష్ణారెడ్డి, రామలింగయ్య, వెంకటనారాయణ, బుచ్చిబాబు, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## లాభార్జనే ధ్యేయంగా ప్రైవేటు ఆసుపత్రుల నిర్వహణ

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి



**ప్రజాపక్షం/చౌటుప్పల్** : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో, వాతావరణంలో ఏర్పడ్డ మార్పులతో సీజనల్ వ్యాధులు, విష జ్వరాలతో వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగుల పట్ల ప్రభుత్వ వైద్యులు వహిస్తున్న తీరు పై అధికారులు చర్యలు చేపట్టాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ సమయపాలన పాటించకుండా లాభార్జనే ధ్యేయంగా ప్రైవేటు ఆసుపత్రులు నిర్వహిస్తున్న ప్రభుత్వ వైద్యులపై వైద్య అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం సిపిఐ నాయకులతో జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సందర్శించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో కలియ తిరుగుతూ రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శేఖర్ రెడ్డి మాట్లాడుతూ రెక్కాడితే డొక్కాడని పేద ప్రజలు వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం దొరకటం లేదని విశ జ్వరాల బారిన పడి అనేక మంది రోగులు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్న వైద్యులు కనీసం వారిని థర్మామీటర్, బీపీ చెకప్ వంటి సాధారణ చెకింగ్‌లు చేయకుండా మహమ్మారి సోకిన రోగులుగా అంటి అంటనట్టు, ముట్టి ముట్టినట్టు దూరంగా నిల్చోబెట్టి మందులు రాసి పంపడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఉడత రామలింగం కొండూరు వెంకటేష్, రొండి నరసింహ, బత్తుల సుధాకర్, టంగుటూరి రాములు తదితరులు పాల్గొన్నారు.

## నల్లగొండలో అర్ధరాత్రి వ్యక్తి దారుణహత్య

అంతర్గత విభేదాలు..కుటుంబ కలహాల కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్న పోలీసులు



**ప్రజా పక్షం/నల్లగొండ టౌన్** : ఓ వ్యక్తి అర్ధరాత్రి దారుణ హత్యకు గురైన సంఘటన గురువారం నల్లగొండలో చోటుచేసుకుంది. పట్టణంలోని దేవరకొండ రోడ్డులో గల కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి మెమోరియల్ కాలేజ్ పక్కన ఉన్న అన్నపూర్ణ క్యాంటీన్ సమీపంలో హత్య జరిగింది. సమాచారం తెలుసుకున్న వన్ టౌన్ సిఐ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా డాగ్ స్క్వార్డు, క్లూస్ టీం ద్వారా వివరాలు సేకరిస్తున్నారు. హత్యకు గురైన వ్యక్తి రమేష్ (32) నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. కొన్ని సంవత్సరాల క్రితం రమేష్ నల్లగొండకు వచ్చి బీటిఎస్ లో అద్దె ఇంట్లో భార్య పిల్లలతో కలిసి నివాసముంటున్నాడు. అయితే ఇటీవల తన సొంత గ్రామమైన వడ్డేపల్లి లో ఇందిరమ్మ ఇల్లు రావడంతో అక్కడ బేస్మెంట్ వరకు నిర్మాణం చేశారని తెలిసింది. అతని భార్య పిల్లలు అక్కడే ఉండగా రమేష్ గత నాలుగు రోజుల క్రితం మళ్లీ నల్లగొండకు వచ్చి తాను డ్రైవర్ గా పనిచేస్తున్నాడని బుధవారం కొంతమంది స్నేహితులతో కలిసి మద్యం సేవించినట్లు విశ్వసినీ సమాచారం. అర్ధరాత్రి సమయంలో కోమటిరెడ్డి ప్రతి మెమోరియల్ కాలేజ్ ఎదురుగా ఉన్న అన్నపూర్ణ క్యాంటిన్లో రక్తపు మడుగులో పడి విగత జీవుడయ్యాడు. ఘటన స్థలం నుంచి డాగ్ స్క్వాడ్ మునుగోడు రోడు లో ఐదు కిలోమీటర్ల వరకు వెళ్లినట్లు తెలిసింది. మూడు నెలల నుంచి భార్యాభర్తల మధ్య అంతర్గత విభేదాలు కొనసాగుతున్నట్లు సమాచారం. మూడు నెలల క్రితం భార్య పుట్టింటికి వెళ్ళినట్లు తెలుస్తోంది. కాగా రమేష్ హత్యకు గల కారణాలను పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

**ప్రజాపక్షం/కోదాడ రూరల్** : సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు ప్రభుత్వం అందజేస్తుందని మండల వ్యవసాయ అధికారి పాలెం రజిని తెలిపారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని గురువారం ఒక ప్రకనటలో కోరారు. 2025/26 సంవత్సరానికి గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రైతులకు వ్యవసాయ పనిముట్లు 40 నుంచి 50 శాతం సబ్సిడీపై అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎస్.సి, ఎస్.టి, మహిళ, చిన్న, సన్న కారు రైతులు ఐదు ఎకరాల లోపు ఉన్నవారికి యాభై శాతం సబ్సిడీ, ఇతర సామాజిక వర్గాల రైతులకు నలభై శాతం సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. సబ్సిడీపై అందజేసే పనిముట్లు చేతితో లేదా బ్యాటరీతో మందు కొట్టే పంపులు 182, పవర్/తైవాన్ స్ప్రెయిర్ 27, రోటోవేటర్స్ 8, స్పీడ్ ఫెర్టిలైజర్ డ్రిల్స్ 2, పవర్ వీడర్ 1, బ్రష్ కట్టర్ 2, పవర్ ట్రిల్లర్ 2, మొక్కజొన్న పొట్టు తీసే యంత్రం 1, గట్టి కట్టే యంత్రాలు 2, (ట్రాక్టర్‌తో దున్నే పనిముట్లు కల్టివేటర్, డిస్కయారో, నాగలి దమ్ము చక్రాలు మొదలైనవి) 12, పొలం గట్టు చెక్కే యంత్రాలు 2 ఉన్నట్లు వివరించారు. పనిముట్లు కావల్సిన రైతులు సెప్టెంబర్ 5లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పట్టాపాసుపుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, ట్రాక్టర్‌కు సంబంధించిన పనిముట్లు అయితే ఆర్‌సి జిరాక్స్, మండల కమిటీ తీర్మానం జత చేసి అందించాలని కోరారు.

## రీల్

## 'అఖండ -2' విడుదల వాయిదా

నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్ లో వస్తున్న అఖండ 2 సినిమా విడుదల తేదీ వాయిదా వేశారు. అఖండ సక్సెస్ తరువాత సీక్వెల్ గా తీస్తున్న అఖండ 2 సినిమాను నిజానికి సెప్టెంబర్ 25న విడుదల కావలసి ఉంది. ఇప్పటికే సెప్టెంబర్ 25న విడుదల చేస్తామని నిర్మాతలు ప్రకటించారు. కానీ ప్రస్తుతం వి ఎఫ్ ఎక్స్ వర్క్ ఆలస్యం అవడం కారణంగా ఈ సినిమా విడుదల తేదీని వాయిదా వేస్తున్నట్లు దర్శక, నిర్మాతలు గోపీచంద్ ఆచంట, రామ్ ఆచంట ప్రకటించారు. ఇటీవల కార్మికుల సమ్మె రావడ, గ్రాఫిక్ వర్క్ ఆలస్యం అవడంతో ముందుగా అనుకున్న సమయానికి విడుదల చేయలేకపోతున్నామని వెల్లడించారు. విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని చెప్పారు. బాలకృష్ణ సరసన సంయుక్త మీనన్ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు.





## 'సువ్వి సువ్వి' పాట ఆవిష్కరణ

పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఓజీ'. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య, కళ్యాణ్ దాసరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. ఓజాస్ గంభీర అనే శక్తివంతమైన పాత్రలో పవన్ కళ్యాణ్ కనిపిస్తారు. ఈ చిత్రంలో ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయికగా నటిస్తున్నారు. తాజాగా 'ఓజీ' నుంచి రెండవ గీతం 'సువ్వి సువ్వి' విడుదలైంది. హృదయాలను హత్తుకునేలా 'సువ్వి సువ్వి' గీతం సాగింది. ఈ పాట శ్రోతల మనసులను గెలుచుకుంటోంది. తమన్ ఈ పాటకోసం మంచి మెలోడీ ట్యూన్ అందించారు. 'ఓజీ' చిత్రం నుంచి ఇటీవల విడుదలైన మొదటి గీతం 'ఫైర్ స్టార్మ్'కి విశేష స్పందన లభించింది. వినాయకచవితి సందర్భంగా విడుదల చేసిన 'సువ్వి సువ్వి' ప్రేమ గీతాన్ని గాయని శృతి రంజని ఎంతో మధురంగా ఆలపించారు. ఇక కళ్యాణ్ చక్రవర్తి త్రిపురనేని సాహిత్యం ఈ పాటకు మరింత అందాన్ని తీసుకొని వచ్చింది. 'సువ్వి సువ్వి' పాటలో పవన్ కళ్యాణ్, ప్రియాంక అరుళ్ మోహన్ జంట చూడ ముచ్చటగా ఉంది. ఈ జోడీ తెరపై సరికొత్తగా కనిపిస్తున్నారు. పవన్ కళ్యాణ్ గంభీరంగా, దాసరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు, ప్రియాంక మోహన్ కనిపిస్తున్న తీరు ఆకట్టుకుంటోంది. 'ఓజీ' చిత్రానికి ప్రధాన ఆకర్షణలలో ఒకటిగా పవన్, ప్రియాంక జోడీ నిలుస్తోంది. 'ఓజీ' చిత్రంలో ఇమ్రాన్ హష్మీ, ప్రకాష్ రాజ్, శ్రియా రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు. రవి కె చంద్రన్, మనోజ్ పరమహంస ఛాయాగ్రాహకులుగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. చిత్రానికి సంబంధించిన అన్ని పనులు పూర్తి చేసి సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు

## 'మన శంకరవరప్రసాద్ గారు' నుంచి ట్రెడిషనల్ పోస్టర్ రిలీజ్



మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం. 'మన శంకర వరప్రసాద్ గారు'. అనిల్ రావిపూడి దర్శకత్వం లో, షైన్ స్క్రీన్స్ ఆధ్వర్యంలో సాహు గారపాటి, సుష్మిత కొణిదెల గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు. అర్చన సమర్పిస్తున్నారు. టైటిల్, ఫస్ట్ లుక్ గ్లింప్స్‌తో సినిమా సెన్సేషన్ క్రియేట్ చేసింది. పండగకి వస్తున్నారు అనే ఆకట్టుకునే ట్యాగ్‌లైన్‌తో ఈ చిత్రం వస్తుంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన సంక్రాంతి పోస్టర్‌ను విడుదల చేశారు. చిరంజీవి ఒక గొప్ప సాంప్రదాయ పట్టు చొక్కా, పట్టు పంచె, కండువా ధరించి, స్టైలిష్ షేడ్స్ తో ఓ షిప్ మీద ట్రెడిషనల్ లుక్‌లో చిరంజీవి కనిపిస్తున్నారు. కల్చరల్ టచ్, మెగా స్టార్ స్టైల్ రెండూ మిక్స్ అయి పోస్టర్ ఫ్యాన్స్‌కు ఫెస్టివ్ ట్రీట్ అందించింది. ఫ్యాన్స్ ఎలాగైతే చిరంజీవిని చూడాలనుకుంటారో అలాంటి అద్భుతమైన క్యారెక్టర్‌లో చూపిస్తున్నారు. చిరంజీవి సరసన హీరోయిన్‌గా నయనతార నటిస్తోంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ సమీర్ రెడ్డి, సంగీతం భీమ్స్ సిసిరోలియో అందిస్తున్నారు. ఎడిటింగ్ తమ్మిరాజు, ఆర్ట్ డైరెక్షన్ ఏఎస్ ప్రకాష్, ఎస్. కృష్ణ, జి. ఆది నారాయణ సహ రచయితలుగా, ఎస్. కృష్ణ కూడా ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా పనిచేస్తున్నారు. మన శంకరవరప్రసాద్ గారు 2026 సంక్రాంతి థియేటర్లలో గ్రాండ్‌గా రిలీజ్ కానుంది.

## మోహన్‌బాబు -మంచు లక్ష్మి చిత్రం 'దక్ష'



మంచు లక్ష్మి ప్రసన్న ప్రధాన పాత్రలో శ్రీలక్ష్మి ప్రసన్న పిక్చర్స్ అండ మంచు ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై రూపుదిద్దుకుంటున్న చిత్రం 'దక్ష ది డెడ్‌లీ కాన్సిరసీ'. ఇందులో డాక్టర్ మంచు మోహన్ బాబు ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. తండ్రీ కూతుళ్లు కలిసి మొదటి సారిగా ఇందులో కనిపిస్తున్నారు. ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వంశీ కృష్ణ మల్లా అందించారు. ప్రస్తుతం ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని, సెన్సార్ బోర్డ్ నుంచి యు/ఏ సర్టిఫికేట్‌ను సొంతం చేసుకుంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని సెప్టెంబర్ 19న ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా విడుదలయ్యేందుకు సిద్ధమైన ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. ఈ టీజర్‌లో ఇప్పటి వరకు మంచు లక్ష్మి కనిపించని పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తున్నారు. వింత ఆకారంలో ఎలియన్ వంటి ఓ జీవి మనుషుల్ని దారుణంగా చంపే సన్నివేశంతో టీజర్ మొదలైంది. అలాగే ఓ వింత వ్యాధి నేపథ్యం, దాని వెనుక కారణం ఈ టీజర్ లో ఆసక్తికరంగా తీర్చిదిద్దారు. ఇక చివరిలో డాక్టర్ మోహన్ బాబు కనిపించిన ఒకే ఒక్క షాట్.. టీజర్ స్థాయిని పెంచేసింది. ఆయన పాత్ర ఈ సినిమాకు ప్రాణం అనే చెప్పాలి. మంచు మోహన్ బాబు, మంచు లక్ష్మి, సముద్రఖని, మలయాళ నటుడు సిద్దిక్, విశ్వంత్, చిత్రా శుక్లా, రంగస్థలం మహేష్, జెమినీ సురేష్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: అచు రాజమణి, ఛాయాగ్రహణం: గోకుల్ భారతి, నృత్య దర్శకురాలు: బృంద, నిర్మాత : డా:మంచు మోహన్ బాబు, మంచు లక్ష్మి ప్రసన్న,స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వంశీ కృష్ణ మల్లా.

## 'మిరాయ్' ట్రైలర్ విడుదల



సూపర్ హీరో తేజ సజ్జా పాన్ ఇండియా సూపర్ హీరో విజువల్ వండర్ 'మిరాయ్'లో సూపర్ యోధ పాత్రలో అలరించబోతున్నారు. ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్ హైదరాబాద్ లోని ప్రసాద్ ఐమాక్స్ లో ఆవిష్కరించారు. ఇందులో విలన్ గా మంచు మనోజ్ నటిస్తున్నారు. ఈ సందర్భంగా మంచు మనోజ్ మాట్లాడుతూ నా కెరీర్ లో ఈ క్యారెక్టర్ డిఫరెంట్ గా ఉంటుందని అన్నారు. హీరో తేజ సజ్జ మాట్లాడుతూ హనుమాన్ ఎంత బ్లాక్ బస్టర్ అయిందో ఈ సినిమా అంతకంటే పెద్ద హిట్ అవుతుందని ఆశభావం వ్యక్తం చేశారు. మనోజ్ కు తనకు మధ్య సన్నివేశాలు థ్రిల్లింగ్ గా ఉంటాయన్నారు. దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని ఈ సినిమా తరువాత ఎవరికీ దొరకనంత బిజీ అవుతారని నిర్మాత టిజి విశ్వ ప్రసాద్ చెప్పారు. స్క్రీన్‌ప్లేను కార్తీక్ స్వయంగా రూపొందించిన ఈ సినిమాకు మణిబాబు కరణం రచన, సంభాషణలు అందిస్తున్నారు. గౌర హరి సంగీతం, ఆర్ట్ డైరెక్టర్‌గా నాగేంద్ర తంగాల, ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా సుజిత్ కుమార్ కొల్లి పని చేస్తున్నారు. సెప్టెంబర్ 12న ఎనిమిది భాషల్లో 2డి, 3డి ఫార్మాట్లలో విడుదల చేయనున్నట్లు నిర్మాత టిజి విశ్వ ప్రసాద్ ప్రకటించారు.



## వెయ్యిమంది డ్యాన్సర్లతో 'పెద్ది' పాట షూట్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమా కోసం ప్రస్తుతం మైసూర్ లో పాటను చిత్రీకరించారు. వెయ్యిమందికి పైగా డ్యాన్సర్లతో జానీ మాస్టర్ కొరియోగ్రఫీ నేతృత్వంలో ఈ పాటను తెరకెక్కిస్తున్నారు. బుచ్చిబాబు సాన దర్శకత్వంలో వృద్ధి సినిమాస్ బ్యానర్ పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్‌ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ ప్రెజెంట్ చేస్తున్నారు. మైసూర్‌లో రామ్ చరణ్ మీద ఒక గ్రాండ సాంగ్ షూట్ స్టార్ట్ చేశారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్న ఈ సాంగ్‌కి ఆస్కార్ అవార్డ్ విన్నర్ ఏఆర్ రహ్మాన్ సాంగ్ ని అందించారు. వెయ్యి మందికి పైగా డ్యాన్సర్లతో పిక్చరైజ్ అవుతున్న ఈ సాంగ్ కచ్చితంగా ఒక విజువల్ ఫీస్ట్ లా ఉంటుంది. రామ్ చరణ్ తన ట్రేడ్‌మార్క్ ఎనర్జీ, గ్రేస్‌తో చేసిన మాస్ స్టెప్స్ ఈ సాంగ్ ని హైలైట్‌గా నిలుస్తుందని నిర్మాతలు అంటున్నారు. ఈ చిత్రంలో జాన్వి కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్ పవర్‌ఫుల్ రోల్ చేస్తున్నారు. జగపతి బాబు, దివ్యేందు శర్మ కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారు.ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ రత్నవేలు, నేషనల్ అవార్డ్ విన్నర్ నవీన్ నూలి ఎడిటర్. పెద్ది సినిమాను వచ్చే ఏడాది మార్చి 27 రిలీజ్ చేయనున్నారు.

## 'త్రిబాణధారి బార్బరిక్' సెన్సార్ పూర్తి




సత్య రాజ్, వశిష్ట ఎన్ సింహా, ఉదయ భాను, సత్యం రాజేష్, క్రాంతి కిరణ్, సాంచీ రాయ్, మేఘన కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'త్రిబాణ ధారి బార్బరిక్'. వానర సెల్యూలాయిడ్ బ్యానర్ మీద స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పణలో విజయ్ పాల్ రెడ్డి అడిదల నిర్మించిన ఈ 'త్రిబాణధారి బార్బరిక్' మూవీకి మోహన్ శ్రీవత్స దర్శకత్వం వ హించారు. ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. యు/ఏ సర్టిఫికెట్ లభించింది. ఈ సినిమాని ఆగస్ట్ 29న విడుదల చేయబోతోన్నా రు. ఇప్పటికే 'త్రిబాణధారి బార్బరిక్' ప్రివ్యూల్ని వ రంగల్, విజయవాడ వంటి చోట ప్రదర్శించగా మంచి స్పందన వచ్చింది. ఈ మూవీ రిలీజ్ కోసం అందరూ ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రానికి కుశేందర్ రమేష్ రెడ్డి అందించిన విజువల్స్, ఇన్ ఫ్యూజన్ బ్యాండ ఇచ్చిన పాటలు, నేపథ్య సంగీతం ప్రధాన ఆకర్షణ కానున్నాయి.

## సెప్టెంబర్ 3న వర్కింగ్ జర్నలిస్టులకు 'ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ (ఎఐ) వర్క్ షాప్

ప్రజాపక్షం/హైదరాబాద్: వర్కింగ్ జర్నలిస్టుల కోసం 'ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ (ఎఐ) శిక్షణా వర్క్ షాప్‌ను సెప్టెంబర్ 3వ తేదీన హైదరాబాద్ నాంపల్లిలోని మీడియా అకాడమి ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ కార్యదర్శి ఎన్. వెంకటేశ్వర రావు తెలిపారు. వర్క్ షాప్ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు మూడు గంటలపాటు జరిగే ఈ వర్క్ షాప్‌లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ప్రవేశిక, వినియోగించే టూల్స్, పద్ధతులు, దీని ద్వారా రూపొందించే అంశాలలో బాధ్యతాయుత, నైతిక ప్రమాణాలు లాంటి అంశాలు ఇందులో ఉంటాయని ఆయన ఒక ప్రకటనలో వివరించారు. వర్క్ షాప్‌లో పాల్గొనేందుకు ఆసక్తి గల జర్నలిస్టులు వారి పేరు, పనిచేస్తున్న మీడియా సంస్థ, ప్రదేశం, మొబైల్ నెంబర్ వివరాలు తెలుపుతూ అకాడమి వాట్స్ అప్ నెంబర్ 7093600977 కు తమ పేర్లను సెప్టెంబర్2వ తేదీలోగా నమోదు చేసుకోవాలని కోరారు. ముందుగా నమోదు చేసుకున్న అర్హత గల 50 మంది వర్కింగ్ జర్నలిస్టులకు ఈ వర్క్ షాప్‌లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు.

## వరదల్లో చిక్కుకున్న 1,510 మందిని రక్షించాం

### 24/7 సహాయక చర్యలు కొనసాగుతున్నాయి : డిజిపి జితేందర్




ప్రజాపక్షం/ హైదరాబాద్: రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల్లో వరదల్లో చిక్కుకున్న సుమారు 1510 మందిని రక్షించినట్లుగా డిజిపి డాక్టర్ జితేందర్ తెలిపారు. గత రెండు రోజుల నుంచి తెలంగాణను భారీ వర్షాలు, వరదలు ముంచెత్తిన నేపథ్యంలో తన కార్యాలయంలో గురువారం మీడియా ప్రతినిధులతో డిజిపి మాట్లాడుతూ.. ముఖ్యంగా ఉత్తర తెలంగా జిల్లాలైన కామారెడ్డి, మెదక్, నిర్మల్ జిల్లాలు ఏకధాటిగా కురుస్తున్న కుండపోత వానలకు పూర్తిగా జలమయం అయ్యాయని తెలిపారు. కాగా వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు చేపట్టిన సహాయక చర్యలు రాత్రిబవళ్లు కొనసాగుతునే ఉన్నాయన్నారు. వరద ప్రభావిత కామారెడ్డి, నిర్మల్, మెదక్, రామాయంపేట వంటి ప్రాంతాల్లో రాష్ట్ర పోలీసు బలగాలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయని డిజిపి జితేందర్ ప్రకటించారు. గత 24 గంటలుగా పోలీసు ఫోర్స్ వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ ఆపరేషన్లను నిరంతరం నిర్వహిస్తోంది. కామారెడ్డి జిల్లాలో చాలా మందిని సురక్షితంగా రక్షించగలిగామని, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డిఆర్‌ఎఫ్) బృందాలు సకాలంలో చేరుకోవడంతో భారీ ప్రమాదం తప్పిందని ఆయన తెలిపారు. కామారెడ్డి, మెదక్, నిర్మల్, రామాయంపేట ప్రాంతాల్లో వరదల కారణంగా చిక్కుకున్న వందలాది మందిని రక్షించేందుకు ఎస్‌డిఆర్‌ఎఫ్, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డిఆర్‌ఎఫ్), పోలీసు బృందాలు, ఫైర్ సర్వీసెస్, ఆర్మీ యూనిట్లు (టిఎఎస్‌ఎ హైదరాబాద్) రంగంలోకి దిగాయి.

### ఎక్కడెక్కడ ఎంతమందిని రక్షించారు

కామారెడ్డిలో 500 మందికి పైగా, మెదక్‌లో 440 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రామాయంపేటలో ఎస్‌సి మహిళల డిగ్రీ కాలేజీ హాస్టల్ నుంచి 350 మంది విద్యార్థినులను, ఎస్‌సి, ఎస్‌టి వెల్ఫేర్ హాస్టల్ నుంచి 80 మంది విద్యార్థులను రక్షించారు.మెదక్లోని హవేలీ ఘన్పూర్ మండలంలోని దూప్సింగ్ తండాలో 100 మందిని రక్షించారు. కామారెడ్డి జిల్లాలోని అన్నసాగర్ గ్రామంలో 9 మందిని, గుంకుల్ గ్రామంలో 5 మందిని, మెదక్లోని యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ వద్ద 5 మందిని ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు రక్షించాయి.రామాయంపేటలోని బిసి కాలనీ నుంచి 10 మందిని, వాడీ బ్రిడ్జ్ వద్ద 11 మందిని రక్షించారు.

## 30 వేల మంది పోలీసులు (మొదటి పేజీ తరువాయి)

సందర్శించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. సెప్టెంబర్ 6న జరిగే గణేష్ విగ్రహాల నిమజ్జనానికి హైదరాబాద్ సిటీ పోలీసుల తరపున విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఉత్సవాల నిర్వాహకులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, వివిధ ప్రభుత్వ శాఖలతో సమన్వయ సమావేశాలు నిర్వహించామని తెలిపారు. గణేష్ మండపాల కోసం దాదాపు 11,000 దరఖాస్తులలో, 10,900 గణేష్ మండపాలకు ఆన్‌లైన్‌లో అనుమతులు మంజూరు చేశామన్నారు. హైదరాబాద్ నగరంలో మిగిలిన సుమారు 15,000 విగ్రహాలను కూడా రికార్డుల్లోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామని, దీనివల్ల బందోబస్తు చర్యలు చేపట్టడం సులభమవుతుందని తెలిపారు. ఈ ఉత్సవాల కోసం హైదరాబాద్ పోలీస్ విభాగాల నుండి దాదాపు 19,000 మంది పోలీసులు అందుబాటులో ఉంటారు. బయటి జిల్లాల నుండి అదనంగా 8,500 మంది పోలీసులు, 42 ప్లాటూన్లు, 10 సీఏపీఎఫ్ కంపెనీలు, మరియు ఆక్టోపస్ బృందాలు వస్తున్నాయి. మొత్తం సుమారు 30,000 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నామని వివరించారు. నిమజ్జన ఊరేగింపులను సిసిటివి కెమెరాలు, డ్రోన్లు, క్యూఆర్ కోడ్ ఆధారిత స్టిక్కర్లతో పర్యవేక్షించనున్నామని తెలిపారు. హుస్సేన్ సాగర్, మీరాలం ట్యాంక్, రాజన్న భావి, ఎన్టీఆర్ స్టేడియం వంటి ప్రాంతాలలో ప్రస్తుతం 9 క్రేన్లను ఏర్పాటు చేశాము,జిహెచ్ ఎంసి, ఆర్ అండ బి మరియు ఇతర శాఖల సమన్యముతో చివరి రోజు వరకు ఈ సంఖ్యను 40 కి పెంచుతామని తెలిపారు. ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ సమితి వారు నిమజ్జనానికి ఒక రోజు ముందు నుండే ఏర్పాట్లు చేస్తామని, ఆ రోజు మధ్యాహ్నం వరకు నిమజ్జనం పూర్తయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.ఖైరతాబాద్ గణేష్ విగ్రహాన్ని రోజువారీగా 60 నుండి 70 వేల మంది సందర్శిస్తున్నారు. రాబోయే పది రోజులు వర్షాలు ఉన్నందున, బందోబస్తు విధుల్లో ఉన్న తమ సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. తరువాత సి.వి. ఆనంద్, ఇతర అధికారులు కలిసి ఖైరతాబాద్ గణేష్ మండపానికి వెళ్లే దారులను, బారికేడింగ్ వ్యవస్థను పరిశీలించారు. గణేష్ విగ్రహాలు మూడవ రోజు నుండి నిమజ్జనానికి వస్తాయి కాబట్టి, ట్యాంక్ ఒడ్ నెక్లెస్ రోడ్, ఇతర నిమజ్జన పాయింట్లను కూడా పరిశీలించారు. శాంతియుతంగా ఉత్సవాలు నిర్వహించడానికి ప్రజల సహకారం కోరుతున్నామని సి.వి. ఆనంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐపిఎస్ అధికారులు విక్రమ్ సింగ్ మాన్,డి. జోయల్ డెవిస్,కె. అపూర్వా రావు,కె.శిల్పావల్లి లు పాల్గొన్నారు.

## సిపిఐ సంపూర్ణ మద్దతు (మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి సిపిఐ తన సంపూర్ణ మద్దతును, సంఘీభావాన్ని ప్రకటించింది.

### రాజ్యాంగ రక్షకులు –వ్యతిరేకుల మధ్య పోరాటం : నారాయణ

ఉపరాష్ట్రపతి పదవికి జరుగుతున్న ఎన్నిక రాజ్యాంగ రక్షకులకు, రాజ్యాంగ వ్యతిరేకులకు మధ్య జరుగుతున్న పోరాటం అని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. గురువారం ఢిల్లీలోని ఎపి భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గుణగణాలను ప్రత్యేకంగా వివరిస్తూ, గ్రామీణస్థాయిలో మొదలై ఉన్నతమైన సుప్రీంకోర్టు న్యాయమూర్తిస్థాయి వరకూ ఆయన ఎదిగారని, అభ్యుదయవాదిగా, రాజ్యాంగ పరిరక్షకుడుగా పేరుగడించారని ప్రశంసించారు. ఈ ఎన్నిక కేవలం అత్యున్నతమైన రాజ్యాంగ పదవి కోసం జరిగే పోటీ మాత్రమే కాదని రాజ్యాంగ పరిరక్షకులకు, రాజ్యాంగ వ్యతిరేకులకు మధ్య జరిగే పోరాటమని అన్నారు.

### బిజెపిలో భయాందోళన

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేరును ప్రతిపక్షం ప్రకటించగానే ఎన్‌డిఎ కూటమిలో భయం, వణుకు మొదలైందని కె.నారాయణ అన్నారు. మావోయిస్టులను సమర్థించారంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆయనపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఈ వ్యాఖ్యలు బిజెపిలో ఏర్పడిన భయాన్ని తెలియజేస్తున్నాయని విమర్శించారు. ఇప్పటివరకూ ఉపరాష్ట్రపతి పదవిలో కొనసాగిన జగదీప్ ధన్‌కర్ రాజీనామా చేశాక ప్రస్తుతం ఆయన ఎక్కడ ఉన్నారో కూడా దేశ ప్రజలకు తెలియని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. బిజెపికి వ్యతిరేకంగా ఉన్నందుకే ఆయనను మధ్యలోనే పదవి నుండి తప్పుకునేలా చేశారని విమర్శించారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అభ్యర్థిత్వానికి యావత్ ప్రతిపక్షం మద్దతుగా నిలబడిందని, భారత కమ్యూనిస్టుపార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నదని స్పష్టం చేశారు. 'ఇండియా' కూటమికి వెలుపల ఉన్న ఆమ్ ఆద్మీపార్టీ కూడా సుదర్శన్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని స్వాగతించిందన్నారు.

### తెలుగు రాష్ట్రాలకు పిలుపు

తెలుగువారైన జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు, ప్రతిపక్ష నాయకుడు జగన్ ఇద్దరూ మద్దతు ఇవ్వాలని కె.నారాయణ విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అభ్యర్థిత్వంపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఆయన కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి కాదనీ, ప్రజాస్వామ్య పరిరక్షణకోసం పోరాటానికి దిగిన ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి అనీ స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో బిజెపిని ఓడించడంద్వారా మాత్రమే ప్రజాస్వామ్యాన్ని కాపాడగలమని ఇది కేవలం ఒక ఎన్నిక మాత్రమే కాదనీ, రాజ్యాంగ రక్షణకోసం జరిగే ప్రజాస్వామ్య యుద్ధమని నారాయణ అన్నారు.

## లక్ష మందితో తెలంగాణను దిగ్బంధిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయాలు, తీర్మానాలు, భవిష్యత్ పోరాట కార్యాచరణతో పాటు రాష్ట్ర నూతన నాయకత్వ ఎన్నిక వివరాలను ఆయన వెల్లడించారు.

### 'స్థానిక' ఎన్నికల్లో సాధ్యమైనన్ని ఎక్కువ స్థానాల్లో పోటీ

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధ్యమైనన్ని ఎక్కువ స్థానాల్లో పోటీ చేయనున్నట్లు కూనంనేని సాంబశివరావు తెలిపారు. కలిసొచ్చిన చోట, కాంగ్రెస్, సిపిఐ(ఎం)లతో పొత్తు కొనసాగుతుందని, సాధ్యం కాని చోట సిపిఐ ఒంటరిగా సాధ్యమైనంత ఎక్కువ స్థానాలలో బరిలోకి నిలుస్తుందని చెప్పారు. రానున్న ఈ మూడేళ్ల కాలంలో తమకు బలం ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలకు గుర్తించి ప్రజలతో మమేకం కావడం ద్వారా వారి సమస్యలను పరిష్కరించి మరింత పార్టీ బలోపేతం అయ్యేందుకు చర్యలు తీసుకోనుతున్నట్లు చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో పొత్తులు ఉన్నా లేకపోయినా ఒక్క స్థానంలోనే పోటీ అనేది ఉండబోదని మహాసభ అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాష్ట్రంలో దశల వారీగా పెద్దఎత్తున ఉద్యమాలను చేపట్టనున్నట్లు కూనంనేని ప్రకటించారు. ఎన్నికలలో ఇచ్చిన అ న్ని హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ త్వరలోనే లక్షలాది మందితో రాష్ట్రాన్ని దిగ్భంధించాలని మహాసభలో నిర్ణయం తీసుకున్న ట్లు కూనంనేని సాంబశివరావు తెలిపారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటాలను చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా సిపిఐ జాతీయ సమితి నిర్ణయాల మేరకు ఉద్యమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

### సింగరేణిని 'ప్రైవేట్' దిశగా వద్దు

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, ప్రైవేట్‌పరం చేసే కుట్రలో భాగంగానే వాటిని కావాలనే నిర్లక్ష్యం చేస్తున్నట్లు కనిపిస్తోందని కూనంనేని సాంబశివరావు సందేహం వ్యక్తం చేశారు. ఆర్‌టిసిలో ఇప్పటివరకు కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించడంలేదని, వారి సమస్యలను పరిష్కరించలేదని, సింగరేణిని ప్రైవేటీకరణ దిశగా చర్యలు చేపట్టడం ప్రభుత్వానికి తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకోవడంతో పాటు కార్మికుల హక్కుల పరిరక్షణకు ఉద్యమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాల్సి ఉండగా అటు కేంద్ర ప్రభుత్వం ఇటు రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నాయని, ఈ ఫ్యాక్టరీని సాధించుకునేంత వరకు ఉద్యమం చేపట్టనున్నట్లు వెల్లడించారు.

### నియంతలా ఆర్‌టిసి ఎండి సజ్జనార్

ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ విసి సజ్జనార్ ఓ నియంతలా వ్యవహరిస్తున్నారని కూనంనేని సంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సజ్జనార్ ముఖ్యమంత్రో లేక రవాణా శాఖ మంత్రో కాదని, కేవలం ఆయన ఓ అధికారి అనేది గుర్తుంచుకోవాలని సూచించారు. సజ్జనార్ ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ అని ప్రచారం ఉండొచ్చు, కానీ అలాంటి భయానక వాతావరణాన్ని ఆర్‌టిసిలో సృష్టించి కార్మికులను భయాభ్రాంతులకు గురిచేయడమేమిటని ప్రశ్నించారు. సజ్జన్నార్ తన ఇష్టానుసార నిర్ణయాలతో కార్మికులను ఇబ్బందులకు గురిచేయడం మానుకోవాలని లేకపోతే ఆయన అక్కడి నుంచి వెళ్లి పోయేంతవరకు తమ ఉద్యమం కొనసాగుతుందని కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు.

### సాగునీటి ప్రాజెక్టుల కోసం పోరాటం

రాష్ట్రంలో అతి తక్కువ వ్యయంతో పూర్తి కావాల్సిన అనేక ప్రాజెక్టులు ఉన్నప్పటికీ, గత బిఆర్‌ఎస్ సర్కార్ పట్టించుకోకుండా కాళేశ్వరం ప్రధాన ఎజెండాగా వేల కోట్ల అప్పులు తెచ్చి మట్టిలో పోశారని కూనంనేని విమర్శించారు. తక్షణమే పూర్తి కావాల్సిన సాగునీటి ప్రాజెక్ట్‌లకు కాంగ్రెస్ ప్రభుత్వం సరిపోయే నిధులను కేటాయించి వాటిని పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు రాష్ట్ర , రైతాంగ సమస్యలపై పోరాటాలు ఉధృతం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

### గుడిసెవాసులకు పట్టాలు ఇవ్వాలి

దశబ్దాల కాలంగా ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న లక్షలాది మంది నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పట్టాలను మంజూరు చేయాలని కూనంనేని సాంబశివరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో పేదలు ఈ స్థలాలను అక్రమించుకుని గుడిసెలు వేసుకోకపోతే, భూకబ్జాదారులు వీటిని ఎప్పుడో అన్యాక్రాంతం చేసేవారన్నారు. పేదలకు పట్టాలు ఇవ్వడం ద్వారా ప్రభుత్వానికి పైసా ఖర్చు లేకపోగా, సిఎంకు మంచి పేరు వస్తుందని, ఇందుకు సంబంధించి తక్షణమే నిర్ణయం తీసుకోవాలని కోరారు. అధికారులు పేదల గుడిసెలను నిర్ధాక్షిణ్యంగా తొలిగించి నిరాశ్రయులను చేయడం సరికాదని,పేదల ఇళ్లను కూల్చడంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు.

### 11 నుంచి 17 వరకు సాయుధపోరాట వారోత్సవాలు

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను సెప్టెంబర్ 11 నుంచి 17 వ తేదీ వరకు సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు కూనంనేని సాంబశివరావు ప్రకటించారు. తెలంగాణ సాయుధ పోరాటయోధుల త్యాగాలను ప్రభుత్వం గుర్తించాని ఆయన కోరారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను సమైక్యత దినోత్సవం పేరుతో కాకుండా నాటి సమరయోధుల ఉద్యమాన్ని, వారి త్యాగాలను స్ఫురించే విధంగా సెప్టెంబర్ 17కు నామకరణం చేసి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

### సెప్టెంబర్ 21న అన్ని శాఖల్లో జెండా పండుగ

సెప్టెంబర్ 21 నుంచి 25 వరకు జాతీయ మహాసభలు చండీగఢ్ లో జరుగనున్నాయని, ఈ మహాసభలకు రాష్ట్రం నుంచి 82 మంది ప్రతినిధ్యం వహించనున్నరని వెల్లడించారు. జాతీయ మహాసభ ప్రారంభానికి సంఘీభావంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాఖలలో 21న సిపిఐ జెండాలను ఎగురవేయాలన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com